ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. నేరానికి నేస్తం—ప్రతాప రవిశంకర్
15. కోరుకున్న చావు—విద్వాన్ షీలాదేవి
41. మోజు— వసుంధర
54. చేతులు కాలాయి—విశ్వమోహిని
60. ఆరడుగుల శవం—బొమ్మిడి అచ్చారావు
77. పొదుపరి భర్తలు - గడసరి భార్యలు —జొన్నలగడ్డ రామలక్ష్మి
89. కాళిదాసు పారిపోయాడు—కె. వి. రమణ
100. మర్డర్ హంట్—తిరుమలశ్రీ
120. పెళ్ళి డబ్బు—బి. రాజేశ్వరి
137. జ్వాల—యం. వి. వి. సత్యనారాయణ
158. ఆనంద తాండవం—కాశీభట్ల భానుమూర్తి
165. సాగర లోయ (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

నవలలు (సప్లిమెంట్)

3. మహిమగల దేవుడు—వసుంధర
34. రాధ చావాలి—టెంపోరావు
74. స్లోపాయిజన్—జొన్నలగడ్డ రామలక్ష్మి
108. ముగ్గురు ముద్దాయిలు—ఎమ్. వి. వి. సత్యనారాయణ
146. విషసర్పాలు (సీరియల్)—సికిందర్

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

201

నేరానికి నేస్తం

ప్రతాప రవిశంకర్

21

సెకండు ఫ్లోరులో వున్న సర్వీసింగ్ ఏజెన్సీ ఆఫీసులో ఫోను మోగింది. ఎకవుంట్సు చూస్తున్న సుమతి బద్ధకంగా ముందుకు వొంగి రిసీవర్ తీసుకుని "సర్వీసింగ్ ఏజెన్సీ" అన్నది.

సుమతి ఆ ఏజెన్సీ మేనేజర్. ఆమెకు నలభై ఐదేళ్ళు వుంటాయి. బాగానే లావుగా వుంటుంది. ఆమె ఎందు

వల్లనో పెళ్ళి చేసుకోలేదు. ఎవర్నో ప్రేమించిందనీ— పెళ్ళి చేసుకోవాలని అనుకున్న తర్వాత అతను ఓ యాక్సిడెంటులో పోయాడనీ—అందువల్లనే ఆమె అలా ఉండిపోయిందనీ ఆ ఏజన్సీ ఆఫీసులో ఒకరిద్దరికి తెలుసు.

"నేను బిజినెస్ మాగ్నెట్ మెహతాని మాట్లాడుతున్నాను" అన్నాడు అతను అవతల్నించి.

"చెప్పండి" అన్నదామె.

"మా ఇంట్లో నా ఆఫీసు గది చాలా దారుణంగా ఉన్నది. అందుకే మీ ఏజెన్సీకి ఫోన్ చేశాను."

"థాంక్ యు. మీ ఫోన్ నెంబర్ ఎడ్రసు చెప్పండి. రేపు ఉదయమే నేను మా ఎంప్లాయీని పంపిస్తాను" అన్నది నెమ్మదిగా.

చిందర వందరగా ఉన్న ఆఫీసు గదులను, ఇంట్లో సామాన్లను రెండు మూడు గంటల్లో నీటుగా సర్దిపెట్టడం సర్వీసింగ్ ఏజెన్సీ పని. అందులో పన్నెండు మంది యువతులు పని చేస్తున్నారు. అలా సర్దినందుకు వాళ్ళు బాగానే చార్జ్ చేస్తారు.

"మై గాడ్....రేపు ఉదయం వరకు నేను వెయిట్ చెయ్యలేను. ఆ గదిలో నాకు కావలసిన కొన్ని ముఖ్యమైన కాయితాలు వున్నాయి. అవి నాకు రెండు మూడు గంటల్లో కావాలి. ప్లీజ్ ఇప్పుడు మీరు ఎరేంజ్ చెయ్యాలి. ఎంత చార్జ్ చేసినా ఫర్వాలేదు" అన్నాడు మెహతా రిక్వెస్ట్ చేస్తున్నట్టు—

సుమతి వెంటనే ఏమీ మాట్లాడలేకపోయింది. 'ఆల్వేస్ ఎట్ యువర్ సర్వీస్' అనే బోర్డు ఆమె ఎదురుగా వేల్లాడుతూ వున్నది. రాత్రి ఏడు గంటల వరకే ఆ ఆఫీసు పని చేస్తుంది. ఆ తర్వాత అందరూ వెళ్ళిపోతారు.

కాని ఈ రోజు ఆ ఏజన్సీలో ఉద్యోగి అయిన లావణ్య ఆఫీసులోనే మరో గదిలో ఓ నవల చదువుతూ కూర్చు న్నది. ఆమెను సుమతి రిక్వెస్టుచేసి ఉండమన్నది-ఇద్దరూ కలిసి వెళ్ళవచ్చునన్నది....

సుమతి భారంగా నిట్టూర్చి "మిస్టర్ మెహతా ఇప్పుడు టైము ఎనిమిది కావస్తోంది. ఒక రకంగా ఇది ఎమర్జన్సీ సర్వీసు. అందువల్ల డబుల్ ఫీజు చార్జ్ చేస్తాము. ఇప్పుడే మీ ఇంటికి మా ఏజెన్సీ ఉమన్ లావణ్యను పంపుతున్నాను" అన్నది.

"థాంక్ యూ వెరీమచ్ మేడమ్" అని ఫోన్ పెట్టే శాడు మెహతా తన ఎడ్రసు చెప్పి.

ఆ తర్వాత ఆమె చిన్నగా లేచి లావణ్య కూర్చుని వున్న గదిలోని వెళ్ళింది.

"ఇక బయల్దేరుదామా?" అన్నది లావణ్య - సుమతిని చూడగానే—

"సారీ లావూ....ఎమర్జన్సీ సర్వీస్....బిజినెస్ మాగ్నెట్ మెహతా ఫోన్ చేశాడు" అని చెప్పింది సుమతి.

వాచీ చూసుకున్నది లావణ్య. తర్వాత సుమతి ఇచ్చిన ఎడ్రసు స్లిప్‌ను హాండ్ బ్యాగ్‌లో వేసుకుని గుడ్‌నైట్ చెప్పి అక్కడినించి బయల్దేరింది.

నిజానికి లావణ్యకు ఆ టైములో సర్వీసింగ్‌కి వెళ్ళటం ఇష్టంలేదు. కాని-సుమతి కమిట్ అయిందనీ, తను వెళ్ళక పోతే తమ ఏజన్సీకి బేడ్‌నేమ్ వస్తుందనీ ఒప్పుకున్నది.

2

కాలింగ్ బెల్ నొక్కింది లావణ్య.

వెంటనే తలుపు తెరుచుకున్నది. ఎదురుగా లుంగీ— బనియన్‌తో మెహతా నిల్చునివున్నాడు.

"రండి" అన్నాడు చిరునవ్వుతో.

"ఇంట్లో ఎవరూ లేరా?" అడిగింది లావణ్య ఒక్కసారి అంతా కలియచూసి.

"ఉన్నారు. ఐదు నిముషాల క్రితమే పక్కయింటికి వెళ్ళారు. నా మాట కాదనకుండా ఇంత రాత్రి సమయంలో రిస్కు తీసుకుని వచ్చినందుకు థాంక్స్" అన్నాడు మెహతా.

"నో మెన్షన్. రిస్కు తీసుకున్నందుకు ఎక్కువగానే చార్జ్ చేస్తాము. ముందు మీ ఆఫీసు రూము చూపించండి" అన్నది లావణ్య మరోసారి వాచీ చూసుకుని.

మెహతా అక్కడి నించి కదిలి హాలులోకి నడిచాడు. ఆమె అతడిని అనుసరించి వెళ్ళింది.

హాలుని ఆనుకుని ఉన్న ఓ గదిని ఆమెకు చూపించాడు. దానిమీద 'ఆఫీసు' అనే చిన్న బోర్డు వేల్లాడుతోన్నది.

తలుపు తెరుచుకొని లోపలకు నడిచింది లావణ్య.

ఆ గదిలో టేబిల్ మీద ఇతర రాకుల్లో కాయితాలు చిందర వందరగా వున్నాయి.

ఒక్కసారి ఆ కాయితాలను—ఆ చిన్న గదినీ పరికించి ఓ గంటలో ఆ గదినంతటినీ నీట్‌గా సర్ది వెయ్యవచ్చని అనుకున్నది ఆమె.

భుజానికి వున్న హ్యాండ్ బ్యాగ్‌ను తీసి టేబిల్ మీద ఉంచి తన పనిలో మునిగిపోయింది.

ఐదు నిముషాలు గడిచాయి.

గదికి ఉన్న తలుపు తెరుచుకున్నది. ఆమె వెనక్కు తిరిగి చూసింది.

మెహతా నవ్వుతూ నిల్చుని వున్నాడు. అతని చేతిలో సిగరెట్టు ఎర్రగా కాలుతోన్నది. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి.

ఉన్నట్టుండి అతను గదికి బోల్టు వేశాడు.

ఉలిక్కిపడింది లావణ్య.

"ఏమిటిది?" అన్నది కొంచెం ధైర్యంగా.

"నువ్వు దబ్బపండులా ఉన్నావ్!" వెకిలిగా నవ్వాడు.

నవ్వి రెండడుగులు ముందుకు వేశాడు.

"అక్కడే ఆగండి."

మళ్ళీ నవ్వాడతను....

"ప్లీజ్. నన్నేమీ చెయ్యకండి."

"డోంట్ టాక్... నువ్వు సర్వీపింగ్ ఏజెన్సీలో పని చేస్తున్నావు. ఇలా మాట్లాడకూడదు. కావాలంటే నువ్వు ఎంతయినా చార్జ్ చేసుకో. ఏమంటావ్ సుందరీ?"

"వద్దు.... నేను పెళ్ళి కావలసినదాన్ని. నా జీవితాన్ని నాశనం చెయ్యొద్దు. ప్లీజ్. నన్ను వదలండి" ప్రాధేయ పడుతున్నట్టుగా అన్నదామె.

ఐనా మెహతా ఆమె మాటలు వినిపించుకోలేదు. ఓల్డ్ టావరిన్ విస్కీ బాగానే పని చేస్తున్నది అతనిలో.

ఆమె భుజాలమీద చేతులు వేశాడు.

విదిలించుకున్నది లావణ్య. ఆమె కళ్ళ నిండుగా భయమే వున్నది.

అతనికి కోపం వచ్చింది. ఒక్కసారిగా ఆమెను వెనక్కి నెట్టేశాడు. దబ్ మని కింద పడింది. అంతే.... ఆమె మీద పడిపోయాడు.

లావణ్య గింజుకున్నది. అతని బలం ముందు ఆమె ప్రయత్నాలు ఫలించలేదు.

ఐదు నిముషాలు గడిచాయి.

అతను లేచి నిల్చున్నాడు....

నవ్వుతూ ఆమెకేసి చూశాడు. లావణ్య ఏడుస్తోంది.

"నీ ఫీజు ఎంత ఇవ్వమంటావ్ డియర్" అన్నాడు మెహతా.

"నీకు జైలు శిక్ష" అన్నదామె లేచి నిల్చుంటూ.

"జైలుశిక్షా!" అన్నాడతను.

"అవును. నువ్వు నన్ను రేప్ చేశావని ఇప్పుడే ఇలాగే పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి రిపోర్టు చేస్తాను. నీ అంతు చూస్తాను" అన్నది లావణ్య రోషంగా.

అదే ఆమె చేసిన పొరపాటు.

మైకంలో మునిగిన మెహతా కళ్ళముందు పోలీసులు కదిలారు. ఆ తర్వాత తను జైల్లో ఇనుప కడ్డీల వెనుక నిల్చున్నట్టు కూడా అనిపించింది.

అంతే. అతను ఒక్కసారిగా ముందుకు వొంగి రెండు చేతులతో ఆమె గొంతు పట్టుకున్నాడు.

గట్టిగా నొక్కాడు....

లావణ్య పిట్టలా విలవిల్లాడిపోయింది.

అతను ఆమెను వదల్లేదు. పళ్ళు బిగించి ఆమె గొంతును కర్కశంకా నొక్కేశాడు.

ఆమె కనుగుడ్లు బయటకు వచ్చాయి ఎత్తుగా. ఆమె మొహం వికృతంగా అయింది.

రెండు నిముషాల తర్వాత ఆమె అచేతనంగా వుండిపోయింది.

అప్పుడు తన పట్టు వదిలాడు మెహతా.

ఆమె వెనక్కి విరుచుకు పడిపోయింది.

సర్వీసింగ్ ఏజెన్సీ నించి వచ్చిన ఆ యువతి చనిపోయిందని నిర్ధారణ చేసుకొన్న తర్వాత మెహతా ఆ గదిలోనే ఓ మూలగా స్టాండుమీద ఉన్న టెలిఫోన్ దగ్గరకు నడిచాడు.

అప్పుడే అతన్ని ఆవరించుకుని వున్న మత్తు క్రమంగా వదులుతోన్నది.

డయల్ చేశాడు.

క్షణం తర్వాత కనెక్షన్ వచ్చింది.

రాజన్‌తో రెండు నిముషాలు మాట్లాడాడు.

ఆ తర్వాత ఫోన్ పెట్టేసి ఒక్కసారి వికృతంగా ఉన్న లావణ్యను చూసి, బోల్టుతీసి ఆ గదిలోనించి బయటకు వచ్చాడు.

ఆ తర్వాత అతను రెండు సిగరెట్లు కాల్చాడు. మూడో సిగరెట్టు వెలిగించబోతున్నప్పుడు కాలింగ్ బెల్ మోగింది.

వెళ్ళి తలుపులు తెరిచాడు మెహతా.

ఎదురుగా రాజన్ నిల్చునివున్నాడు.

3

రాజన్ లోపలకు వచ్చిన తర్వాత తలుపులు మూశాడు మెహతా.

"ఏమిటీ అర్జెన్సీ" అన్నాడతను మెహతా మొహంలో కనపడుతున్న కంగారును చూసి.

రాజన్ లావుగా-పొడుగ్గా వున్నాడు. పైకి దువ్విన క్రాపు-నల్లని ప్యాంటు, గ్రీన్ కలర్ షర్టు వేసుకున్నాడు.

"ముందు కూర్చో" అని తను ఓ కుర్చీలో కూర్చుని మూడో సిగరెట్టు వెలిగించాడు మెహతా. రాజన్‌కి కూడా సిగరెట్ యిచ్చి పొగ వదులుతూ జరిగిందంతా చిన్నగా చెప్పేశాడు.

"మై గాడ్....హత్యా!!" అన్నాడు రాజన్.

"అవును. ఆమె నన్ను బెదిరించింది. నన్ను పోలీసులకు పట్టించి జైలుశిక్ష వేయిస్తానని అన్నది. అందుకే

భయపడి ఆమె గొంతు నొక్కేశాను. శవం ఆఫీసు గదిలో వుంది."

(201)

నిమిషం మౌనం తర్వాత ఇద్దరూ ఆ గదిలోకి వెళ్ళారు.

శవాన్ని చూసి "బాగానే నొక్కావు" అన్నాడు రాజన్.

"అవును. కసికొద్దీ నొక్కాను."

"ఇప్పుడేం చేద్దాం?"

"అందుకే నీకు ఫోన్ చేశాను. మనం ఈ శవాన్ని మాయం చెయ్యాలి. లేకపోతే ప్రమాదం."

"ఎక్కడ పారేద్దాం?"

"ఇంటికి వెనుకవేపు మట్టి దిబ్బలు వున్నాయి. శవాన్ని కార్లో వేసుకొని వెళ్ళి అక్కడే గొయ్యి తవ్వి పూడ్చేద్దాము. ఈ టైములో అటువైపు ఎవ్వరూ రారు" అన్నాడు మెహతా.

"అయితే మనం వెంటనే పని ప్రారంభించాలి" అన్నాడు రాజన్.

మెహతా లుంగీ విప్పి ప్యాంటు షర్టు వేసుకున్నాడు. గదిలో వెలుగుతున్న పెద్ద లైటును ఆర్పి చిన్న దీపాన్ని వెలిగించాడు.

ఆ తర్వాత యిద్దరూ లావణ్య శవాన్ని పట్టి బయటకు తీసుకువచ్చారు.

శవాన్ని గ్యారేజ్‌లోకి తీసుకువెళ్ళి కారుడిక్కీలో పడేశారు.

ఐదు నిముషాల తర్వాత శవాన్ని, మరో యిద్దరు బతికి వున్న మనుషులను మోసుకుంటూ తెల్లటి ఎంబాసిడర్ కారు అక్కడి నించి బయలుదేరింది.

4

ఉదయం తొమ్మిది గంటలు కావస్తోంది.

మెహతా యింటి ముందు పోలీసు జీపు ఆగింది. అందులోంచి ఇన్ స్పెక్టర్ వర్ధన్ - సర్వీసింగ్ ఏజెన్సీ లావుపాటి సుమతి, మరో యిద్దరు కానిస్టేబుల్స్ దిగారు.

తలుపు తీసి ఎదురుగా కనిపించిన పోలీసులను చూపి ముందు షాక్ తిన్నా తర్వాత వెంటనే తేరుకుని వారిని లోనికి ఆహ్వానించాడు మెహతా.

"ఏమిటిలా వచ్చారు?" అడిగాడతను ఇన్ స్పెక్టర్ ని.

"రాత్రి మీ యింటికి సర్వీసింగ్ కి వచ్చిన లావణ్య ఆఫీసుకుగాని, ఇంటికి గాని తిరిగి రాలేదని కంప్లయింటు యిచ్చింది ఈమె. అందుకే మీ దగ్గరకు వచ్చాము."

"ఆశ్చర్యంగా వుంది ఆమె అసలు ఇక్కడకు రాలేదు."

"రాలేదా!" ఆశ్చర్యపోతూ అన్నది సుమతి.

"అవును మేడమ్. రాత్రి మీరు ఓ యువతిని పంపిస్తున్నట్టు ఫోన్ చేసి చెప్పారు. ఆ తర్వాత గంటసేపటి వరకు వెయిట్ చేశాను. ఎవరూ రాలేదు. మళ్ళీ మీకు ఫోన్ చేశాను. కాని ఎవ్వరూ ఫోన్ తియ్యలేదు."

"అయితే ఏమైవుంటుంది?" అన్నది సుమతి.

"దారిలోనే ఎవరయినా దుండగులు ఆమెను మాయం చేసివుండవచ్చు" అన్నాడు మెహతా.

"ఒకసారి ఇంటినంతా సెర్చ్ చేస్తాము మీకు అభ్యంతరం లేకపోతే" అన్నాడు ఇన్ స్పెక్టర్.

"నో అబ్జెక్షన్" అన్నాడు మెహతా నిల్చుంటూ.

ఇన్ స్పెక్టర్ - ఇద్దరు పోలీసులు ఆ ఇంటినంతా సోదా

చేశారు. వారికి లావణ్యకు సంబంధించి ఎటువంటి ఆచూకీ దొరకలేదు.

"సారీ ఫర్ ది ట్రబుల్" అని మిగిలిన వాళ్ళతో ఇన్ స్పెక్టర్ వెళ్ళిపోయాడు.

వాళ్ళంతా వెళ్ళిపోయిన తర్వాత మెహతా గట్టిగా గాలి పీల్చుకున్నాడు. హత్యానేరం తనని సులభంగా వదిలిపోయి నందుకు సంతోషపడిపోయాడు.

5

సాయంత్రం నాలుగు గంటలవుతున్నప్పుడు మెహతా, రాజన్ ఎదురెదురుగా కూర్చుని వున్నారు. వారి మధ్య టీపాయ్‌మీద ఓల్డ్ టావరిన్ విస్కీ సీసా ఐస్ క్యూబ్స్ - గ్లాసులు వున్నాయి.

మెహతా విస్కీని గ్లాసుల్లోకి వంచాడు.

ఛీర్స్ కొట్టారు.

ఇద్దరూ గ్లాసులను పెదవులను తాకించబోతున్నప్పుడు తలుపులు భళ్ళున విసురుగా తెరుచుకున్నాయి.

ఉలిక్కిపడ్డారు స్నేహితులిద్దరూ ....

ఎదురుగా—

పోలీసు ఇన్ స్పెక్టర్ మరికొంత మంది పోలీసులు— మరో మనిషి నిల్చుని వున్నారు. ఇన్ స్పెక్టర్ చేతిలో బేడీలు వున్నాయి.

"డియర్ మెహతా .... మిమ్మల్ని దురదృష్టం వెంటాడింది. సర్వీసింగ్ ఏజెన్సీ యువతి లావణ్యను రేప్‌చేసి గొంతునొక్కి హత్య చేసినందుకు మిమ్మల్ని అరెస్టుచేయక తప్పదు" అన్నాడు యిన్ స్పెక్టర్ చిరునవ్వుతో.

ఈసారి మెహతా కళ్ళలో భయం కదలాడింది.

అతను యేదో మాట్లాడబోయాడు. కాని యింతలోనే యిన్‌స్పెక్టర్ "మీరు హంతకులు కాదని రుజువు చేసుకోవటం చాలా కష్టం. ఆమెను మీరు హత్య చెయ్యటం, ఆ తర్వాత యిప్పుడు మీ పక్కనే వున్న మీ స్నేహితుడి సాయంతో ఆమె శవాన్ని ఊరిబయట దిబ్బల్లో పూడ్చెయ్యటం ఎవ్వరికీ తెలియదనే అనుకున్నారు. కాని మీ నేరాన్ని ఒక సాక్షి చూశాడు. అతనే ఈ రిక్షా డ్రయివర్.

లావణ్య ఏజెన్సీ ఆఫీసు నించి రిక్షాలో వచ్చింది. మీ యింటిముందు రిక్షా దిగిన తర్వాత తను ఓ గంటలో వస్తాననీ అంతవరకు వెయిట్ చేస్తే అందుకు టిప్ యిస్తాననీ అన్నది. అందుకనే యితను రిక్షాతో మీ ఇంటి ఎదురుగా వున్న రోడ్డు మొదట్లో కాచుకున్నాడు.

ఆమె ఎంతసేపటికీ రాలేదు. ఆమెకోసం తనే బయల్దేరాడు. అప్పుడే మీరు శవాన్ని తీసుకువచ్చి డిక్కీలో వేసుకుని బయల్దేరారు. మిమ్మల్ని వెంటాడి శవాన్ని పూడ్చెయ్యటం చూశాడు. తర్వాత వెళ్ళిపోయాడు.

ఇతనికి భయమేసింది. జ్వరంకూడా వచ్చింది. అయినా ఓ గంటక్రితమే వచ్చి ఈ విషయమంతా నాతో చెప్పేశాడు. శవాన్ని బయటకు తీశాము. ఇప్పుడైనా మీ నేరం ఒప్పుకుంటారా?" అన్నాడు.

మెహతా మాట్లాడలేదు.

రాజన్ ముందుకు వచ్చి "ఆల్‌రైట్. ఇన్‌స్పెక్టర్.... ఓ హంతకుడికి సహాయపడిన నేరానికి నన్ను అరెస్టు చేయండి" అన్నాడు. □

కోరుకున్న చావు

విద్వాన్ షీలాదేవి

"కాఫీ తీసుకోండమ్మా!" అంది పనిమనిషి ట్రే ముందుకు చాపుతూ.

ఈజీ ఛేర్‌లో జారగిలబడి పేపర్ చూస్తున్న శ్రీదేవి కప్పందుకుని, "చక్కెర వెయ్యలేదు కదా?" అడిగింది.

"లేదమ్మా! నిన్ననే చెప్పారుగా వెయ్యొద్దని!"

"ఈ రోజే కాదు. ఇక ముందుకూడా వెయ్యొద్దు,

డాక్టర్ అనుమతించేవరకు. నిన్న డాక్టర్ని కలుసుకున్నాకే తెలిసింది, ఇంతకాలం నేను బాధపడుతోంది డయాబిటిస్‌తో నని. అంటే, చక్కెరవ్యాధి. అర్థమైందా?"

"అలాగే నమ్మా!" తలూపి వెళ్ళిపోయింది పనిమనిషి.

మొదటిసారి చేతిలో వున్న చక్కెరలేని కాఫీ చప్ప రించి చూసింది శ్రీదేవి. కషాయంలా తోచి, మొహం చిట్లించింది. తప్పదు. అలవాటు చేసుకోవాలి. తాగకుండా మానేద్దామంటే, ఉదయం పూట కాఫీ లేనిదే మెదడు మొద్దు బారి పోయినట్టుంటుంది మరి!

అతి కష్టంమీద అరకప్పు ఖాళీచేసి, మగితాది మింగుడు పడక, పక్కనే వున్న టీపాయ్ మీదుంచి, తిరిగి పేప రందుకుంది. మొదటి పేజీ తిరిగేసి, రెండో పేజీ చూస్తున్న ఆమె కళ్ళు ఓ చోట నిలిచిపోయాయి నిశ్చలంగా.

పైన ఓ ఫోటో, ఆ ఫోటో కింద హెడ్‌లైన్‌లో ఓ వార్తా ప్రచురింపబడున్నాయక్కడ.

ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసరుపై యువకుడు దౌర్జన్యం!

హైద్రాబాదు, జనవరి, 6:- కలెక్టర్ కొడుకు కలెక్టరూ, పోలీసాఫీసర్ కొడుకు సుగుణాల పుట్టాకావాలని ఎక్కడా లేదు. అలాగే సత్యమూర్తి పేరుగలవాళ్ళు అపర హరి శ్చంద్రులూ కారు.

నిన్న నగరంలోని ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి ఆఫీ సులో జరిగిన సంఘటన గమనించాక పై విషయాలు అతిశ యోక్తులు కావని స్పష్టంగా తేటతెల్లమౌతుంది.

అతని పేరు మణిదీప్! పాతికేళ్ళ యువకుడు. ఒక ప్పుడు విజయవాడలో దైవాంశ సంభూతుడిగా పేరు గడించి, ఎందరినో మృత్యుకోరల్లోంచి తప్పించి, ప్రాణ

దానం చేసి తాను మాత్రం విధి నిర్ణయాన్ని జయించలేక ఈ మధ్యే మరణించిన డాక్టర్ వింజమూరి హరినారాయణ గారి ఏకైక కుమారరత్నం అతను.

ఒక్కగానొక్క కొడుకని అల్లారుముద్దుగా పెరగడం వల్ల అయ్యవారికి అన్నిరకాల దుర్మిత్రులూ, వారిద్వారా అనేక దుర్గుణాలూ సంక్రమించాయి. తండ్రి సంపాదనను విచ్చలవిడిగా తగలేస్తూ, కనిపించిన అమ్మాయినల్లా ఏడిపిస్తూ బద్ధమైన స్నేహితుల్ని వెంటేసుకుని జులాయిలా తిరుగుతూ అడ్డదిడ్డంగా పెరిగిన మణిదీప్ చదువు వానాకాలం చదువులా సాగి, మెట్రిక్యులేషన్‌తో యికముందుకు సాగనంటూ శాశ్వతంగా ఆగిపోయింది.

కొడుకు నిర్వాకాలతో ముందే కృంగి కృశించిపోతున్న హరినారాయణగారు ఒకరోజు గుండెపోటుతో హటాత్తుగా చనిపోయారు. దాంతో ముందే తల్లిని కోల్పోయి వున్న మణిదీప్‌కు పట్ట పగ్గాల్లేకుండా పోయాయి. ఏడాది లోపలే తండ్రి సంపాదించిన స్థిరచరాస్తులన్నీ తెగనమ్మి హారతి కర్పూరంలా డబ్బును ఖర్చుపెడుతూ పెద్దపెద్ద నగరాలన్నీ ప్రదక్షిణంచేసి చివరికి కొద్దిపాటి డబ్బుతో హైద్రాబాదు చేరాడు.

ఆ వున్నది కాస్తా కొద్ది రోజుల్లో ఊదేశాకగానీ అతనికి ముందున్న భవిష్యత్తు జ్ఞాపకం రాలేదు. జల్సాఖర్చుల కలవాటు పడ్డ అతనికి చేతిలో చిల్లికానీ మిగలక పోవడంతో బ్రతుకు భీతావహంగా తోచింది.

దాంతో చిల్లర మల్లర దొంగతనాల కలవాటుపడ్డాడు. కాచిగూడా రైల్వే కాలనీ, విద్యానగర్ కాలనీ, సంతోష్ నగర్ కాలనీ, పంజగుట్ట కాలనీ మొదలైన ప్రదేశాల్లో

యింటి నేమ్ ప్లేట్ల ఆధారంగా ఆయా యింటి యజమానుల పేర్లూ, ఉద్యోగ వివరాలూ కనుక్కొని, యజమానులు ఆఫీసుల కెళ్ళగానే, అయ్యగారు అర్జంటుగా పంపారంటూ వారి భార్యల్ని బోల్తాకొట్టించి, కంట్రోల్ షాపు నుండి చక్కెర తెచ్చిపెట్టమన్నారనో, బియ్యం, గోధుమలూ, కిరోసిన్ తెమ్మన్నారనో చెప్పి, అమాయిక యిల్లాళ్ళనించి డబ్బు దులుపుకుని చక్కా పోయేవాడు.

కొద్ది రోజుల్లోనే ఈ వ్యవహారం పత్రికల్లో పడి గృహిణులు జాగ్రత్తపడేసరికి, తన పబ్బం అట్టేకాలం సాగదని గ్రహించి, వున్న మెట్రిక్యులేషన్ సర్టిఫికేట్‌తో ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోతుందా అని స్థానిక ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులో పేరు నమోదు చేసుకున్నాడు.

చేసుకొన్నవాడు కొన్నాళ్ళైనా ఓపిక పట్టక, రోజూ క్రమం తప్పకుండా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసుకెళ్ళి ఉద్యోగుల కాళ్ళావేళ్ళా పడుతూ, ఏదో ఒక లిస్టులో తన పేరు వెయ్యమని నానా ప్రయత్నాలూ చెయ్యసాగాడు.

కొమ్ములు తిరిగిన గ్రాడ్యుయేట్లే ఏళ్ళతరబడి పడిగాపులు కాస్తోంటే, పట్టుమని పదిరోజులుకూడా సీనియారిటీలేని అతనికి అవకాశమెలా వస్తుంది? ఈ భాగోతంతో విసిగి వేసారిన మణిదీప్ నిన్న అమీతుమీ తేల్చుకుందామని ఆఫీసరుగారి గదిలోకి విసురుగా దూసుకెళ్ళి తన సంగతేమిటని అడిగాడుట.

అతని దురుసు ప్రవర్తనకి బుర్ర బిరుసెక్కిన ఆఫీసరుగారు గెటవుట్ అని గావుకేక పెట్టారట. దాంతో మణిదీప్ ఉన్మాదిలా ఆయనమీదికి లంఘించి, కాలరుచ్చుకొని ఎడాపెడా నాలుగు వడ్డించాడట. అంతలో ఆఫీసు ఉద్యోగులు

అతన్ని చుట్టుముట్టి, పెడరెక్కలు విరిచి పట్టి పోలీసుల కప్పగించారట.

పోలీసుల థర్డ్‌క్లాస్ ఇంటరాగేషన్‌లో అతని జాతక మంతా బైటపడింది. ఐ.పి.యస్. ఫోర్ ట్వెంటీ సెక్షన్‌తో సహా అతనిమీద డ్యూటీలో వున్న ప్రభుత్వోద్యోగిపై దౌర్జన్యం జరిపిన నేరమూ జోడించి, నిన్న కోర్టులో హాజరుపరిచారు పోలీసులు.

సిటీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు ఆ యువకుణ్ణి ఈనెల ఆరో తేదీ వరకూ జుడిషియల్ కష్టడీలో వుంచవలసిందిగా ఉత్తర్వు జారీచేశారు.

—వార్త పూర్తిగా చదివిన శ్రీదేవి కనుబొమలు ముడివడ్డాయి కాసేపు. ఆ వార్తకు సంబంధించిన ఫోటోనూ, ఫోటోలోని మణిదీప్ అపబడే ఆ యువకుణ్ణీ పదినిమిషాలు జాగ్రత్తగా పరిశీలించి, సాలోచనగా తలూపుతూ పేపర్ని టీపాయ్‌మీద పడేసి కుర్చీలోంచి లేచింది.

గోడవారగా వున్న గోద్రెజ్ బీరువాని సమీపించి, తలుపు తెరిచి, కింది అర అడుగులో వున్న ఓ పెద్దసైజు ఫోటో ఆల్బమ్‌ని బైటికి తీసింది. దానిమీది రెగ్జిన్ కవరు అక్కడక్కడా చిట్లి, మాసిపోయి శిథిలావస్థలో వున్న దాని వయసును వ్యక్తం చేస్తోంది.

ఆల్బమ్ ఒక్కొక్క పేజీ తిరిగేస్తూ, అందులో క్రమ బద్ధంగా అతికించి వున్న ఒక్కొక్క ఫోటోనీ చాలా జాగ్రత్తగా పరికిస్తూ మధ్యపేజీ వద్ద ఆగిపోయింది. నిండుగా నవ్వుతున్న ఓ పాతికేళ్ళ యువకుడి ఫోటో అతి కించి వుందక్కడ.

సాలోచనగా తల వూపుతూ తిరిగి కుర్చీని సమీపించి, టీపాయ్‌మీది న్యూస్ పేపరందుకొని, అందులో ప్రచురింప

బడ్డ మణిదీప్ ఫోటోనూ, ఆల్బమ్‌లోని ఫోటోనూ జతచేసి, కాసేపు పరీక్షగా చూపింది.

తరవాత ఆల్బమ్‌ని అదే పేపర్లో పదిలంగా చుట్టి, తిరిగి బీరువాలోని అరలో భద్రం చేసి, దాని తలుపు మూసి తాళం బిగించింది. ఖాళీ కప్పు తీసికెళ్ళడానికి పనిమనిషి వచ్చింది లోపలికి.

"నేను అర్జెంటుగా హైద్రాబాద్ వెళుతున్నాను. మధ్యాహ్నం నాకోసం భోజనం వండకు" అంది శ్రీదేవి సూట్‌కేస్‌లోంచి బట్టలు తీస్తూ.

"మళ్ళీ ఎప్పుడొస్తారమ్మగారూ?"

"చెప్పలేను. చీకటి పడవచ్చు!"

అంతవరకూ ప్రశాంతంగా, నిదానంగా వున్న ఆమెలో అకస్మాత్తుగా అంత ఆరాటమూ, ఆతృతా ఎందుకు జనించాయో అర్థంగాక, మౌనంగా కప్పందుకుని వెళ్ళిపోయింది పనిమనిషి.

2

"ఏయ్, నిన్నే!" పిల్చాడు వార్డెన్.

జైలు గదిలో నేలమీద కూర్చుని ఉబుసుపోకకి అష్టా చెమ్మా ఆడుకుంటున్నారు ఆరుగురు అండర్ ట్రయల్ ఖైదీలు. కోర్టులో శిక్ష పడనిదే వారిని పగటిపూట మిగతా ఖైదీలతోబాటు పనులకోసం బైటికి తియ్యరు జైలు సిబ్బంది. తన పిలుపు వినిపించుకోకుండా పెద్దగా మాట్లాడు కుంటూ ఆటలో మునిగి తేలుతున్న ఖైదీలమీద పట్టరాని కోపం వచ్చింది వార్డెన్‌కు.

"ఏయ్ అబ్బాయ్! పిలిస్తే పలకవేం? చెవుడా? నిన్నే?" అరిచాడు.

అప్పుడు తిరిగి చూశారు ఖైదీలు అతనివైపు.

"మణిదీప్ నువ్వేకదూ?" రెట్టించాడు వార్డెన్.

ఖైదీల మధ్య కూర్చున్న పాతికేళ్ళ యువకుడు తల వూపాడు మౌనంగా.

"నీకోసం ఎవరో వచ్చారు. మాట్లాడుదువు గాని రా బైటికి!" అంటూ బొడ్లోంచి తాళం చెవుల గుత్తిలాగి, కటకటాలకు వేలాడుతున్న తక్కెడు బరువు తాళం తెరిచాడు వార్డెన్.

అండర్ ట్రయల్ ఖైదీలని చూడటానికి లాయర్లో, బంధువులో రావడం వింతేమీ కాదు గానీ, తనవాళ్ళంటూ ఎవ్వరూ మిగలని తనను చూడటానికి ఎవరొచ్చారబ్బా అన్న మీమాంసతో నెమ్మదిగా లేచి నిల్చున్నాడు మణిదీప్.

పత్రికల్లో తన వృత్తాంతం చదివి, సానుభూతి చూపడానికి వేలువిడిచిన ఏ దూరపు బంధువో వచ్చుంటార్లే అని సరిపుచ్చుకుంటూ, ఠీవిగా తెరిచిన తలుపుగుండా బైటికి నడిచాడు.

వార్డెన్ అతన్ని నడిపించుకొంటూ జైలర్ ఆఫీసువైపు తీసికెళ్ళసాగాడు.

"ఎవరొచ్చారు?" అడిగాడు మణిదీప్ కుతూహలాన్ని ఆపుకోలేక.

"మిస్ శ్రీదేవిట!"

పేరు విని మణిదీప్ కనుబొమలు ముడివడ్డాయి. ఆ పేరుగల అమ్మాయి దూరపు బంధువుల్లో కాదుకదా, దగ్గిరి బంధువుల్లోనూ, పరిచయస్థుల్లోనూ ఎవ్వరూ వున్నట్టు జ్ఞాపకం లేదతనికి. ఐతే, ఆ పేరువిన్న మరుక్షణం అతని మస్తిష్కంలో అందమైన సినిమానటి శ్రీదేవి తటిల్లతలా తళుక్కుమంది లిప్తపాటు!

వార్డెన్ని అనుసరిస్తూ జైలర్ ఆఫీసు అంతర్భాగంలో వున్న విజిటింగ్ రూంలో అడుగుపెట్టాడు.

అక్కడ కూర్చున్న ఓ అతివను చూపుతూ, "ఆవిడే మిస్ శ్రీదేవి!" అన్నాడు వార్డెన్.

ఆమెను చూడగానే దిగ్భ్రాంతితో మణిదీప్ కళ్ళు పెద్ద వయ్యాయి. తాను అనుకున్నట్టు ఆమె అందమైన అమ్మాయి కాదు! మొహమంతా ముడతలు పడి శైవదశలో వున్న అరవై ఏళ్ళ అతివ.

అక్కడక్కడా నెరిసిన ఇందిరాగాంధి టైపు బాబ్డ్ హేర్. ఖరీదైన చీర. మెడలో రుద్రాక్ష మాలను పోలిన హారం! వేలికి ధగధగ మెరుస్తున్న ఒకే ఒక వజ్రపు ఉంగరం! ఎదటి మనిషిమీద సద్భావన వేసే విగ్రహం! ఆమెని చూడగానే బాగా చదువుకున్న మనిషిలా, ఐహిక బంధాలనూ, సుఖసౌఖ్యాలనూ త్యజించి, నిరాడంబరంగా బ్రతుకుతున్న నిర్వికారిలా స్ఫురిస్తుంది ఎవరికైనా!

"నమస్తే!" అన్నాడు మణిదీప్ చేతులు జోడించి

"నమస్తే! రా నాయనా, ఇలా వచ్చి కూర్చో!" అంది ఆమె ఆప్యాయంగా.

వార్డెన్ అతన్ని లోపలికి వదిలి, తాను తలుపుదగ్గర నిల్చుండి పోయాడు.

మణిదీప్ నెమ్మదిగా వెళ్ళి ఆమె కెదురుగా కుర్చీలో చతికిల బడ్డాడు. ఆవిడ గోల్డ్ ఫ్రేం కళ్ళద్దాలు సవరించుకుని, కాసేపతన్ని తదేకంగా చూసింది. కుర్చీలో కాస్త ఇబ్బందిగా కదిలాడు మణిదీప్. ఆమె ఆ విషయం గ్రహించి, గొంతు సవరించుకుని చెప్పసాగింది.

"నా పేరు నీకు తెలిసే వుంటుంది. సుమారు నలభై ఏళ్ళ క్రితం మేము బెంగళూరులో వున్నప్పుడు, మీ కుటుం

బమూ, మా కుటుంబమూ అంటే, మీ నాన్నగారి కుటుంబమూ ఎంతో సఖ్యతగా వుండేవాళ్ళం!

తరవాత, దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక మారిన పరిస్థితుల దృష్ట్యా జీవన భృతికోసం ఇరుకుటుంబాలూ తలో దిక్కున ప్రయాణమై విడిపోయాయి. కొంతకాలం మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు సాగినా, కాలానుగతంగా ఎవరి జీవన సమరంలో వారు మునిగి తేలుతూ ఒకర్నొకరం దాదాపు మర్చిపోయాం!

మా నాన్నగారు హైద్రాబాదులో స్థిరపడి, అనేక వ్యాపారాల్లో అనుభవం గడించి, రెండు చేతులా ఆర్జించి, ఇక్కడికి ముప్ఫై మైళ్ళ దూరంలో వున్న షంషాబాద్‌లో ఆస్తిపాస్తులు కొని, ప్రశాంతమైన ప్రదేశంలో పెద్ద భవనం నిర్మించారు.

నేనాయన ఒక్కగానొక్క కూతుర్ని. విద్యార్థి దశనించీ సాంఘిక సంక్షేమ కార్యకలాపాల్లో మునిగి తేలుతూ పెళ్ళి మీద పెద్దగా ఆసక్తి చూపక, అవివాహితురాలిగానే వుండిపోయాను.

నిన్న అకస్మాత్తుగా నీ ఫోటో పత్రికలో చూసి, మీ నాన్న గురించిన వివరాలు చదివి చాలా ఆశ్చర్యపోయాను. నువ్వు మూసపోసినట్టు మీ నాన్న పోలికలనే పుణికి పుచ్చుకున్నావ్.

జ్ఞాపకాల తెరచాటున మటుమాయమై పోయిన ఆ నాటి ఆత్మీయత నాలో మళ్ళీ జాగృతమై నిన్ను చూడాలన్న కుతూహలం యిక్కడివరకూ లాక్కొచ్చింది.

ఎంతో కష్టపడి, ఎన్నో పెద్ద చదువులు చదివి, సంఘంలో యెంతో పేరు ప్రతిష్టలు సంపాదించాడు మీ నాన్న. అటువంటిది నువ్వెందుకిలా తయారయ్యావు

బాబూ? సర్లే .. అందులో నీ తప్పేంలేదు. ఒక్క గానొక్క కొడుకువన్న అతి గారాబంతోనూ, వృత్తిరీత్యా తీరిక లేక పోవడంవల్లనూ మీ నాన్న నీ మీద అంతగా శ్రద్ధ చూపి వుండడు.

పైగా, ఆయనకన్నా ముందే నీ తల్లి చనిపోయినట్టు పత్రికల్లో చదివాను. అదీ ఓ కారణమై వుంటుంది. నాన్న పోయాక, మీ దగ్గరి బంధువులెవ్వరూ నీ గురించి పట్టించుకో లేదా బాబూ?"

మణిదీప్ తల విదిల్చాడు. "వాళ్ళకు నేనంటే పడదు. ఐనా, ఒకరి ఆజమాయిషీలో జీవించడం నా వ్యక్తిత్వానికి విరుద్ధం! నేనెప్పుడూ సర్వ స్వతంత్రుడిగానే బ్రతకాలని కోరుకుంటాను."

"ఇప్పుడు నువ్వు వయసులో వున్నావు. వేడిరక్తం! రేపు అవ్వీ ఉడిగిపోయాక, గతాన్ని నెమరువేసుకుంటూ చింతించే పరిస్థితి రావచ్చు. తండ్రి సంపాదించిందంతా కర్పూరంలా ఖర్చుపెట్టి ఇప్పుడు జీవనోపాధికి మార్గం చూపెట్టే ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసరుమీద చెయ్యి చేసుకుని చాలా తప్పు చేశావు. అనవసరంగా తొందరపడ్డావు బాబూ!

సరే, జరిగిందేదో జరిగిపోయింది. రేపు కోర్టులో నీ డిఫెన్స్ కోసం వాదించడానికి లాయర్ని పెట్టుకున్నావా లేదా?"

"అవసరంలేదు, అతన్ని పబ్లిగ్గా కొట్టాను. చాలా మంది చూశారు. ఎంత వాదించినా ప్రయోజనం వుండదు. ఆ ప్రత్యక్ష సాక్షుల ద్వారా నాకు శిక్ష పడితీరుతుంది. ఎక్కువ పడదు లెండి. మహా అయితే ఆర్నెల్లు పడవచ్చు" అన్నాడు మణిదీప్ ఆమె వేలికి ధగధగ మెరుస్తు వజ్రపు

టుంగరాన్ని చూస్తూ.

"శిక్ష పడుతుందని కాదు నేను చింతిస్తోంది. ఆ తరవాత భుక్తి కోసం నీ కెక్కడా వుద్యోగమనేది దొరక దనే నా బాధ!"

అతి కష్టంమీద ఆ ఉంగరం మీంచి దృష్టి మరల్చుకుని "పోనివ్వండి. ఈ లోకంలో అందరూ వుద్యోగాలమీదే బ్రతుకుతున్నారా? సవాలక్ష మార్గాలున్నాయి బ్రతకడానికి. ఏదో ఒక విధంగా నా బ్రతుకు నేను బ్రతగ్గలను. ఇక సెలవిప్పిస్తారా?" అన్నాడు విసుగ్గా.

"ఆగు బాబూ! తొందరపడక. శిక్ష అనుభవించి, విడుదలవగానే తిన్నగా షంషాబాద్ వచ్చి నన్ను కలుసుకో! ఈ లోకంలో నాకు నా వాళ్ళంటూ ఎవ్వరూ లేరు. లంకంత యిల్లు. తలకు మించిన ఆస్తిపాస్తులు. ఏకాకిని. ఏం చేసు కోను చెప్పు?

పైగా, రోజు రోజుకూ వయసు మీద పడుతోంది. నీటిమీద బుడగలా ఇప్పుడో, అన్నట్టు బ్రతుకుతున్నాను. ఏకాంతం నన్ను అనుక్షణం కాలనాగులా కాటు వేస్తు న్నట్టు స్ఫురిస్తుంది. మానసిక శాంతిని కకావికలం చేసి వేస్తుంది.

ఈ శైవదశలో నీ సహాయం కావాలి నాకు. దానికి ప్రతిఫలంగా జీవితాంతం కాలుమీద కాలు వేసుక్కూర్చుని తినగలిగే యేర్పాటు చేస్తాను నీకు" అన్న ఆమె మాటలు వినగానే మణిదీప్ మొహంలో మొలకెత్తిన విసుగు మాయమై కొత్త కాంతి పులుముకుంది.

"అలాగేనండీ. తప్పకుండా వస్తాను. అడ్రస్ యిచ్చి వెళ్ళండి" అన్నాడు నమ్రతగా.

ఆమె హాండ్‌బాగ్ తెరిచి, కాగితం కలం తీసి, చిరు

నామా, ఫోన్ నెంబర్ రాసి అతనికందిస్తూ, "నా ఆరోగ్యం అంత మాత్రమే. ఒక్కోసారి బాగా బెడిసికొట్టి, వారాల తరబడి పక్కమీదే పడుంటాను. అందుకే, విడుదలయ్యే రోజు నిన్ను తీసుకెళ్ళడానికి నేను రాలేకపోవచ్చు.

గౌలిగూడా బస్‌డిపోలో షాద్ నగర్, కొడంగల్, వికారాబాద్, తాండూరు వెళ్ళే ఏ బస్సు ఎక్కినా షంషాబాద్ చేరుకోవచ్చు. లేదా, సికింద్రాబాద్‌నించి ఫలక్‌నుమా వరకూ ఏ మీటర్‌గేజ్ రైల్వేస్టేషన్నించైనా షంషాబాద్‌కు లోకల్ ట్రేన్ దొరుకుతుంది" అంది శ్రీదేవి.

మణిదీప్ ఆ కాగితం మడిచి జేబులో పెట్టుకొంటూ, "థాంక్సండీ! కష్టాల్లో వున్న నన్నాదుకోడానికి ఆ భగవంతుడే మిమ్మల్ని పంపించినట్టున్నాడు. మీవంటి ఆపద్బాంధవి సాహచర్యంలో నాలోని చెడు అంతా రూపుమాపి, మంచి మనిషిగా రూపు దిద్దుకోవచ్చు" అన్నాడు ఆనందంగా.

అంతలో వార్డెన్ లోనికి తొంగిచూసి, "ఆఁ, విజిటింగ్ టైమైపోయింది" అన్నాడు హెచ్చరిస్తూ!

"వస్తాను బాబూ! ఆరోగ్యం జాగ్రత్త!" అంటూ లేచిందామె.

"అలాగేనండీ. ముందు మీ ఆరోగ్యం జాగ్రత్త. వేళకు మందులు అవీ తీసుకుంటూ వుండండి" చేతులు జోడించి, వచ్చీరాని వినయం ఒలకబోస్తూ లేచాడు మణిదీప్.

3

"ఏరోయ్ కుర్రకుంకా! ఈరోజు బైటపడుతున్నావా?" అడిగాడో పాత ఖైదీ పళ్ళికిలిస్తూ.

పెల్లుబికిన కోపాన్ని పచ్చ ఆముదం తాగినట్టు మింగి, తలూపాడు మణిదీప్ మౌనంగా. మరో సమయంలో అయితే వాడి ఎముకల్ని ఎండుపుల్లలు విరిచినట్టు విరిచే వాడే. కాని శిక్ష పూర్తిజేసి విడుదలవుతున్న రోజు అది. గొడవపడితే ఇంకొన్నాళ్ళు లోపల మగ్గక తప్పదు.

ఐనా, ఆ ఆర్నెల్లు అక్కడి వాతావరణానికి బాగా అల వాటుపడిపోయాడతను. చిట్టిపొట్టి నేరాలు చేసి, కొద్దిపాటి శిక్షలు పడివచ్చిన ఖైదీలతో కొమ్ములుతిరిగిన పాత ఖైదీలు అలాగే మాట్లాడుతారు.

జైలు ఆవరణలో అడ్డ దిడ్డంగా మొలకెత్తిన పచ్చ గడ్డిని పారతో తొలిచేస్తున్న మణిదీప్‌ని జైలు వార్డెన్ పిల్చి, జైలర్ ఆఫీసులోకి తీసికెళ్ళాడు.

"ఈరోజు నీ శిక్ష పూర్తయింది. విడుదలచేస్తున్నాం! జాగ్రత్త. మళ్ళీ యిక్కడికి వచ్చే, తప్పుడు పనులేవీ చెయ్యక బుద్ధిగా బ్రతుకు. అర్థమైందా....?" అడిగాడు జైలర్.

తలూపాడు మణిదీప్ మౌనంగా.

"ఆ ఖైదీ దుస్తులువిడిచి, ఇంద నీ బట్టలు తొడుక్కో" అంటూ రూల్‌కర్రతో టేబిల్‌మీద బట్టలమూటను ముందుకు తోశాడు జైలర్.

తాను జైలుకి వచ్చేముందు తొడుక్కొన్న బట్టలవి. గబగబ ఖైదీ దుస్తులు విప్పి వాటిని తొడుక్కున్నాడు.

"ఇంద, ఈ కాగితాలమీద సంతకం పెట్టు" అన్నాడు జైలర్ కలం అందిస్తూ.

అతను చూపిన చోట సంతకాలు పెట్టి, గేట్‌పాస్ అందుకొని, అయిష్టంగానే అయినా తప్పదు గనక ఓ నమ స్కారం పడేసి, ఆఫీసులోంచి యివతలికి వచ్చాడు మణి

దీప్. ఎత్తైన ప్రహరీగోడ మధ్య వున్న నిలువెత్తు సింహ ద్వారంవైపు నడుస్తోంటే, అది నరకానికీ, స్వర్గానికి నడుమ వున్న సరిహద్దులా స్ఫురించిందతనికి.

ఇప్పుడు తా నా సరిహద్దును యెలాంటి ఆటంకమూ లేకుండా దాటి, స్వేచ్ఛామారుతం వీచే లోకంలో పాదం మోపబోతున్నాడు. ఆ అనుభూతి మనసును గిలిగింతలు పెడుతోంటే, సన్నగా ఈల వేసుకొంటూ వడివడిగా గేటును సమీపించాడు.

అక్కడున్న సెక్యూరిటీ సిబ్బందికి జైలర్ యిచ్చిన కాగితం చూపాడు. వాళ్ళు దాన్ని జాగ్రత్తగా పరిశీలించి సింహద్వారానికున్న ఓ బుల్లిద్వారాన్ని తెరిచి, వెళ్ళమన్నట్టు సైగచేశారు. తలవంచి బైటికి వచ్చి, చుట్టూ కలయ జూశాడు మణిదీప్ శ్రీదేవి కోసం!

ఎక్కడా ఆమె ఛాయలు కానరాలేదు. బహుశా, ఆరోగ్యం బాగులేదేమో, అనుకొంటూ జేబులోంచి పర్సు తీసి చూశాడు. ఆ రోజు ఆమె రాసిచ్చిన అడ్రస్, ఐదు రూపాయల నోటూ, కొద్దిపాటి చిల్లరా వున్నా యందులో. షంషాబాద్ చేరడానికి ఆ మాత్రం డబ్బు సరిపోతుందా?

ఆలోచించాడు క్షణంపాటు. బస్సులో వెళితే తప్పని సరిగా టికెట్ తీసుకుని తీరాలి. అదే లోకల్ ట్రేన్‌లో అయితే టికెట్ లేకున్నా నడుస్తుంది. ఈ ఐదురూపాయ లతో ఎక్కడయినా తేలికపాటి టిఫిన్ చేసి, కడుపులో పిల్లి మొగ్గలు వేస్తున్న ఎలుకల్ని ముందు బుజ్జగించాలి.

అనుకొంటూ ఫుట్‌పాత్ మీద పడి నడక సాగించాడు. అది ముషీరాబాద్ సెంట్రల్ జైలు. అక్కణ్ణించి ముక్కుకు సూటిగా ముందుకు సాగిపోతే రామకృష్ణా స్టూడియో, చిక్కడపల్లి చౌరస్తా వస్తుంది. అది దాటితే నారాయణ

గూడా చౌరస్తా. ఆ తరువాత కాచిగూడా చౌరస్తా దాటి ఎడంవైపు తిరిగితే రైల్వేస్టేషన్ వస్తుంది.

అక్కడ యెక్కవచ్చు షంషాబాద్ వెళ్ళే ఫ్రీ ఫండ్ లోకల్ స్టేషన్. చిక్కడపల్లి చౌరస్తా దగ్గర ఓ ఉడిపి హోటల్లో దూరి, రెండు దోసెలూ, ఓ ఉతప్పా తిని, కాఫీ తాగేసరికి వున్న ఐదురూపాయలూ ఊడి, కొద్దిపాటి చిల్లర మిగిలింది జేబులో.

ఆ ఫలహారంతో కడుపులో కాస్త సత్తువా చేరి, కాళ్ళు బలం పుంజుకొన్నాయి. కాచిగూడా రైల్వేస్టేషన్ చేరేసరికి సాయంత్రం ఆరు కావచ్చింది. ప్లాట్‌ఫారంమీద పచార్లు చేస్తూ ట్రేన్ రాగానే యెక్కడికి వెళుతుందో అడిగి మరీ ఎక్కాడు.

సాధారణంగా లోకల్ బళ్ళలో టి. టి. యి. ల బెడద వుండదు. రోజూ వేల సంఖ్యలో జనం ఉచితంగా ప్రయాణిస్తూ రైల్వేవారి రాబడికి సముచితంగా ఎగనామం పెడుతుంటారు. చిట్టిపొట్టి స్టేషన్లలో నిమిషం, అరనిమిషం ఆగుతూ, ఫలక్‌నుమా దాటాక వేగం అందుకుంది బండి. వచ్చిన ప్రతి స్టేషన్నీ జాగ్రత్తగా పరికిస్తున్న మణిదీప్ ఫలక్‌నుమా దాటగానే అడిగాడు తోటి ప్రయాణీకుణ్ణి తరవాతి స్టేషన్ ఏమిటని.

"షంషాబాద్!" చెప్పాడతను.

ఏడుగంటలకు ఆగింది బండి ఓ స్టేషన్‌లో.

బోర్డుచూసి గతుక్కుమన్నాడు మణిదీప్. 'ఉందానగర్' అని రాసుంది స్టేషన్ పేరు.

"ఇదేమిటి? వచ్చేది షంషాబాద్ అన్నావుగా?" అడిగాడు దిగబోతున్న ప్రయాణీకుణ్ణి.

అతను నవ్వి — "ఊరి పేరు షంషాబాద్! స్టేషన్

పేరు ఉందానగర్‌! బండి యిక్కడే వెనుదిరిగి మళ్ళీ సికింద్రాబాద్ పోతుంది" అన్నాడు.

అనుమానం చావక మరో యిద్దర్ని అడిగాడు. మొదటి జవాబే వచ్చింది. కాసేపు అక్కడే నిల్చుని చూశాడు. బండి నిజంగానే వెనుదిరిగి వెళ్ళిపోయింది. స్టేషన్ కటూ యిటూ వుంది ఊరు. ఎటు వెళ్ళాలి? అనుకుంటూ జేబు లోంచి అడ్రస్ తీసి చూశాడు. క్లియర్ ఇన్‌స్ట్రక్షన్స్ వున్నాయందులో. అంటే, గవర్నమెంట్ గెస్టుహౌస్ వున్న దిక్కు వెళ్ళాలని.

దారిన పోయేవాళ్ళ నడుగుతూ జేరుకున్నా డక్కడికి. అట్నుంచి చిరునామాలోని సూచనల మేరకు నడుస్తూ ఊరిక్కాస్త యెడంగా, విడిగా వున్న ఓ బంగళాను చేరు కొన్నాడు. దానిచుట్టూ విశాలమైన కాంపౌండ్. కాంపౌండ్లో యేపుగా యెదిన రకరకాల చెట్లూ నిండివున్నాయి. ముందే ఏకాంతంగా వున్న ఆ భవనం ఆ చెట్ల గుబురు వల్ల మరీ బిక్కుబిక్కు మంటూ గుండెలో అదో రకం గుబులును రేకెత్తిస్తోంది.

మూసివున్న కాంపౌండ్ గేటు తోశాడు. కిర్రుమంటూ తెరుచుకొంది. లోపల మనిషిమాత్రుడు లేడు. పోర్చిలో వెలుగుతున్న బల్బు చుట్టూ చాలీచాలని కాంతిని ప్రసరి స్తోంది. అక్కడే ఓ పాత మోడల్ అంబాసిడర్ కారు ఆగి వుంది. పై అంతస్తులోని ఒకే ఒక్కగదిలో వెలుగుతున్న లైటు వెలుగు మూసి వున్న కిటికీ అద్దాలగుండా మసగ్గా కనిపిస్తోంది.

అడుగులో అడుగు వేసుకొంటూ పోర్చివైపు నడి చాడు. ఇంటి ముఖద్వారం మూసివుంది. చుట్టూ నిశ్శబ్దం

రాజ్యమేలుతోంది. గదపకున్న కాలింగ్ బెల్ వత్తాడు గట్టిగా.

4

"అలాగే....థాంక్స్!" అంటూ రిసీవర్ని క్రెడిల్ మీదుంచి, నిశ్చింతగా కుర్చీ వెనక్కి వాలింది శ్రీదేవి.

అదే క్షణంలో కింద కాలింగ్‌బెల్ గణగణ మోగిన శబ్దం వినిపించింది.

అతి కష్టంమీద కుర్చీలోంచి లేచింది శ్రీదేవి. నెమ్మదిగా నడుస్తూ గదిలోంచి బయటపడి, ఒక్కో మెట్టే దిగుతూ హాల్లో అడుగుపెట్టి, మూసివున్న తలుపును సమీపించి ఆగిపోయింది.

"ఎవరూ?"

"నేనండీ, మణిదీప్‌ని."

ఒక్క వుదుటున గడియ తీసి తలుపు తెరిచింది శ్రీదేవి.

చేతులు జోడించాడు మణిదీప్. "ఈ రోజు నన్ను విడుదల చేశారు. జైల్లోంచి బైటికిరాగానే తిన్నగా ఇక్కడికే వచ్చాను."

"చాలా మంచి పనిచేశావు నాయనా! రా లోపలికి. నా ఆరోగ్యం మళ్ళీ తిరగబెట్టింది. అందుకే, నిన్ను రిసీవ్ చేసుకోడానికి రావాలనుకున్నా రాలేకపోయాను." అంటూ తలుపు కడ్డం తొలిగింది శ్రీదేవి.

"మంచి పనిచేశారు. చాలా సులభంగానే చేరా నిక్కడికి," అంటూ లోన అడుగుపెట్టి చుట్టూ కలయజూశాడు మణిదీప్.

ఆధునిక యుగంలో పుట్టిన అతనికి పురాతన రీతిలో కట్టిన ఆ భవనం అంతగా నచ్చకపోయినా, విచిత్రంగా

మాత్రం తోచింది.

"ఎప్పుడో బ్రిటీష్ కాలంలో కట్టిన భవనం యిది. బహుశా, నీకు నచ్చకపోవచ్చు. పద. మేడమీది కెళ్దాం!" అంటూ తలుపు దగ్గరగా చేరవేసి మెట్లవైపు నడిచింది శ్రీదేవి.

అడుగులో అడుగు వేసుకొంటూ ఆమెని అనుసరించాడు మణిదీప్. లోపల సూదిపడితే వినిపించే నిశ్శబ్దం! తామిద్దరు తప్ప ఆ లంకంత యింట్లో మరో ప్రాణి వున్న సూచనలు కనిపించ లేదతనికి.

"ఇంత పెద్ద యింట్లో మీ రొక్కరే వుంటారా?" అడిగాడు వుండబట్టలేక.

ఆమె నవ్వి—"నా బాగోగులు చూసుకుంటూ ఓ పని మనిషి తోడుగా వుంటుంది రత్నమ్మ. ఈ మధ్యే ఆమె పిల్లాణ్ణి ప్రసవించడం వల్ల చీకటి పడగానే యింటికెళ్ళి పోతోంది. ఈ ఊళ్ళో అంత నమ్మకస్థురాలైన మరో మనిషి దొరక్క యెలాగో సర్దుకుపోతున్నాను" అంది.

ఇద్దరూ పైన వున్న ఆమె గదిలోకి ప్రవేశించారు. గది మధ్య ఓ పురాతన రౌండ్ టేబిల్. దాని కిరుపక్కలా పాత రకపు వాలు కుర్చీలూ వేసి వున్నాయి.

"కూర్చో నాయనా! ఆకలితో ఉన్నట్టున్నావ్! ఏమైనా తింటావా?" అడిగిందామె ఆప్యాయంగా.

"అబ్బే, లేదండీ వచ్చేటప్పుడు హోటల్లో టిఫిన్ చేసి వచ్చాను. ఇప్పుడు ఆకలిగా లేదు. నన్ను మీ రిక్కడికి పిలిపించిన కారణం తెలుసుకోవాలని చాలా కుతూహలంగా వుంది" అంటూ ఓ కుర్చీలో కూర్చున్నాడు మణిదీప్.

"నేనూ అదే చెప్పాలనుకుంటున్నాను బాబూ!" అంటూ నీరసంగా కుర్చీలో వతికిలబడి చెప్పసాగిందామె.

"వృద్ధాప్యం సవాలక్ష రోగాలకూ నిలయం అంటారు. కారణం, కాలమనే చెదలు వారిలోని రోగ నిరోధక శక్తిని హరించి వేస్తుంది గనుక.

అందుకే అన్ని రోగాలూ కట్టగట్టుకుని వృద్ధాప్యం మీద దాడిచేసి తమ పబ్బం గడుపుకుంటాయి. నా కిప్పుడు యాభై ఎనిమిదేళ్ళు. ఈ వయసులో నన్ను బాధపెడుతున్న రోగాల సంఖ్య చెబితే నీవు నమ్మకపోవచ్చు.

ఈ రోగాలవల్ల తిండి తిప్పల విషయంలో అనేక ఆంక్షలు విధించారు డాక్టర్లు. కోరుకున్నది తినలేను. కంటి నిండా నిద్రపోలేను. ఇంకా ఎన్నాళ్ళని ఈ నరకం అనుభవించను? అన్నిటికి మించి భయంకరమైన ఒంటరితనం నన్ను నిలువునా శిథిలం జేస్తోంది.

నా అన్నవారూ, ఈ కష్టాల్లో ఆప్యాయతా, ఆత్మీయతా చూపేవారూ లేరు. ఈ బాధలనించి నన్ను విముక్తురాలిని చేసి, త్వరగా నీ దగ్గరికి రప్పించుకో భగవంతుడా అని మొక్కుకోని నిమిషం లేదనుకో. ఐనా, మృత్యువుకు నా మీద జాలి కలగడంలేదు.

అందుకే.... అందుకే. ఈ బాధలనించి విముక్తి పొందడానికి ఓ నిర్ణయం తీసుకున్నాను. దాన్ని అమలు జరిపించడానికే నిన్నిక్కడికి పిలిపించాను."

"ఏమిటా నిర్ణయం?" అడిగాడు మణిదీప్ అంతవరకూ చూస్తున్న ఆమె వేలి ఉంగరం మీంచి దృష్టి మరల్చి.

"నువ్వు నన్ను చంపెయ్యి బాబూ!"

కుర్చీలో కరెంటు పాకినట్టు తృళ్ళిపడ్డాడు మణిదీప్. "ఏమన్నారూ?"

"ఔను బాబూ! నీ చేతులతో నన్ను చంపి, ఈ ముసలి

దాన్ని కష్టాల ఊబినించి విముక్తి కలిగించు నాయనా!"

"వృద్ధనారీ హత్య మహాపాతకం కదండీ. ఐనా, ఇన్నాళ్లూ నేను చిల్లరమల్లర నేరాలు చేసిన మాట నిజమే గానీ, ఇంతవరకూ చీమను చంపిన పాపాన పోలేదు."

"నీ అంతట నువ్వు నన్ను చంపితే అది హత్య అవుతుంది. పాపం చుట్టుకుంటుంది. నాకు నేనుగా నీ చేతుల్లో చావాలని కోరుకున్నప్పుడు అది పాపమెలా అవుతుంది? పైగా ఒక దీనురాలిని కష్టాల సుడిగుండం నించి శాశ్వతంగా విముక్తి కలిగించిన పుణ్యం దక్కుతుంది కదా నాయనా?"

"చావుపట్ల అంత మక్కువ వున్నప్పుడు మీ అంతట మీరే చావచ్చుగా? దానికి లక్షాతొంభై మార్గాలు కూడా వున్నాయి. ఆత్మహత్యలు చేసుకొని ఎంతమంది చావడం లేదు?"

జవాబు చెప్పడానికి ఆమె నోరు తెరిచింది గానీ, ఆయాసం ముంచుకువచ్చి, దగ్గుతెర పొంగివచ్చి కాసేపు తమాయించుకొంది. తరవాత తలెత్తి చెప్పసాగింది. "నిజమే! ఆత్మహత్యకు అనేక మార్గాలున్నాయి. ఉరి పోసుకు చావడం, ఒంటిపై కిరస్నాయిలు పోసుకొని అంటించుకోడం, మేడమీంచి దూకి చావడం!

వాటి ఊహలతోనే నా గుండె జలదరిస్తుంది. అత్యంత భయానకమైన, బాధాకరమైన చావులవి. పడుకున్నదాన్ని పడుకున్నట్టే, చాలా ప్రశాంతంగా చావడం అన్నివిధాలా సులభప్రదమైన చావని నా అభిప్రాయం! ఆ కోవకు చెందిన చావు నిద్ర మాత్రలు మింగి పడుకోడం!

ఐతే, రాత్రిళ్ళు నిద్ర పట్టక, డాక్టర్ల సలహాపై ఎంతో కాలంగా నేను రోజుకో నిద్రమాత్ర మింగి పడుకుంటు

న్నాను. ఆ విధంగా నా శరీర తత్వానికి నిద్రమాత్రలు బాగా అలవాటై, ఒకటి రెండుసార్లు మోతాదుకు మించి నిద్ర మాత్రలు మింగి పడుకున్నా చావు నన్ను వరించలేదు.

అందుకే, తుది ప్రయత్నంగా యిప్పుడు నీ సహాయం కోరింది. ఏడెనిమిది నిద్రమాత్రలు మింగి పక్కమీద పడు కుంటాను. నువ్వు చెయ్యవలసిందల్లా దిండు నా ముక్కు మీదుంచి కాస్త అదమడమే! ఆ మైకంలోనే నా ప్రాణాలు దూదిపింజలా అనంతవాయువుల్లో తేలిపోతాయి.

ప్రతిఫలంగా ఇదుగో, నా వేలికి వున్న ఈ వజ్రపు టుంగరమూ, ఆ బీరువాలో వున్న నగలూ, నగదూ అంతా తీసుకొని వెంటనే యిక్కణ్ణించి వెళ్ళిపో. ఆ డబ్బుతో యేదయినా వ్యాపారం ప్రారంభించి సుఖంగా బ్రతుకు. ఉదయం పనిమనిషి వచ్చి, నేను నిద్రలోనే సహజమైన చావు చచ్చాననుకుంటుంది. ఇన్నాళ్ళూ నాకు నమ్మకంగా సేవలు చేసినందుకు యీ యిల్లూ, కొద్దిపాటి స్థిరాస్తీ ఆమె పేర రాసిపెట్టాను. ఏమంటావ్?"

ఆలోచనలో పడిపోయాడు మణిదీప్. ఏ కోణం నించి చూసినా, అందులో పెద్ద తప్పుగానీ, తనకు జరగబోయే నష్టంగానీ కనిపించడం లేదతనికి.

సాలోచనగా తలూపి, "అలాగే, నేను రెడీ. కానివ్వండి" అన్నాడు ఓ నిర్ణయానికి వస్తూ.

ఆమె నవ్వుతూ వేలికున్న వజ్రపుటుంగరం బీరువా తాళం చెవీ తీసి టేబిల్ మీదుంచింది. "ఇది సుమారు పాతికేళ్ళ పాత ఉంగరం! ఆ రోజుల్లోనే దీని ఖరీదు రెండు వేల రూపాయలు. ఇప్పుడు పదివేలన్నా వుంటుంది. బీరువా లోని నగదూ, నగలూ అంతా కలిపి, రెండు లక్షలకు తక్కువుండవు."

రెండు లక్షలు! జిగేల్మన్నాయి అతని కళ్ళు ఒక్కసారి.

ఆమె లేచింది. మూల స్టూలుమీదున్న కూజాలోంచి గ్లాసులో నీళ్ళు నింపుకుని, టీపాయ్‌మీద గార్డినాల్ నిద్ర మాత్రల సీసాలోంచి నాలుగైదు మాత్రలు తీసి, నీళ్ళతో మింగి, నెమ్మదిగా పక్కమీద వాలింది.

కళ్ళు విప్పార్చి ఇదంతా చూస్తున్న మణిదీప్ అడుగులో అడుగు వేసుకుంటూ మంచాన్ని సమీపించాడు.

ఆతని వైపు చూసి చిన్నగా నవ్విందామె. "నువ్వు చేస్తున్న ఈ ఉపకారానికి భగవంతుడు తప్పకుండా నీకు మేలు చేస్తాడు నాయనా!" అంటూ నెమ్మదిగా కనురెప్పలు మూసుకుంది.

వణికే చేత్తో ఆమె పక్కనున్న తలగడ అందుకున్నాడు మణిదీప్. నెమ్మదిగా దాన్ని ఆమె ముక్కుమీదుంచాడు. దడదడలాడే గుండెతో వత్తాడు గట్టిగా. ఐదు నిమిషాలు పట్టు వదలకుండా అలాగే అదిమి వుంచాడు.

ఆమె శరీరంలో కొద్దిపాటి జలదరింపు వచ్చి, స్తంభించి పోయింది మళ్ళీ చలనం లేకుండా! దిండు ఎత్తి గుండె మీద చెయ్యిపెట్టి చూశాడు. ఆగిపోయింది! ఎక్కువ సేపు యింకా అక్కడే వుంటే, భయంతో తన గుండె ఆగి పోవచ్చు!

అనుకుంటూ టేబిల్‌మీది ఉంగరం, తాళం చెవీ అందుకుని, గబగబ తెరిచాడు బీరువా. లోపల వున్న రెండే రెండు నోట్లకట్టలూ, ఒకే ఒక్క బంగారు నెక్లెసూ చూడగానే ఆశ్చర్యంతో అతని కళ్ళు పెద్దవయ్యాయి.

తిప్పి కొడితే అవన్నీ కలిపి ఇరవై వేలకి మించి ఉండవు. ముసల్ది మరి రెండు లక్షల ఖరీదైన నగా నట్రా

వుందందే బీరువాలో? అనుకుంటూ ఆదరా బాదరా అర లన్నీ గాలించాడు. ఏమీలేవు!

సరిగ్గా అదే క్షణంలో కింద హాలో తలుపు తెరుచుకున్న చప్పుడు వినిపించి, అతని గుండె గుభిల్లుమంది! మరు క్షణం ఎవ్వరో గబగబ మెట్లెక్కి పైకి వస్తున్న సవ్వడి విని, భయంతో చుట్టూ కలయజూశాడు. కిటికీ తప్ప మరో దారి లేదు బయటపడటానికి, ఒక్క ఉదుటున అక్కడికి చేరుకోబోయాడు

అప్పటికే ఆలస్యమైపోయింది. వాళ్ళు రానే వచ్చారు లోపలకి. యూనిఫాంలో వున్న ఆ పోలీసుల్ని చూడగానే అతని పై ప్రాణాలు పైనా, కింది ప్రాణాలు కిందా మిగిలిపోయాయి దిగ్భ్రిమతో.

మంచంమీద చలన రహితంగా పడున్న ఆమెనీ, రాతి బొమ్మలా నిల్చుని చూస్తున్న అతన్ని చూడగానే ఇన్‌స్పెక్టర్ సాలోచనగా తలూపి, "ఆమె అనుమానం నిజమే అయిం దన్న మాట! కొద్దిసేపటి క్రితం ఆమె తన ఇంటి ముందు ఎవడో ఆగంతకుడు తచ్చాడుతుండటం కిటికీ గుండా చూశాననీ, తను ఇంట్లో ఒంటరిగా వున్నందువల్లా, ఆగంతకుడి వాలకం అనుమానాస్పదంగా ఉన్నందువల్లా, వాడు ఇంట్లో దూరి తనమీద దౌర్జన్యం చేసే ప్రమాదం వుందనీ, వెంటనే వచ్చి తనని ఆదుకోమనీ మాకు టెలి ఫోన్ చేసింది.

నా సిబ్బందిని సమీకరించి వచ్చేసరికి జరగకూడనిది జరిగిపోయిందిక్కడ....సార్జంట్! అతన్ని సోదా చెయ్!" అన్న ఇన్‌స్పెక్టర్ మాటలు విని దిగ్భ్రాంతితో మణిదీప్ తల గిరగిర తిరగసాగింది.

సార్జంట్ ముందుకు వచ్చి, అతని జేబుల్లో ఉన్న రెండు

నోట్ల కట్టల్నీ, వజ్రపు టుంగరాన్నీ నెక్లెస్ బైటికి తీశాడు.

మణిదీప్‌కు అవేమీ వినిపించడంలేదు. అతని కళ్ళల్లో నింగీ, నేలా రంగుల రాట్నంలా తిరుగుతున్నాయి అదుపు తప్పి. పోలీసుల్ని ఆమే స్వయంగా ఫోన్ జేసి పిలిపించిందా? ఎందుకు? ఆ నగదూ, డబ్బూ ఆమే స్వయంగా తనకిచ్చిందని అరిచి గీపెట్టినా ఇప్పుడు వాళ్ళు వినిపించుకుంటారా?

నంగనాచి. ఎంత నాటకమాడింది! తనామెకు ఏం అపకారం చేశాడని ఈ విధంగా ప్రతీకారం తీర్చుకుంది? మణిదీప్ మస్తిష్కంలో సవాలక్ష తేలు కొండీలు ప్రత్యక్షమై సమాధానాలు దొరక్క అదృశ్యమౌతున్నాయి.

బహుశా, అతనికి ముప్పై ఏళ్ళ క్రితం ఆమె తొలి యవ్వనప్రాయంలో జరిగిన సంఘటనలు తెలిసి వుంటే, ఆ ప్రశ్నలకు సమాధానాలు అతిసులభంగా అర్థమయ్యేవి.

* * *

ముప్పై ఏళ్ళక్రితం బెంగుళూరులో నివసించే అతి సామాన్యమైన ఒక బట్టల వ్యాపారి కూతురు శ్రీదేవి. మణిదీప్ తండ్రి హరినారాయణ ఆ నాటి బ్రిటిష్ ప్రభుత్వంలో పెద్ద హోదా వెలగబెట్టిన ఆఫీసర్ కొడుకు

ఆర్థికదృష్ట్యా సమాజంలో వారి మధ్య తారతమ్యం వున్నా, స్కూలు జీవితంలో విద్యార్థుల మధ్య తరతమ భేదా లుండవు కనుక, అతని తండ్రీ, ఆమె ఒకే స్కూల్లో కలిసి చదువుకునేవారు.

వయసు దృష్ట్యా ఆ రోజుల్లో అతని తండ్రి కాస్త రంగేళీ తత్వం కలిగిఉండేవాడు గనుక, అప్పుడే తొలకరి ప్రాయంలో అడుగుపెట్టిన ఆమె అందచందాలకు ఆకర్షితుడై, ప్రేమగాలం వేసి ఆమెను తనవైపు లాక్కోగలిగాడు.

ప్రేమ పాఠాలు వల్లిస్తూ ఆమె లేత మనసులో పంచ రంగుల గాజు హర్మ్యాలు నిర్మించాడు. పెళ్ళి జేసుకుని తన హృదయ పీఠంమీద ప్రతిష్ఠించుకుంటానని బాసలు జేశాడు. ఆమె అతన్ని నమ్మింది. గుడ్డిగా నమ్మి తన సర్వ స్వాన్ని అతని కర్పించుకుంది. అంతే!

తుమ్మెదలా ఆమె మకరందాన్ని గ్రోలి, పెళ్ళి చేసుకో మనగానే పకపక నవ్వి, పై చదువుల నెపంతో విదేశానికి వెళ్ళిపోయాడు. అక్కర తీరగానే ఆడది మగాడి దృష్టిలో అరటితొక్క కింద సమానం అని పాపం అప్పుడా అమా యకురాలికి తెలీదు.

దాంతో ఆమె మదిలోని పంచరంగుల గాజు హర్మ్యాలు పగిలి తునాతునకలై, మనసును రక్తసిక్తం చేశాయి. అతను వెళ్ళిపోయినా, అతనిచ్చిన ఆ వజ్రపు టుంగరం మాత్రం మిగిలిపోయింది ఆమె చేతికి జ్ఞాపక చిహ్నంగా!

విదేశాల నించి తిరిగి రాగానే భారీ కట్నం కానుకలతో ఒక ధనవంతుని కూతురి మెడలో మాంగల్యం ముడి వేసే శాడు హరినారాయణ.

మాయ మాటలతో తనను వంచించి, తన సర్వస్వాన్ని దోచుకుని, డబ్బు కోసం మరో స్త్రీని పెళ్ళాడిన అతని మీద ఆమెలో తీవ్రమైన ప్రతీకారాగ్ని రగులుతుంది. అనుక్షణం ఆమెను దహించి వెయ్యసాగింది.

కూతురి పరిస్థితికి కుమిలిపోయిన ఆమె తండ్రి కుటుంబ సమేతంగా హైద్రాబాదుకు మకాం మార్చాడు. కాలంతో బాటు ఆమెలోని ప్రతీకార వాంఛ దిన దిన ప్రవర్ధమాన మయ్యిందేగానీ ఆరిపోలేదు. అది అనుక్షణం తనను గుర్తుండేలా ఆనాడు అతనిచ్చిన ఆ ఉంగరాన్ని తీసివెయ్యా కుండా అలాగే వుంచుకుంది వేలికి.

మోసంతో మరో వ్యక్తికి అర్ధాంగి కావడం ఇష్టంలేక అలాగే వుండిపోయింది అవివాహితురాలిగా. తండ్రి చని పోగానే హరినారాయణ మీద పగ తీర్చుకోడానికి అతని కోసం ఎంతగానో గాలించి, అచూకీ దొరక్క నిర్లిప్తంగా కాలం గడపసాగింది. ఆ ఒంటిరి తనమే ఆమెను ఒకరకం మానసిక రోగిగా మార్చివేసింది.

ఇన్నాళ్ళ తరవాత హఠాత్తుగా పత్రికలో హరినారాయణ గురించి చదివి, అతడు చనిపోయినా, మానసిక రుగ్మత వల్ల విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి, అతని ప్రతిరూపంగా ఈ లోకంలో మిగిలిన మణిదీప్‌ను ఆ ఉంగరంతోనే ఉచ్చులో బిగించి, ఉరికంబం ఎక్కించి, తన ప్రతీకారం తీర్చుకోడానికి పథకం వేసింది.

ఆ విధంగా దెబ్బతిన్న బెబ్బులీ, వంచించబడ్డ ఆడదీ ఎంత ప్రమాదకరంగా పరిణమిస్తారో నిరూపించింది. □

ఆకలి! ఆకలి!!



మేఘాలు

వసుంధర

"ఆమెనంత క్రూరంగా హింసించి ఎందుకు చంపావ్?"

అన్నాడతడు. అతడు పోలీస్ ఇన్‌స్పెక్టరు కాదు. లాయరు కాదు.

ఒక రచయిత.

నన్ను రేపు ఉరి తీయబోతున్నారు. నా చరిత్ర రేపటితో అంతమవుతున్నప్పటికీ దాన్ని శాశ్వతం చేయాలన్న ఉద్దేశ్యంతో అతను వచ్చాడు నా వద్దకు. అందుకోసం అతడు

చాలా కష్టపడ్డాడు.

అతడి పేరు నేను విన్నాను. నా బాధ నతడు అర్ధం చేసుకోగలడేమో ననిపించింది.

* * *

సుజాత నా భార్య. అందానికి మారురూపం ఆమె! ఆమె అంటే నా కెంతో యిష్టం. నే నామెను ప్రేమించిన దానికి వందరెట్లుగా సుజాత నన్ను ప్రేమిస్తోంది. అందుకు ఎన్నో సాక్ష్యాలున్నాయి.

నాకు జలుబు చేస్తే సుజాతకు స్థిమితం వుండదు. నాకు చిన్న దెబ్బ తగిలితే ఆమె ప్రాణం విలవిల్లాడి పోతుంది. నిజం చెప్పాలంటే ఆమె గురించి నే నంతలా పట్టించుకోను. ఆమె అంటే నాకు ఇష్టం. అంతే!

నాకు పెద్దలు సంపాదించిన ఆస్తి వుంది. భార్య నుంచి కలిసిన ఆస్తీ వుంది. హాయిగా విలాస జీవితా న్ననుభ వించాలనే మనసూ వుంది.

సుజాత పద్ధతి వేరు. జీవితం మీద ఆమెకున్న అభి ప్రాయాలు వేరు. మనిషన్న ప్రతివాడూ తనకు తానై ఏదైనా సాధించాలన్నది ఆమె అభిప్రాయం. విలాస మన్నది జీవితంలో ఒక భాగం మాత్రమే అని ఆమె భావి స్తుంది. అయినప్పటికీ ఆమె నా కోర్కెల కెన్నడూ అడ్డు చెప్పలేదు.

నా కోసమని ఆమె చెయ్యని పనిలేదు. నాతోపాటు మద్యం పుచ్చుకుంది. నా ముందు నగ్నంగా నృత్యం చేసేది. నే నెలా మసలమంటే అలా మసిలేది.

అయితే విలాసిని పరిచయం అనుకోకుండా నాకు లభిం చింది.

విలాసిని అందం మాటలతో వర్ణించలేనిది. మగవాడికి

ఆడదానిగా వెంటనే స్ఫురిస్తుంది విలాసిని. పురుషుడి నలరించడానికి ఆమె వద్ద ఎన్నో విద్యలు! నేను సరిగ్గా వారం రోజుల్లో ఆమెకు దాసోహమైపోయాను.

సుజాత నేను చెప్పినట్లు చేసేది. విలాసిని చెప్పినట్లు నేను చేసేవాణ్ణి. రెండోదాంట్లోనే నాకు ఎక్కువ ఆనందం కనపడింది.

నేను విలాసినితో తిరగడం ఎక్కువయ్యాక ఒక రోజున సుజాత నన్ను హెచ్చరించింది "మీరు చెడిపోతున్నారు...." అని.

"చెడిపోవడమంటే ఏమిటి?" అనడిగాను.

"విలాసినితో తిరగడం...."

గతుక్కుమన్నాను "నీకు తెలిసిపోయిందా?"

"రహస్యంగా వుంచడానికి మీరు ప్రయత్నించలేదు..."

"సరే—ఇకమీదట ప్రయత్నిస్తాను" అన్నాను.

సుజాత అప్పటికేమీ మాట్లాడలేదు. ఒక నెలరోజుల తర్వాత ఆమె మళ్ళీ అంది "డబ్బు మంచినీళ్ళలా ఖర్చు పెడుతున్నారు...."

"ఈ రోజుల్లో మంచినీళ్ళకు కరువుగా వుంది. అంతా పొదుపుగా వాడుతున్నారు. నేను డబ్బును మంచినీళ్ళలా ఖర్చు పెడుతున్నానంటే పొదుపుగా వాడుతున్నాననే అర్ధం...."

"కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయి...."

"కొండల సంగతి ఎలాగున్నా యెవరైనా కూర్చునే తింటారు...."

సుజాత సామెతలను ఆపి "మీరు విలాసిని పేరు చెప్పి డబ్బు చాలా వృధా చేస్తున్నారు" అంది.

"విలాసిని పేరు చెప్పి చేసే ఖర్చు నాకు వృధా అని

పించలేదు....”

“అయినా ఇంట్లో నేనుండగా మీరు దానిచుట్టూ తిరుగుతారేం?”

సుజాత నా భార్య కావడం అదృష్టం. నేను విలాసినితో కలిసి తిరగడం తప్పు అని ఆమె ఒక్క పర్యాయం కూడా అనలేదు.

“విలాసినికీ నీకూ చాలా తేడా వుంది. అది నువ్వు స్వయంగా చూసి తెలుసుకోవలసిందే” అన్నాను.

“ఎలా తెలుసుకోవడం?” అంది సుజాత శాంతంగా.

“కొన్నాళ్ళామెను ఇంటికి తీసుకుని రానా?”

“ఊఁ” అంది సుజాత అన్యమనస్కంగా.

ఆ విధంగా విలాసిని మా యింటికి వచ్చింది. ఒక వారం రోజులు మా రాసలీలలను చూసింది సుజాత.

తర్వాత నాతో “విలాసినిలా నేనుండలేను. ఆమెకూ నాకూ చాలా తేడా ఉన్నదని నే నొప్పుకుంటాను” అంది సుజాత.

“అయితే మా జీవితానికి అడ్డురాకు” అన్నాను.

“విలాసినిలా ఏ భార్య వుండలేదు” అంది సుజాత.

“విలాసిని వుండగలదుగా” అన్నాను.

“ఆమె మీ భార్య అయితే అలా వుండలేదు” అంది సుజాత.

“ఆమె నా భార్య అయితే అలా వుంటే నీకు అభ్యంతరం లేదా?” ఆశగా అడిగాను.

“అదే నేను కోరేది. మీ రామెను వివాహం చేసుకుంటే సమాజంలో నా స్థానం చులకన కావచ్చు. కానీ మీ పరువు నిలబడుతుంది. మిమ్మల్నందరూ చెడిపోయిన వ్యక్తిగా పరిగణిస్తున్నారు” అంది సుజాత బాధగా.

నాకు సుజాత మీద జాలివేసింది. ఆమెకు తన గురించి బెంగలేదు. కేవలం నా గురించి ఆమె ఆలోచిస్తున్నది. నేను స్వార్ధపరుణ్ణి! ఈ విషయం గుర్తించినప్పటికీ నా స్వార్ధం నాకు బాగున్నది.

నేను విలాసినిని పెళ్ళి గురించి అడిగాను.

"నీ భార్య చెప్పింది నిజమే! పెళ్ళైతే ఇలా ఉండడం కష్టం" అంది విలాసిని నిర్మోహమాటంగా.

"ఎందుకని!"

"ఇప్పుడు నువ్వు నాకిచ్చే విలువైన కానుకలు నావిగానే వుండిపోతున్నాయి. పెళ్ళయితే అవి మనవిగా మారిపోతాయి. అంతేకాదు. అప్పుడు నువ్వు నాకు కానుకలివ్వడం మానేస్తావు" అంది విలాసిని.

నాకు విలాసినిమీద కోపం రాలేదు. ఆమె నిజం మాట్లాడుతుంది. అందుకే నాకామె అంటే యిష్టం. ఆమెకు నా మీద ప్రేమలేదు. డబ్బుకోసం నన్ను చేరింది. ఆ విషయం ధైర్యంగా ఒప్పుకుంటుంది. నా ముందే చెబుతుంది.

నా దగ్గర డబ్బైపోతే మరో డబ్బున్నవాణ్ణి వెతుక్కుంటుంది.

"నీ వేదాంతం బాగానే వున్నది. కానీ ఎంత డబ్బున్నా ఆడదాని జీవితానికి ఏదో క్షణంలో మగతోడు అవసరమవుతుంది. మన జీవితం ఎప్పుడూ ఇలాగే వుండాలి. మనకు పెళ్ళి కావాలి. అందుకు మనమేం చేయాలో చెప్పు" అన్నాను.

"నీ ఆస్తి విలువ ఎంత?" అంది విలాసిని

"ఐదు లక్షలు...." అన్నాను.

విలాసిని నిట్టూర్చి "కనీసం యాభై లక్షలైనా వుంటే

తప్ప మనం కేర్‌ఫ్రీగా జీవించే అవకాశం లేదు....”
అంది.

నేను నిరుత్సాహంగా “అంత డబ్బు ఎలా సంపాదించడం?” అన్నాను.

“మనసుంటే మార్గాలున్నాయి” అంది విలాసిని.

“చెప్పు!” అన్నాను ఉత్సాహంగా.

విలాసిని చెప్పడం ప్రారంభించింది. ఆమె చెప్పినదాని సారాంశ మేమిటంటే—సహజ వ్యతిరేక శక్తులతో నేను చేతులు కలపాలి.

“నావల్ల అవుతుందా?” అన్నాను భయంగా.

నా మనసులో భయమే తప్ప—తప్పు చేస్తున్నానన్న భావన లేదు.

“నీకు సమాజంలో హోదా వుంది. డబ్బుంది. అందమైన భార్య వుంది. నీవల్ల కాని పనిలేదు—....” అంది విలాసిని.

విలాసిని మాటల అర్థం నాకు వెంటనే స్ఫురించలేదు.

కొన్ని మత్తు పదార్థాలను రవాణా చేయించడానికి నా భార్యవంటి ఆడవాళ్ళ నుపయోగించుకుంటాయి కొన్ని సంస్థలు. ప్రతిఫలం చాలా హెచ్చుగా వుంటుంది.

ముందు తనకు తెలియకుండానే సుజాత ఇందులో ఇరుక్కుంది. ఆమె విషయం గ్రహించి నాకు చెప్పేక నేనూ ముందు నొచ్చుకొన్నాను. కానీ నాకు డబ్బు వస్తోంది. విలాసినిపట్ల నా ఆకర్షణ నానాటికీ పెరిగిపోతోంది.

“నన్ను మీరు స్మగ్లర్‌గా మార్చారు....” అంది సుజాత ఓ రోజున.

“నాకోసం....ప్లీజ్....” అన్నాను.

“మీ కోసం నేను ఏమైనా చేస్తాను. సరే....కానీ మీరు

నా కోసం ఏమీ చెయ్యరా?" అంది సుజాత.

"నీకోసం నేను చేయగలిందీ ఒక్కటే....అది బ్రత కడం...." అన్నాను.

నేను బ్రతకాలన్నది సుజాత కోరిక. విలాసిని లేనిదే నేను బ్రతుకలేనని ఆమెకు చెప్పాను. అందువల్ల విలాసిని గురించి ఆమె మాట్లాడలేదు విలాసిని నాతో వుండాలంటే డబ్బు కావాలి. డబ్బు కావాలంటే సుజాత సమాజ వ్యతిరేక శక్తులకు సాయపడాలి.

సుజాత అందమైనది. తెలివైనది. ఈ రెంటి సాయంతో ఆమె రెండు చేతులా డబ్బు సంపాదిస్తున్నది. అయితే శారీరకంగా ఆమె మలినపడలేదు. అది నాకు తెలుసు. ముఠా వ్యక్తులు కూడా ఆమె శక్తి సామర్థ్యాలు తెలిసి—ఆమెను కోల్పోవడాని కిష్టపడరు. నిప్పులాంటి మనిషి అన్న పేరు ఆమె కున్నది. కానీ ఆ మనిషి నిప్పులాగుంటూ యెవరికి సాయపడుతున్నది!

నా ఆస్తి పెరుగుతున్నది. సమాజంలో నా పేరు ప్రతిష్ఠలూ పెరుగుతున్నాయి.

లక్షలకు లక్షలు ఆర్జించిపెట్టే సుజాత అందం, తెలివి ఆమె నన్ను వశపర్చుకొనేందుకు పనికిరావడంలేదు. విలాసిని నుంచి నన్నామె వేరుచేయలేక పోతున్నది.

ఒక రోజున నే నామెను అడిగాను—"నీ తెలివితేటలు చూపి—నన్నెందుకు వశపర్చుకోవు?"

"అది నా స్వభావానికి విరుద్ధం! నన్ను చూసి మీరు మోజుపడాలి కానీ—మీకు మోజు పడేలా చేయడానికి ప్రయత్నించడం నాకు నచ్చదు. నాది వేశ్యా స్వభావం కాదు."

"భార్యాభర్తల అనుబంధాన్ని నువ్విలా అర్థం చేసు

కున్నావా?"

"సంవత్సరానికి మూడువందల అరవై అయిదు రోజులు. అన్ని రోజుల భార్యాభర్తల అనుబంధంలో మీరు ప్రాధాన్యత నిచ్చే అంశం మూడువందల గంటలు కూడా వుండక పోవచ్చును...." అంది సుజాత.

నేనేమీ మాట్లాడలేదు. నేను సుజాతతో వాదించదల్చుకోలేదు. సుజాత నాకు అడ్డురావడంలేదు. నాకు విలాసిని కావాలి.

ఏళ్ళు గడుస్తున్నాయి.

"ఇలా యెంత కాలం?" అంది సుజాత ఒక రోజున.

"ఏం?"

"మనం కలిపి మనకంటూ కాపురం యేర్పరచుకోలేదు. మనకు పిల్లలు కూడా లేరు—" అంది సుజాత.

"అది నా తప్పు కాదు—" అన్నాను. నాకు తెలుసు, పిల్లలు పుట్టకుండా సుజాత జాగ్రత్తలు తీసుకొంటున్నది. నేను విలాసిని మైకంలో వున్నప్పటికీ నా భార్యను నిర్లక్ష్యం చేయడంలేదు.

"మన పిల్లలు ఈ వాతావరణంలో పెరగడం నా కిష్టం లేదు. అది నా తప్పంటారా?" అంది సుజాత.

"తప్పు నీదని నే ననలేదు. నాది కాదని అన్నాను. అంతే!" అన్నాను మామూలుగా. నా హృదయానికి తెలుసు. సుజాతకు నే నన్యాయం చేస్తున్నానని. కానీ సుజాతే నాతో ఆ మాట అనడంలేదు. అటువంటప్పుడు నే నెందుకు బాధపడాలి? అయితే ఒకటి మాత్రం నిజం. సుజాతకు నా వంటి భర్త దొరకడం ఆమె దురదృష్టం. అయితే ఆమె దురదృష్టమే నా అదృష్టమనీ నాకు తెలుసు. ఇతరుల దురదృష్టం గురించి కాక నా అదృష్టం గురించి

మాత్రమే ఆలోచించే రకం నేను.

నా ఆర్థిక పరిస్థితి చాలా గొప్పగా వున్నది. ఒక రోజున విలాసిని నాతో అన్నది—"ఇక నేను వివాహం చేసుకొనవచ్చును...."

చాలా ఆత్రుతగా—"ముహూర్తం యెప్పుడు?" అనడిగాను.

"మధ్య నీ కెందుకు ఆతృత?" అంది విలాసిని.

"నా కాక్కపోతే ఇంకెవరికి?" అన్నాను.

"నామీద నీ కింకా మోజు తీరలేదా?" అందామె ఆశ్చర్యంగా.

"ఈ మోజు తీరేదికాదు...." అన్నాను.

"అయితే నాకు కొన్ని షరతు లున్నాయి—" అంది విలాసిని.

ఆమె చెప్పిన ప్రకారం సుజాత యిల్లు వదిలి వెళ్ళిపోవాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఇల్లు వదిలి వెళ్ళనంది సుజాత.

ఇల్లు వదలని పక్షంలో తనకు దాసిలా ఊడిగం చేయాలన్నది విలాసిని. దీనికి సుజాత వెంటనే అంగీకరించింది.

సుజాత ఎంతటి భయంకరమైన జీవితానికి అంగీకరించిందో నేను కళ్ళారా చూశాను. ఒకో పర్యాయం నాకే ఏడుపు వచ్చేది. డబ్బుకు పనిచేసే ఏ మనిషీ ఆ మాటలు సహించదు. ఆ చేతలు భరించదు.

"సుజాతా — ఇదంతా నువ్వెలా భరిస్తున్నావు?" అన్నాను ఓ రోజు.

"ఏం?" అంది సుజాత.

"చాలా అవమానంగా లేదూ నీకు...."

"చూడండి. వివాహమైన పరుక్షణం నుంచీ నా మానావమానాలను మీకు ముడిపెట్టేశాను. మీరు భరించ గలిగిన ప్రతీదీ నేను భరించగలను—"

ఆ మాటలు నాకు సూటిగా తగిలాయి. నేను విలాసిని వద్దకు వెళ్ళి—"సుజాత చాలా మంచిది. ఆమె నిలా మాటలతో, చేతలతో హింసించడం మంచిది కాదు—" అన్నాను.

"ఇలాంటివి నాకూ సరదా కాదు. ఇలా చేయడం నాకూ బాగోలేదు. కానీ సుజాత మనమధ్య వుంటే మనకు సుఖముండదు. ఈ విధంగా చేస్తే ఆమె వెళ్ళిపోతుందేమో నని చూస్తున్నాను. ఆమె ఓర్పుకు అంతమున్నట్లు కన బడ్డంలేదు—...."

"ఇంక నాకు ఒక్కటే మార్గం కనబడుతున్నది ..." అంది విలాసిని.

"ఏమిటది?"

"ఆమెనే అంతం చేయడం ..."

ఉలిక్కిపడ్డాను. "ఎందుకు?"

"నీకు నామీద మోజుంటే అది తప్పదు...."

నాకు విలాసినిమీద మోజున్నది. కానీ ఆ మోజుకు సుజాతను చంపేటంత బలమున్నదా?

విలాసిని నా వంక జాలిగా చూసి—"ఒక నిజం తెలిస్తే నువ్వు ఈ క్షణమే వెళ్ళి సుజాతను క్రూరంగా చంపేస్తావు—" అన్నది.

"అసంభవం—...." అన్నాను.

"ఇంతకాలం సుజాత నీతో ఆడుకున్నది. ఆమె నువ్వనుకున్నట్లు మంచిదికాదు. పెళ్ళికిముందే ఓ స్మగ్లర్‌తో సంబంధ మున్నదామెకు. ఆ స్మగ్లర్ కామె ఎన్నోసార్లు సాయపడింది. వివాహమైనాక కూడా ఆ స్మగ్లర్‌తో తన సంబంధం కొనసాగించునేందుకు నన్ను నియోగించింది–" అంది విలాసిని.

"ఏమిటీ?" అన్నాను ఉలిక్కిపడి.

"అవును. నిన్ను వశపరచుకోమని నన్నామే నియోగించింది. నువ్వామె మాయలో పడి ఆమె నీ కోసం త్యాగాలు చేస్తున్నదనుకొంటున్నావు. ఆమె తన ఇచ్చ వచ్చిన రీతిని జీవితం అనుభవిస్తున్నది. ఆమె ఆడుతోన్నదో పెద్ద నాటకం. ఆ నాటకంలో నే నో పాత్రధారిని. ఆమె చెప్పినట్లల్లా ఆడుతున్నాను. అంతే!...." అంది విలాసిని.

"ఇదంతా ఎందుకు?"

"ఆమె తనకు కావలసినంతా సంపాదించేక నీ నుంచి విడాకులు కోరుతుంది. అందు కవసరమైన సాక్ష్యాలన్నీ సేకరించుకొన్నది...."

"ఈ నిజం ఇంతకాలం ఎందుకు దాచావు?"

"ఇన్నేళ్ళ సాహచర్యం నాకూ నీ మీద మోజును పెంచింది. సుజాత అడ్డు తొలగించుకొని నేనే నీ దాన్ని కావాలనిపించింది...."

నా వళ్ళు కంపించింది. ఇది నే నూహించనిది. ఇప్పుడు నేనేం చేయాలి....

* * *

"మీరు పేరున్న రచయితలు. మానవ మన స్తత్వాల్ని కాచివడబోసి వుంటారు. నేనామెను చంపబోయే ముందు అంత క్రూరంగా ఎందుకు హింసించానో, ఎలా హింసించ గలిగానో మీకు అర్ధమయే వుంటుందనుకుంటాను. లేదా మీకు యింకా యిది విచిత్రంగానే వున్నదా?" అన్నాను.

అతడు నా వంక అదోలా చూశాడు—"మానవ మేధస్సు విచిత్రమైనది. అది ఎప్పుడు ఏ విషయానికి ఎలా రియాక్టవుతుందో చెప్పడం కష్టం. మీ కథ నాకు చాలా చిత్రంగా వున్నది. అంతకంటే విచిత్రంగా వున్నది మీరు చేసిన హత్య...."

"ఏమిటా విచిత్రం?" అన్నాను చురాగ్గా.

"మీరు హత్య చేసింది సుజాతను కాదు. విలాసినిని ..."

పకపకా నవ్వాను—"అవును సార్! నేను విలాసినినే చంపాను. విలాసిని ఎన్నటికీ నా జీవిత భాగస్వామి కాలేదు. నా భార్య సుజాత అన్నట్లు సంవత్సరానికి మూడు వందల అరవై అయిదు రోజుల్లో మూడువందల అరవై గంటలకు మాత్రమే అవసరపడే ఆడది ఆమె! మిగతా సమయ మంతటికీ కావలసింది సుజాత వంటి ఆడది.

నే నెన్ని తప్పులు చేసినా ఏదో ఒక రోజున సుజాత సీడన వాటిని క్షాళనం చేసుకోగలననే నమ్మకంలో ఉన్నాను. సుజాతను నేనొక దేవతలా ఆరాధిస్తున్నాను. ఆ దేవతను విలాసిని హింసించినా సహించగలిగాను. కానీ ఆమె శీలంపై నిందవేసి—ఆమె చరిత్రనే మార్చివేసే కథ చెప్పినందుకు విలాసినిని మన్నించలేకపోయాను. ఆమె చెప్పింది అబద్ధమైతే—అలాంటి అబద్ధం చెప్పినందుకు—

ఆమె చెప్పింది నిజమైతే—అలాంటి నిజం చెప్పి నా కలలు భగ్నం చేసినందుకు—విలాసినిమీద పళ్ళు తెలియని కోపం వచ్చింది. ఆ కోపంలో యేం చేశానో నాకే తెలియదు ..."

"ఇంతకీ విలాసిని చెప్పినదాంట్లో నిజముందేమో తెలుసుకున్నారా?"

"లేదు. హత్య చేయగానే పోలీస్‌స్టేషన్‌కు వచ్చాను. ఆమెను ఆవేశంలో చంపానని చెప్పాను. లొంగిపోయాను. నాకు నా భార్య గురించిగానీ మరే విశేషాలూ చెప్పవద్దని కోరాను...."

"ఎందుకని?

"బ్రతికుండగా సుజాతను సుఖపెట్టలేకపోయాను. కానీ మనసులో ఆమెను దేవతలా ఆరాధించాను. సుజాత గురించి నేను నమ్ముతున్న నిజం తప్ప మరోటి నాకు తెలియకూడదు. ఆ ఆరాధనలోనే నేను చచ్చిపోవాలి. ఇదీ నా కోరిక...." అని ఓ క్షణం ఆగి—"రచయితగారూ! నా కథను చరిత్రలో నిలపదల్చుకుంటే నా కెటువంటి అభ్యంతరమూ లేదు. కానీ నా కథలో సుజాతకు నా మనసులోని స్థానమే వుండాలి తప్పితే—విలాసిని అబద్ధానికి అనుగుణంగా వుండకూడదు. ప్లీజ్—నా కోరిక తీరుస్తారు కదూ!" అన్నాను.

రచయిత నా వంక సూటిగా చూశాడు. కొద్దిసేపట్లో చావబోయేవాడి ఆఖరి కోరికను తీర్చేవాడిలాగే వున్నాడతడు. కానీ...సుజాతను గురించిన అసలు నిజమేమిటీ అన్న ప్రశ్న అతడి కళ్ళలో కనబడుతూనే వున్నది. □

చేతులు కాలాయి

విశ్వమోహిని

'ఈ రోజు అయినా ఆయన ఇంటిపట్టునుంటే బావుణ్ను!' అనుకొంది సుశీల.

భర్త తయారయి వెళుతూంటే అదే మాట అందామె.

"ఇవాళ్టికి నర్సింగ్‌హోంకి వెళ్ళకపోతేనేం?" అంది అర్థింపుగా.

"ఏం?...." అన్నాడు డాక్టర్ మోహన్ ఆశ్చర్య

పోతూ.

"నొప్పులొచ్చేటట్టున్నాయి" అందామె సిగ్గుగా.

"భయంగా వుందా?"

"భయం కాదు. దగ్గర మీరుంటే అదో ధైర్యం."

"డోంట్ బీ సెంటిమెంటల్, సుశీ! కాన్పు సులభంగా అవుతుందని డాక్టర్ మంజుల చెప్పిందిగా. వెళ్ళగానే కారు వెనక్కి పంపిస్తాను. మంజుల నర్సింగ్‌హోంకి వెళ్ళు. నేను కూడా ఆవిడకు ఫోన్ చేసి మాట్లాడుతాను" అంటూ భార్య చెంపమీద మృదువుగా చిటికె వేశాడు మోహన్.

"ఇవాళ మీరు నర్సింగ్‌హోంకి వెళ్ళక తప్పదా?" అందామె నిరుత్సాహంగా.

"తప్పదు, డియర్! ఇవాళ అర్జెంట్ కేసొకటి వుంది మరి" అని ఆమెకు జవాబిచ్చి స్టెతస్కోప్ తీసుకుని చర చరా వెళ్ళిపోయాడు డాక్టర్ మోహన్.

వీధి గుమ్మం వరకు వచ్చిన సుశీల నిరుత్సాహంతో నీరసం పెనవేసుకోవడంతో తలుపుకి ఆనుకొని కారు వెళ్ళినవేపే చూస్తూండిపోయింది.

ఆ తరువాత కొంతసేపటికి అక్కడినుండీ కదిలి మెల్లగా నడిచివెళ్ళి సోఫాలో కూర్చున్నదామె.

నెలలు నిండిన కడుపు భారంగా వుంది. అనుక్షణమూ కడుపులో యెవరో కదులుతున్నట్లు వింత అనుభూతి!

సుశీల, మోహన్‌లకు వివాహమయిన పదేళ్ళయింది. సుశీలకు పసిపాపలంటే ప్రాణం. కాని దురదృష్ట వశాత్తూ పదేళ్ళయినా పిల్లలు పుట్టలేదు ఆమెకు. అందుకు యెంతో దిగులుపడేది సుశీల. కాని, మోహన్‌కి మాత్రం ఆ బెంగేం వున్నట్టు కనిపించదు. ఎంతసేపూ ధన

సంపాదనే తన లక్ష్యంలా ప్రవర్తిస్తాడు. మొదట్లో ప్రభుత్వోద్యోగం వెలగబెట్టినా, ఏవో అక్రమ చర్యలకు పాల్పడ్డ కారణంగా వుద్యోగంలోంచి తొలగింపబడ్డాడు. ఆ తరువాత సొంత ప్రాక్టీసు పెట్టుకుని, కాలం కలిసిరావడంతో మూడేళ్ళ క్రితం ఓ నర్సింగ్‌హోంను కూడా కట్టించగలిగాడు.

తాను గొడ్రాలిగా మిగిలిపోవలసి వస్తుందేమోనని బెంగపడే భార్యను వోదార్చడం పోయి, 'పిల్లలు లేకపోతే వచ్చిన నష్టమేమిటోయ్‌? లెటజ్ ఎంజాయ్ లైఫ్' అనేవాడు మోహన్. ఆమె మనసు గాయపడేది. డాక్టర్ని పెళ్ళాడి పొరపాటు చేశానా అనిపించేది ఆమెకు అప్పుడప్పుడు. తన మీద ప్రేమానురాగాలు కురిపించే భర్తకు పిల్లలపైన మోజు లేకపోవడానికి కారణమేమిటో బోధపడేది కాదు.

చివరకు తన పోరు పడలేక భార్యను డాక్టర్ మంజులకు చూపించాడు అతను. సుశీలను పరీక్షించిన మంజుల గర్భకోశంలో వున్న చిన్న ఆటంకాన్ని తొలగించడంతో, పదేళ్ళ తరువాత గర్భం దాల్చింది ఆమె.

ఆ శుభవార్త తెలుసుకొన్న రోజున ఆమెకు కలిగిన సంతోషానికి మేరలేదు.

భార్య గర్భం వయసు పోసుకునే కొద్దీ మోహన్‌కి కూడా ఆసక్తి కలిగింది. ఏ మూలో అణిగివున్న అనుభూతులు స్పందించసాగాయి అతనిలోనూ. భార్యను అపురూపంగా చూసుకోసాగాడు. డాక్టర్ మంజుల తరచు సుశీలను పరీక్షించి తగు జాగ్రత్తలను సూచించుతూ వుండేది.

నెలలు నిండేకొద్దీ సుశీలకు పుట్టబోయే బాబుపైనే వుండేవి ఆలోచనలన్నీ. ఆరోగ్యవంతుడయిన మగపిల్లాడే

పుడ్తాడని చెప్పింది డాక్టర్ మంజుల. లేకలేక పుడుతూన్న వాడు, బాబుకు ఏం పేరు పెట్టాలో, వాడికి ఏమేం దుస్తులు తొడగాలో, ఏ విధంగా పెంచాలో యిప్పటినుండే ఆలో చిస్తూండేది ఆ అనుభూతే అవ్యాజమైన ఆనందాన్ని కలగ జేసేది ఆమెకు.

ఆ రోజు లేచినప్పటి నుండీ కొంచెం అనుమానంగా వున్నది సుశీలకు. నొప్పులు రావచ్చుననిపిస్తోంది. పదేళ్ళ తరువాత కాన్పు ఎలా వుంటుందోనన్న భయం ఓ ప్రక్క! భర్త ప్రక్కనుంటే బావుండునన్న ఆశ!

అందుకే సిగ్గు విడిచి భర్తను అడిగింది ఆవేళ్టికి ఇంటి వద్దే వుండిపొమ్మని. కాని, అతను అర్జెంటుకేసు వున్న దంటూ వెళ్ళిపోవడంతో నిరుత్సాహం చెందింది.

2

ఆ రెండేళ్ళ పిల్లాణ్ని చూసి ఆశ్చర్యపోయాడు డాక్టర్ మోహన్.

"మరీ యింత పసివాడు మీ కెక్కడ దొరికాడు?" అన్నాడు ఆ వ్యక్తులతో.

"నిన్న సాయంత్రం ఏదో పార్కునుండి పట్టుకొచ్చారు మా వాళ్ళు" అన్నాడు ఓ వ్యక్తి.

ఆ పసివాణ్ని అక్కడికి తీసుకొచ్చిన వ్యక్తు లిద్దరూ ఓ ముఠాకు చెందినవాళ్ళు. చంటి పిల్లల్ని ఎక్కడెక్కడి నుండో ఎత్తుకు రావడమూ, డాక్టర్ మోహన్ నర్సింగ్ హోమ్‌లో ఆ పిల్లల కాళ్ళో, చేతులో ఆపరేషన్ ద్వారా తొలగించి వికలాంగుల్ని చేయడమూ, ఆ తరువాత వారిని దేశంలోని మహానగరాలలో అడుక్కునేందుకు నియమించ డమూ ఆ ముఠా వృత్తి.

ధన దాహంతో బాధపడే మోహన్ ఏ డాక్టరూ చేయని

అతి నీచమైన పనిచేస్తూ తన వృత్తికే ద్రోహం చేయనారంభించాడు. అటువంటి ఆపరేషన్లకు పెద్ద మొత్తాలను తీసుకుంటూ వాటితో అనతి కాలంలోనే ఆ నర్సింగ్‌హోం కట్టించ గలిగాడు.

వాళ్ళు మరీ అంత పసివాణ్ని తీసుకురావడం అదే మొదటిసారి.

"వీడికి కుడికాలు తీసెయ్యాలి డాక్టర్ బాబూ!" అన్నాడొక వ్యక్తి.

అమాయకంగా వున్న ఆ పిల్లాడి వంక చూశాడు మోహన్. తెల్లగా, బొద్దుగా, ముద్దొస్తున్నాడు వాడు ఓక్షణం అతని మనసు వూగులాడింది. ముక్కుపచ్చలారని ఆ పసి కందును తన కత్తికి బలి చేయడానికి మనస్కరించలేదు.

"మరీ ఇంత చంటాడికి హాని తలపెట్టడం అవసరమంటారా?" అన్నాడు వారితో.

అంతవరకు డబ్బుచూడగానే నోరుమెదపకుండా క్షణాల్లో నిర్దాక్షిణ్యంగా చెప్పిన పని పూర్తిచేసే డాక్టర్, ఆ రోజు మొదటిసారిగా జాలి చూపడం వింతగా తోచింది వారికి.

"కుర్రాడు ఎంత చిన్నవాడైతే అంత మంచిది వ్యాపారానికి....త్వరగా కానియ్. డాక్టర్ బాబూ!" అన్నాడు వారిలో ఒకడు, నోట్ల కట్టను మోహన్ చేతిలో వుంచుతూ.

డబ్బు చూడగానే మోహన్‌లోని జాలి, సంశయాలకు రెక్కలొచ్చేసాయి. డబ్బు జాగ్రత్తగా లెక్క చూసుకుని కోటు జేబులో వుంచుకున్నాడు.

అయోమయంగా బిత్తరచూపులతో భయం, భయంగా చూస్తూన్న పసివాణ్ని వాళ్ళు ఆపరేషన్ టేబిల్‌మీద పడుకోబెడితే, గ్లవ్స్ తొడుక్కుని సర్జికల్ ఆపరేటస్ వైపు నడిచాడు మోహన్.

3

ఆపరేషన్ పూర్తిచేసి వేడి వేడి టీ త్రాగుతూన్న మోహన్ టెలిఫోన్ మ్రోగడంతో రిసీవరందుకున్నాడు. డాక్టర్ మంజుల నర్సింగ్‌హోం నుంచి వచ్చింది కాల్. సుశీలకు నొప్పులు బాగా వస్తున్నాయనీ, అతనికోసం అడుగుతోందనీ చెప్పారు.

వెంటనే బయలుదేరాడు మోహన్. మొదటి సారిగా భార్యపట్ల ఆత్రుత ఏర్పడింది అతనిలో. ఆమెకు ప్రమాదం లేకుండా కులాసాగా వుండాలని మనసులోనే కోరుకున్నాడు.

మోహన్ నర్సింగ్‌హోంని చేరుకునే సరికి డాక్టర్ మంజుల ఎదురు పడింది.

"డాక్టర్! హౌ ఈజ్ షీ?" అన్నాడు మోహన్ ఆత్రుతగా.

"షి ఈజ్ ఆల్‌రైట్....మగపిల్లాడు పుట్టాడు. వెళ్ళి చూడండి" అనేసి, ఏదో పని వున్నట్టు అక్కడి నుండి వెళ్ళిపోయిందామె.

మగపిల్లాడనేసరికి సంతోషం కలిగించి మోహన్‌కి. గబగబా భార్య వున్న గదిలోకి వెళ్ళాడు.

భర్తను చూడగానే సుశీల కళ్ళు మెరిశాయి. అంతలోనే ఆమె వదనం వాడిపోయింది. ఆమె కళ్ళలో నీళ్ళునిలిచాయి.

"సుశీ! ఎందుకు కన్నీళ్ళు? బ్రతకవనుకున్నావ్ కదూ?... ఐ టోల్డ్ యూ ఇట్ వుడ్ బీ ఆల్‌రైట్....బాబు పుట్టాడుగా, ఇంకా ఏడుపెందుకు?" అంటూ అనురాగంతో భార్య కళ్ళు తుడవబోయాడు మోహన్.

సుశీల మాట్లాడలేదు. సజల నయనాలతో ప్రక్కలో వున్న పిల్లాడిమీద కప్పిన గుడ్డను తొలగించింది.

పిల్లాడివంక ఆసక్తిగా చూసిన మోహన్ అదిరిపడ్డాడు. ఆ పసికందుకు ఒక కాలూ, చేయీ లేవు!!

□

ఆరడుగుల శవం

బొమ్మిడి అచ్చారావు

శవం ముఖం గుర్తు తెలీకుండా చెక్కేశారు. దాదాపు ఆరడుగుల పొడవు. ఒంటిమీద ఖరీదైన పిమెంటుకలర్ పోలిస్టర్ షర్టు, గోధుమరంగు గాబర్డియన్ ప్యాంటు వున్నాయి. మెడలో పులిగోరుతో చేసిన బంగారు పతకం వుంది. కాళ్ళకు ఖరీదైన బాటా షూస్ వున్నాయి.

ఇనస్పెక్టర్ శ్రీనివాస్ ఫోటోగ్రాఫర్ వంక సాభిప్రాయంగా చూశాడు. వేలిముద్రల నిపుణుడు తన పని చేసుకు

పోతున్నాడు. పాథాలజిస్టు తన ప్రాథమిక పరీక్ష పూర్తిచేసి నట్టున్నాడు. లేచి నించుని, సిగరెట్టు వెలిగించాడు.

శ్రీనివాస్ డాక్టర్‌వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఎడమ పక్క టెముకలను చీల్చుకుని బుల్లెట్ గుండెలో చిక్కుకున్నదని నా అభిప్రాయం. పోస్టుమార్టంలో క్లియర్ రిపోర్టు యిస్తాను. వెంటనే ప్రాణం పోయి వుంటుంది. హత్య రాత్రి పన్నెండున్నర రెండు గంటల మధ్య జరిగి వుంటుంది" అన్నాడు డాక్టరు.

శ్రీనివాస్ వాచ్ చూసుకున్నాడు. ఉదయం తొమ్మిదీ నలభై అయింది. అంటే దాదాపు తొమ్మిది గంటలయి వుండొచ్చు హత్య జరిగి—అనుకున్నాడు.

"హతుడి వయసు నిర్ధారించగలరా?" అడిగాడు శ్రీనివాస్.

"దంత క్రమాన్ని, శరీర నిర్మాణాన్ని బట్టి సుమారుగా ముప్పయిరెండు, ముప్పయినాలుగు సంవత్సరాలుండవచ్చు నని ఊహిస్తున్నాను" అన్నాడు డాక్టర్.

అది ఊరికి చివరగా వున్న మామిడితోపు. సాధారణంగా రాత్రి ఎనిమిది గంటల తర్వాత అక్కడంతా నిర్మానుష్యంగా వుంటుంది. భయంగా కూడా వుంటుంది. జనం ఆ సమయంలో సాధారణంగా అటు వెళ్ళరు.

ఇనస్పెక్టర్ శ్రీనివాస్ పరిసరాల్ని జాగ్రత్తగా పరిశీలించి చూశాడు.

మెయిన్‌రోడ్‌కి దాదాపు యిరవై గజాల లోపలికుంది మామిడి తోపు. చుట్టూ పంటపొలాలు. రోడ్‌కి సమాంతరంగా సామర్లకోట వైపునుండి సముద్రం వైపుగా సాగిన పంటకాలువ. ఎండాకాలం కావటంవల్ల నీరు వదలక ఎండి పోయి వుంది. రోడ్ నించి ఎండిన కాలువ మీదుగా

మామిడి తోపులోనికి హతుడ్ని తీసుకువచ్చి తోపులో హత్య చేసి వుంటాడు హంతకుడు! లేదా హత్యచేశాక ఏ వాహనం డిక్కీలోనో వేసుకుని వచ్చి తోపులో విడిచిపెట్టి వుంటాడు.

శ్రీనివాస్ కళ్ళు మెరిశాయి! హతుడికి నాలుగడుగుల దూరంలో ఓ బంగారు గాజు పడి మెరుస్తోంది. శ్రీనివాస్ గాజును తీసి జేబులో వేసుకున్నాడు. ఇక్కడ బంగారు గాజు ఎందుకు పడి వున్నది? హత్యలో ఆడమనిషి యెవరికైనా భాగం వుందా?

శ్రీనివాస్ హతుడి షర్టు, పాంటు జేబులు వెతికాడు. షర్టు జేబులో ఓ పది రూపాయల నోటు, కొంత చిల్లర వున్నాయి. ప్యాంటు జేబులు ఖాళీగా వున్నాయి. హతుడి గురించి సమాచారం చెప్పే ఎలాంటి ఆధారమూ అతని దుస్తుల్లో గాని పరిసరాల్లో గాని దొరకలేదు.

"బాడ్ లక్!" అనుకున్నాడు శ్రీనివాస్. హత్యచేసిన మనిషికి హతుడిమీద ఎందుకో చాలా కసి వుండి వుండాలి! హత్య చేయటంతో సంతృప్తిపడక ముక్కు, మొహం పూర్తిగా చెక్కేశారు. బహుశా యీ హత్య ఒకరుకన్న ఎక్కువ మంది చేసి వుండొచ్చునని అనుమానించాడు శ్రీనివాస్.

పరిసరాల్లో యిసుక హెచ్చుగా వున్నది. మామిడి చెట్టు కింద హతుడి సమీపంలో యిసుకలో పడ్డ పాదాల గుర్తులు జాగ్రత్తగా ట్రేస్ చేస్తున్నాడు నిపుణుడు. ఫొటోగ్రాఫర్ ఫోటోలు తీయటం పూర్తిచేసి శ్రీనివాస్ వంక చూసి తలూపాడు.

"ఏమయినా ఉపయోగకరమైన సమాచారం లభించిందా?" అనడిగాడు శ్రీనివాస్.

"రెండు మూడు రకాల పాదాల ముద్రలు తప్ప ఆసక్తి కరమైన అంశాలేం లేవు" అన్నాడు ఫోటోగ్రాఫరు

వేలిముద్రల నిపుణుడు అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

సార్జంట్ శివం వంక చూసి, "మార్చ్యురీకి తరలించే ప్రయత్నాలు చెయ్యి" అన్నాడు శ్రీనివాస్.

2

"మా అన్నయ్య రెండు రోజులుగా కనిపించటం లేదు సార్!" అన్నాడతను శ్రీనివాస్ కెదురుగా నిల్చుని.

"అలా కూచోండి. మీ రెవరు? మీ అన్నయ్య పేరేమిటి?" అతగాడు శ్రీనివాస్.

"నా పేరు ప్రసాద్. అన్నయ్య పేరు శంకర్. హోల్ సేల్ క్లాత్ మర్చంటు. నేను బికాం చదువుతున్నాను. మొన్న అంటే 25 వ తేదీ శుక్రవారం ఉదయం అన్నయ్య యింట్లో భోంచేసి షాపుకి వెళ్ళాడు. ఆ తర్వాత మళ్ళీ ఆయన్ను చూడలేదు. సాధారణంగా రాత్రి పదిగంటలకి యింటికి చేరతాడు. 25 వ తేదీ అర్ధరాత్రి వరకు చూసి, నేను అన్నయ్య కోసం షాప్‌కి వెళ్ళాను. అన్ని షాపులూ మూసేసి అప్పటికి గంటన్నర పైగా అయింది. ఆ మర్నాడు తెలిసింది—అసలు 25 వ తేదీన అన్నయ్య అసలు షాపే తెరవలేదని! నిన్నకూడా చూసి, రాకపోవటంతో అనుమానం వచ్చి మీకు రిపోర్టు చేస్తున్నానీ రోజు" అన్నాడు అతను.

"మీ అన్నయ్య తరచు చెప్పకుండా బయటి వూర్లు వెళుతుంటారా?" అడిగాడు శ్రీనివాస్.

"సాధారణంగా బయటికి వెళడండి. పదిహేను యిరవై రోజుల కొకసారి బోంబే వెళ్ళి సరుకు ఖరీదు చేసి వస్తుం

టాడు. రెండు రోజులుంటాడు. చెప్పే వెళ్తాడు."

"ఐ.సీ. మొన్న యింటి నుంచి వెళ్ళినపుడు ఆయన ఎలాంటి దుస్తులు వేసుకున్నారు? ఆయన వయసెంత? వివరాలు చెప్పండి!"

"ఆయన వయసు ముప్పైమూడు సంవత్సరాలండి. ఎర్రగా పొడవుగా—దాదాపు ఆరడుగుల పొడవు వుంటాడండి. నొక్కుల జుత్తు. వెళ్ళేటపుడు సిమెంటుకలర్ షర్టు, గోధుమరంగు ప్యాంటు వేసుకున్నాడండి."

శ్రీనివాస్ కుర్చీలో నిటారుగా కూచున్నాడు. ఉదయం చూసిన శవం దృష్టిలో మెదిలింది. మౌనంగా వివరాలు నోట్ చేసుకుని, పాడ్‌ని ప్రసాద్ ముందుకు జరిపి, "దీని మీద సంతకం చెయ్యండి" అన్నాడు.

ప్రసాద్ సంతకం చేశాక, "మీ అన్నయ్య ఫోటో వెంట తెచ్చారా?" అనడిగాడు శ్రీనివాస్.

ప్రసాద్ జేబునుండి కార్డుసైజు ఫోటో ఒకటి తీసి శ్రీనివాస్ కందించాడు.

శ్రీనివాస్ ఫోటోవంక సాలోచనగా చూశాడు. హతుడి పోలికలు ఎలా తెలుస్తాయి? హతుడి ముక్కు, మొహం గుర్తు తెలీకుండా చెక్కేశారే!

ఫోటోని ఫైల్ చేసి సార్జంట్ శివాన్ని పిలిచాడు శ్రీనివాస్. "ఈయన్ని మార్చ్యురీకి తీసుకు వెళ్ళు. డాక్టర్ జయంత్‌తో నేను పంపానని చెప్పు. ఉదయం పోస్టుమార్టం చెయ్యబడ్డ శవాన్ని చూపించమని చెప్పు" అన్నాడు.

ప్రసాద్ ఉలిక్కిపడి చూసి, "ఏమిటి సార్ మీరంటున్నది? మా అన్నయ్యకు ఏదైనా ప్రమాదం జరగలేదు కదా!" అన్నాడు తొట్రుపడే కంఠంతో.

"మీరు వర్ణించిన రంగు దుస్తులు ధరించి వున్న ఓ

గుర్తుతెలీని శవం దొరికింది మాకు. కన్ఫర్మేషన్ కోసం మిమ్మల్ని చూసి రమ్మంటున్నాను" అన్నాడు శ్రీనివాస్.

ప్రసాద్ అదిరే గుండెను చిక్కబట్టుకుని సార్జంటు వెంట నడిచాడు. అతను అలా వెళ్తుండగానే ఓ పాతికేళ్ళ యువకుడు స్టేషన్‌లోకి అడుగుపెట్టి ఇనస్పెక్టర్ శ్రీనివాస్‌కి నమస్కారం చేశాడు.

శ్రీనివాస్ అతని వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

అతను శ్రీనివాస్ చూపించిన కుర్చీలో కూచుని, "నా పేరు జగన్నాథ్. మా బావగారు రంగనాథ్ రెండు రోజులుగా కనిపించటం లేదు" అన్నాడు.

శ్రీనివాస్ కుర్చీలో ముందుకు వంగి, "వివరాలు చెప్పండి!" అన్నాడు.

"మా బావ రంగనాథ్ ఐరన్ అండ్ స్టీలు ఫ్యాక్టరీ యజమాని. ఇండస్ట్రియల్ ఏరియాలో వుందాయన ఫ్యాక్టరీ. మొన్న 25వ తేదీ మధ్యాహ్నం ఫ్యాక్టరీకని చెప్పి బయల్దేరి వెళ్ళారు. ఆ రాత్రి యింటికి రాలేదు. 26 ఉదయం ఫ్యాక్టరీకి ఫోన్‌చేసి అడిగితే 25న అసలాయన ఫ్యాక్టరీకే రాలేదని ఆయన మేనేజర్ చెప్పాడు. నిన్నంతా చూసి రాకపోవటంతో యీ రోజు మీకు రిపోర్టివ్వటానికొచ్చాను" అన్నాడు జగన్నాథ్.

"మీ బావగారి పోలికలు. తక్కిన వివరాలు చెప్పండి."

"ఆయన బాగా పొడగరి. దాదాపు ఆరడుగుల ఆజానుబాహువు. ఎర్రగా వుంటాడు. ఇదిగో యీ ఫోటో చూడండి. మీకే అర్థమవుతుంది" అని ఓ పాస్‌పోర్టు సైజు ఫోటో శ్రీనివాస్‌కిచ్చి, "ఆయన పొడవు ఒడ్డూ ఇందులో తెలీవనుకోండి. ఆయన నించుని తీయించుకున్న ఫోటోలు

గోడలకున్నాయి. తెమ్మంటే తెస్తాను" అన్నాడు జగన్నాథ్.

శ్రీనివాస్ ఫోటోలోకి చూశాడు. ఎప్పుడూ చూసిన గుర్తులేదు. ఓ పెద్ద ఫ్యాక్టరీ యజమాని అని యితను చెప్తున్నాడు — ఎప్పుడూ చూడకపోవటం చిత్రంగానే వున్నది!

"ఆయన వెళ్ళిపోయినపుడు ఎలాటి దుస్తులు వేసుకున్నారు? శరీరం మీద గుర్తుపట్టడానికి వీలుగా ఏమైనా బండగుర్తులున్నాయా?" అడిగాడు శ్రీనివాస్.

జగన్నాథ్ రెండు క్షణాలేదో ఆలోచించి, "ఆయన మెడలో బంగారు గొలుసుతో పులిగోరు పతకం వుంటుందండి వీపుమీద కుడి భాగంలో పెద్ద పుట్టుమచ్చ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇకపోతే, వెళ్ళేటపుడు గోధుమరంగు పాంటు, పిమెంట్ కలర్ పాలిస్టర్ షర్టు వేసుకున్నారండి!" అన్నాడు.

శ్రీనివాస్ ఉలిక్కిపడ్డాడు. హతుడు కళ్ళల్లో మెదిలాడు. అతను ధరించిన దుస్తులూ యివే రంగు. మెడలో పులిగోరు పతకం వుంది! పుట్టుమచ్చ విషయం కన్ఫర్మ్ చేసుకోవాలి!

శ్రీనివాస్ ఫోన్ డయల్ చేశాడు. అవతల సార్జంట్ శివం లైన్లోకి వచ్చాడు.

"చూడు శివం, హతుడి వీపుమీద కుడిభాగంలో పెద్ద పుట్టు మచ్చ ఏదయినా వుందేమో చూసి చెప్పు!" అన్నాడు శ్రీనివాస్.

"ఒక్క నిమిషం లైన్లో వుండండి సార్. యిప్పుడే చెపుతాను" అన్నాడు శివం. తర్వాత లైన్లోకి వచ్చి, "ఉన్నది సార్! సరిగ్గా మీరు చెప్పిన చోటనే వుంది.

చాలా పెద్ద పుట్టుమచ్చ!" అన్నాడు శివం.

"అలాగా! నువ్వు తీసుకెళ్ళిన వ్యక్తి ప్రసాద్— అక్కడే వున్నాడా?" అడిగాడు శ్రీనివాస్.

"అదే చెప్పబోతున్నాను సార్! అతను శవాన్ని గుర్తుపట్టాడు. అతని అన్న శంకర్‌దేనట శవం? ఒకటే గోడు గోడున యేడుస్తున్నాడు. శవాన్ని యెప్పుడు హేండోవర్ చేస్తారని అడుగుతున్నాడు......." అన్నాడు సార్జంటు శివం,

శ్రీనివాస్ వెంటనే. "అప్పుడే కుదరదని చెప్పు. నేను కాసేపట్లో బయల్దేరి వస్తున్నాను...." అని ఫోన్ పెట్టేశాడు.

తరవాత డ్రాయర్ సొరుగు తెరిచి పులిగోరు పతక మున్న ఛెయిన్ బయిటికి తీశాడు. దాన్ని జగన్నాధ్‌కి చూపించి. "దీన్ని గుర్తు పట్టగలరా?...." అన్నాడు శ్రీనివాస్.

ఛెయిన్‌వంక చూస్తూనే. "ఎగ్జాక్ట్లీ! మా బావగారిది ఇదే ఛెయిన్. నాకు బాగా గుర్తు కావాలంటే పతకం వెనక యింగ్లీష్ యినిషల్స్ వుంటాయి చూడండి —ఎస్. ఆర్.—అని. ఎస్. అంటే శింగినాధం—మా బావగారి యింటి పేరు" అన్నాడు జగన్నాథ్.

శ్రీనివాస్ పతకం వెనక్కి తిప్పిచూశాడు.

అతని కళ్ళు మెరిశాయి. ఎస్.ఆర్. అన్న ఆంగ్ల అక్షరాలు చెక్కబడి వున్నాయి. సందేహంలేదు. హతుడు రంగనాథే! మరి ప్రసాద్ తన అన్న శంకర్ శవంగా ఎలా గుర్తించాడు? దుస్తుల్నిబట్టా?

శ్రీనివాస్ జగన్నాథ్‌వంక జాలిగాచూశాడు. "అయామ్ సారీ టు యిన్ఫార్మ్! మీ బావగారు హత్య చెయ్యబడ్డారు"

అన్నాడు.

పక్కలో బాంబుపడ్డట్టు ఉలిక్కిపడ్డాడు జగన్నాధ్. "వాట్ సార్, మీరు చెప్పేది నిజమా?" అన్నాడు. అతని కంఠంలో దుఃఖం చోటు చేసుకుంది.

"నాతో రండి. శవం మార్చ్యురీలో వుంది. ముఖం గుర్తు తెలీటం లేదు. మీరు గుర్తుపట్టగలరనుకుంటాను!" అన్నాడు శ్రీనివాస్ సీట్లోంచి లేచి హేట్ నెత్తిన పెట్టుకుంటూ.

జగన్నాధ్ కళ్ళు వర్షిస్తూన్నాయి. "ఇదే నిజమయితే మా అక్క గుండె పగిలి చచ్చిపోతుంది సార్! అక్క ప్రాణాలన్నీ బావమీదనే పెట్టుకు బతుకుతోంది. ఇద్దరు పిల్లలు కూడా!" అంటున్నాడతను.

శ్రీనివాస్ జాలిగా చూస్తున్నాడు. "ఓ.కే. నాతో రండి!" అంటూ ముందుకి దారితీశాడు.

ఎదురుగా ఓ పాతికేళ్ళ యువతి స్టేషన్‌లోని కొస్తూ శ్రీనివాస్ కెదురుపడింది.

"ఇనస్పెక్టర్‌గారు మీరేనాండీ?" అన్నది.

శ్రీనివాస్ ఆమెవంక అవునన్నట్టు తలూపి, "నా వల్ల ఏమయినా సహాయం కావాలా మేడమ్?" అన్నాడు.

"అవును సార్! మీతో పనిపడి వచ్చాను" అన్నదామె.

శ్రీనివాస్ జగన్నాధ్ వంక చూసి, "మీరు కాసేపు వెయిట్ చెయ్యండి పది నిమిషాల్లో మార్చ్యురీకి వెళ్దాం!" అన్నాడు.

జగన్నాధ్ తలూపి, బయటకు వెళ్ళాడు.

"అలా కూచోండమ్మా! ఇప్పుడు చెప్పండి" అన్నాడు శ్రీనివాస్ తను కూచుంటూ.

ఆమె కుర్చీలో ఒదిగి కూచుంది. చూడటానికి ఆధునిక

యువతిలా వున్నా సంప్రదాయం ఆమెలో నిండుగా తొణి కిసలాడుతోంది. నుదుట అర్ధరూపాయంత కుంకుమబొట్టు పెట్టింది. చెవులకి దుద్దులున్నాయి. తల బాగా నొక్కి దువ్వుకుని జడ వేసుకుంది. మరీ ఖరీదుకాని చీర కట్టింది. కొంగు భుజంమీద నుండి ఒంటినిండా కప్పుకుంది. ఎర్రగా పొడవుగా చక్కటి వర్చస్సుతో చూసే వాళ్ళకు గౌరవం కలిగించేదిగా వున్నది ఆమె వేషధారణ.

"నా పేరు సరోజ. మా వారు రెండు రోజులుగా కని పించటం లేదు" అన్నదామె.

శ్రీనివాస్ ఆశ్చర్యాన్ని అణచుకుంటూ చూశాడామె వంక. "మీ వారి పేరు, యింటి నుండి వెళ్ళిన సమయం, ఆ సమయంలో ధరించిన దుస్తులు వగయిరా వివరాలు చెప్పండి" అన్నాడు.

"ఆయన పేరు సుధాకర్. ఆర్డీవో ఆఫీసులో స్టెనోగా పనిచేస్తున్నారు. దాదాపు ఆరడుగుల పొడవు. ఎర్రగా వుంటారు 25 వ తేదీ ఉదయం ఆఫీసుకి వెళ్ళారు. రాత్రికి రాలేదు. నేను వాకబు చేస్తే ఆఫీసు నుండి సాయంత్రం బయటికి వెళ్ళటం చూసిన వాళ్ళేగాని ఆ తర్వాత ఎక్కడికి వెళ్ళినదీ చెప్పలేకపోయారు. 26 వ తేదీ కూడా చూసి, యీ రోజు యీ విషయం మీకు చెప్పాలని వచ్చాను నా కెందుకో భయంగా వుంది. ఎప్పుడూ నాతో చెప్పకుండా పక్కవూరు కూడా వెళ్ళరు" ఆమె కళ్ళు వర్షించబోయే మేఘాల్లా వున్నాయి.

"మీవారి ఫోటో వున్నదా" అడిగాడు శ్రీనివాస్.

సరోజ ఫోటో యిచ్చింది. దాని వంక చూసి టేబిల్ మీద పెట్టాడు శ్రీనివాస్.

"ఏ రంగు దుస్తులు ధరించారో చెప్పలేదు" అన్నాడు.

"క్రీమ్ కలర్ షర్టు, నీలం రంగు చెక్స్‌వున్న పాంటు వేసుకున్నారు. కాళ్ళకు బాటా షూస్ వుంటాయి. ఎప్పుడూ షూస్ వేసుకుంటారు" అన్నది.

"ఇంకా బాగా గుర్తుండే బండగుర్తులేమైనా వున్నాయా?" శ్రీనివాస్ అడిగాడు.

"నుదుటిమీద కుడివైపు ఉలిపిరికాయ వుంటుందండి. బుగ్గమీద కంది బద్దంత పుట్టుమచ్చ!" అన్నది సరోజ.

శ్రీనివాస్ వివరాలు రాసిన కాగితం ఆమె ముందు పెట్టి, "దీనిమీద సంతకం చెయ్యండి" అన్నాడు

శ్రీనివాస్ ఆమె వంక ఓదార్పుగా చూసి, "మేము ఎంక్వయిరీ చేస్తాం. మీరు వెళ్ళండి. మీ అడ్రసు రాసుకున్నానుగా! ఏమయినా ఆచూకీ తెలిస్తే కబురు చేస్తాం!" అన్నాడు.

"నా యిద్దరు పిల్లలు, నేను దిక్కులేని పక్షులమైపోతాం బాబుగారూ! మీరే రక్షించాలి!" అన్నది సరోజ రెండు చేతులు ఎత్తి దండంపెడుతూ.

శ్రీనివాస్ కరిగిపోయాడు. "అలాగే నమ్మా! మీ భర్త గారికేం ప్రమాదం లేదు. అనుకోకుండా ఏదయినా ప్రయాణం తగిలి వుంటుంది. చెప్పటానికి టైం వుండి వుండదు!" అన్నాడు

"ఆయన స్టెనో కదాండి. ఆఫీసర్‌గారితో కాంప్స్ కూడా వెళ్తుంటారు. కాని యీ రెండురోజులుగా కేంప్స్ కూడా ఏవీ లేవని ఆయన ఆఫీసు కోలీగ్ చెప్పారు" అన్నది సరోజ. అంతలోనే ఏదో గుర్తు తెచ్చుకుని, "మరో విషయం చెప్పటం మరిచాను. ఆయన 25 సాయంత్రం కంసాలి దగ్గ బంగారు గాజులు తీసుకొస్తానని కూడా చెప్పారు. కంసాలిని ఎంక్వయిరీ చేస్తే బంగారు గాజులు

తీసుకుని వెళ్ళిపోయారని చెప్పాడు. అంటే ఆఫీసు విడిచాక కంసాలిని కలిసి గాజులు తీసుకున్నారు. ఆ తర్వాత ఎక్కడికి వెళ్ళారో అర్థం కావు" అన్నది.

శ్రీనివాస్ మెదడులో మెరుపులు మెరిశాయి స్పాట్‌లో దొరికిన బంగారు గాజు విషయం గుర్తొచ్చింది సొరుగు తెరిచి గాజు బయటికి తీశాడు.

"చూడండమ్మా, యిలాంటి గాజులు కాదుగదా!" అన్నాడు శ్రీనివాస్.

సరోజ కళ్ళు మెరిశాయి. గాజును చేతిలోకి తీసుకుని పరిశీలనగా చూసి, "అవును బాబుగారూ! ఇదే డిజైను. యింతే బరువుండే గాజులకే ఆర్డరిచ్చాము. ఆ రోజు మా వారితో కంసాలి వద్దకు నేనూ వెళ్ళాను. ఈ డిజైను సెలక్టు చేసింది కూడా నేనే!" అన్నదామె.

శ్రీనివాస్ మస్తిష్కంలో యుద్ధం జరుగుతోంది.

కొంపతీసి హతుడు సుధాకర్ కాదుకదా? గాడ్! కాకూడదు. అదే జరిగితే యీ అమాయకురాలు గుండె పగిలి చచ్చిపోతుంది! పిల్లలు దిక్కులేని వాళ్ళయిపోతారు! శ్రీనివాస్ కరకుగుండె ద్రవించసాగింది. ఆమెని మార్చ్యురీకి తీసుకుపోవాలా వద్దా? అతను సుధాకర్ కాకపోతే? ముందుగానే యీమె గుండె కోతకు గురవుతుందేమో! తర్జనభర్జనల్లో పడిపోయాడు శ్రీనివాస్.

ఆమె చెప్పిన రెండు గుర్తులూ తెల్సుకునే అవకాశం లేదు. నుదుటిమీది ఉలిపిరికాయ, బుగ్గమీది కంది గింజంత పుట్టుమచ్చ కనపడకుండా చెక్కేశారు! దుస్తులు సరోజ వర్ణించిన రంగువి కాదు! పులిగోరు పతకం విషయం ఆమె చెప్పలేదు. శవం సుధాకర్‌ది అయ్యే అవకాశంలేదు. గాజు దొరకటాన్ని బట్టి శవాన్ని నిర్ధారణ చెయ్యటం

సాధ్యమయ్యే పనేనా?

శ్రీనివాస్ చాలా సేపు మాట్లాడక పోవటంతో సరోజ నిశ్శబ్దాన్ని భంగం చేసింది "నేనిక సెలవు తీసుకోవచ్చు నాండీ?" అన్నది.

శ్రీనివాస్ యీ లోకంలోకి వచ్చాడు

"అలాగే! మీరు వెళ్ళండమ్మా! అవసరమైతే మీకు కబురు చేస్తాను" అన్నాడు.

సరోజ నమస్కారం చేసి వెళ్ళిపోయింది.

శ్రీనివాస్ బయట తనకోసం ఎదురు చూస్తున్న జగన్నాథ్‌ని సమీపించి, "ఫాలో మీ!" అన్నాడు.

జీప్ మార్చ్యురీ వంక దూసుకుపోయింది.

3

మార్చ్యురీ వద్ద ప్రసాద్ ఎదురు చూస్తున్నాడు. శ్రీనివాస్‌ని చూసి ఏదో చెప్పబోగా శ్రీనివాస్ వారించాడు. సార్జెంట్ శివం వంక చూసి సైగచేశాడు. జగన్నాథ్‌ని వెంటబెట్టుకుని మార్చ్యురీ లోపలికి నడిచాడు శ్రీనివాస్.

శవాన్ని చూస్తూనే, "సార్! ఎంత ఘోరం జరిగి పోయింది? ఈయన మా బావే! అవే దుస్తులు! అదే పోలికలు!" అన్నాడు.

"ముఖం చెక్కేస్తే పోలికలు ఎలా దొరికాయి?" అన్నాడు శ్రీనివాస్ అతనివంక పరీక్షగా చూస్తూ.

"మా బావ నాకు గుర్తు తెలీదా సార్? కావాలంటే వీపు మీద పుట్టుమచ్చ వుంటుంది చూడండి!" అన్నాడు జగన్నాథ్.

శ్రీనివాస్ హతుడి షర్టు తొలగించి చూశాడు. ఈ లోపల సార్జెంట్ శివం ఏదో ద్రవం తెచ్చి శ్రీనివాస్‌కి అందించాడు. శ్రీనివాస్ ఆ ద్రవంతో పుట్టుమచ్చమీద

రుద్దాడు. తేలిగ్గా చెరిగిపోయింది.

జగన్నాథ్ బిక్కచచ్చిపోయాడు. శ్రీనివాస్ చూపులకి దొరక్కుండా చూపు తిప్పుకున్నాడు.

శ్రీనివాస్ హతుడి షర్టుపంక దీక్షగా చూశాడు గాయం తగిలినచోట షర్టుకి రంధ్రం పడి వుండాలి. కాని, షర్టు మీద ఎక్కడా రంధ్రం లేదు!

శ్రీనివాస్‌కి ముడి వీడిపోయింది. హత్య చేయబడ్డ దుస్తులు యివికావు! హత్య చేశాక హతుడి షర్టు, పేంటు మార్చేశాడు హంతకుడు! ఎందుకలా చేశాడు?

శ్రీనివాస్ మెదడులో మెరుపులు మెరిశాయి!

"శివం! జగన్నాథ్‌ని, ప్రసాద్‌ని అరెస్టు చెయ్యి!" అంటూనే చకచక బయటకి కదిలాడు శ్రీనివాస్.

సార్జంట్ రాజు, యిద్దరు కానిస్టేబుల్స్ శ్రీనివాస్‌ని అనుసరించారు.

పోలీస్ జీపు ఊరి చివర మామిడి తోపవైపు దూసుకు పోయింది.

శ్రీనివాస్ హతుడ్ని వుంచిన చెట్టుకు దగ్గర్లో తవ్వించాడు. అతని ఊహ నిజమయింది! రక్తసిక్తమైన షర్టు, ప్యాంటు బయటపడ్డాయి.

క్రీం కలరు షర్టు, నీలం రంగు చెక్స్ వున్న ప్యాంటు! సరోజ చెప్పిన దుస్తులు!

మరో గంటలో శంకర్, రంగనాథ్ కూడా అరెస్టు చేయబడ్డారు.

*

శంకర్, సుధాకర్‌ని తనే హత్య చేసినట్టు ఒప్పుకుంటూ వాఙ్మూలం యిచ్చాడు.

"నాకు సుధాకర్ శత్రువు కాదు. కాని, అతను నా

అంత ఒడ్డు పొడవు వుంటాడు. నాలా ఎర్రగా వుంటాడు. వృత్తిరీత్యా అతను పనిచేసే ఆర్డీవో ఆఫీసుకి తరచు వెళ్తుండే వాడిని.

నేను వ్యాపారంలో బాగా దెబ్బ తిన్నాను. అతన్ని చూశాక ఓ వెర్రి ఆలోచన వచ్చింది. వెంటనే అయిదు లక్షలకు జీవిత భీమా పాలసీ తీసుకున్నాను. నేను హత్య చేయబడ్డట్టు నాటకమాడి నా బదులు సుధాకర్‌ని నా శవంగా పోలీసుల దృష్టిలోను, ప్రభుత్వం దృష్టిలోను పడెయ్యాలనుకున్నాను.

25వ తేదీన అతన్ని చంపటానికి ప్లాన్ చేసుకున్నాను. ఆఫీసయాక్క అతన్ని ఫాలో అయ్యాను. అతను కంసాలి వద్ద గాజులు తీసుకుని యింటికి తిరుగుముఖం పట్టాడు. అతను కెదురుపడి పలకరించాను. నేను తెలిసిన వాడినే కావటంతో నేను సినిమాకి రమ్మనగానే వచ్చాడు.

తరవాత హోటల్‌కి వెళ్ళాము. అతను చూడకుండా తినే ఆహారంలో మత్తుమందు కలిపాను. స్పృహ తప్పిపోయేలోగా టాక్సీలో వేసుకుని ఊరి చివరి మామిడితోపుకు తీసుకుపోయి టాక్సీని పంపేశాను.

తోపులోకి తీసుకుపోయి రివాల్వర్‌తో కాల్చి చంపాను. అతని దుస్తులు తీసేశాను. నా వెంట తెచ్చుకున్న నా దుస్తులు తొడిగాను. గుర్తు తెలీకుండా చాకుతో అతని నుదుటిమీది ఉలిపిరికాయ, బుగ్గమీది పుట్టుమచ్చతో పాటు మొహమంతా చెక్కేశాను.

మా తమ్ముడు ప్రసాద్‌తో పోలీసులకి ఎలా ఫిర్యాదు చేయాలో, ఎలా నాటకమాడాలో ఒకరోజంతా ప్రాక్టీసు చేయించాను. 27 తేదీన రిపోర్టివ్వమని పంపాను. కాని, నా ప్లానంతా తల్లక్రిందులై పోయింది."

తర్వాత రంగనాధ్ స్టేట్‌మెంటు యిలా వుంది:

"నా ఫ్యాక్టరీ లాభాల్లోనే నడుస్తోంది అయితే బోనస్‌ల పేరిట వర్కర్సుకి పెద్ద మొత్తాల్లో చెల్లించాల్సి వుంటుంది. అందుకే నష్టం వస్తున్నట్టు లెక్కలు చూపించాను. దొరికిన చోటల్లా అప్పులు చేశాను. నా ఫ్యాక్టరీకున్న గుడ్‌విల్ మూలాన అప్పులు దండిగా దొరికాయి. అప్పులు, లాభాలు జాగ్రత్తగా బంగారం కింద మార్చేశాను ఫ్యాక్టరీ స్థిరాస్తుల్ని అమ్మేసి డబ్బు చేసుకున్నాను. దాదాపు ఫ్యాక్టరీతో సంబంధాలు తెంచేసుకున్నాను.

నేను బతికుంటే అప్పులన్నీ తీర్చాలి! బోనస్‌లు చెల్లించాలి! అన్నీ చేస్తే నాకు మిగిలేది ఏమీ వుండదు. అందుకే హత్య చేయబడినట్టు నాటకమాడి లోకం దృష్టిలో చచ్చి, ఫారిన్ కంట్రీస్‌లో బతకాలనుకున్నాను.

నాకు డూప్‌గా ఆర్డీవో ఆఫీసులో పనచేసే సుధాకర్ని ఎన్నుకున్నాను. 25వ తేదీ ముహూర్తం పెట్టుకుని సుధాకర్ ఆఫీసు వద్దనే కాచుకున్నాను. ఆఫీసయ్యాక సుధాకర్‌ని కలవబోతే నాకన్నా ముందే మరో వ్యక్తి అతన్ని నీడలా వెన్నంటి వుండటం గమనించాను.

వాళ్ళిద్దర్నీ ఫాలో అయ్యాను. వాళ్ళతో సినిమా థియేటర్‌కి, హోటల్‌కి, చివరికి ఊరి చివరి మామిడితోపుకి అనుసరించాను. నేను చెయ్యాల్సిన హత్య ఆ వ్యక్తి చెయ్యటం కళ్ళారా చూశాను. ఏదో వ్యక్తిగత ద్వేషాల వల్ల చేసి వుంటాడనుకున్నాను. హంతకుడికి కనపడకుండా దాక్కున్నాను. హంతకుడు వెళ్ళిపోయే వరకు కాచుకుని వున్నాను.

హంతకుడు వెళ్ళిపోగానే శవాన్ని సమీపించాను. అప్పటికే అతని మొహం చెక్కివేయబడి వుంది. హంతకుడికి

సుధాకర్ మీద చాలా కసి, ద్వేషం వుండి వుండాలనీ అందుకే క్రూరంగా చచ్చిన శవాన్ని మొహం చెక్కేశాడనీ అనుకున్నాను గాని, గుర్తు తెలీకుండా చేశాడన్న ఊహ రాలేదు. నేనయినా తర్వాత మొహం చెక్కి వుండేవాడినే! అయితే హంతకుడు నా పని సులభం చేశాడని సంతోషించాను.

తర్వాత నా పులిగోరు పతకాన్ని హతుడి మెడలో వేశాను. నాకు వీపుమీద వున్న పుట్టుమచ్చను హతుడి వీపు మీద కృత్రిమంగా సృష్టించాను. ఈ రెండు ఆధారాలతోను హతుడు నేనే అని అందరు భ్రమతడతారని ఊహించాను. హతుడి దుస్తుల రంగును కూడా గుర్తు పెట్టుకున్నాను.

తర్వాత యింటికొచ్చి నా బావమరిది జగన్నాథ్‌ని నా నాటకంలో ప్రధాన పాత్రగా ఉపయోగించుకున్నాను. అతనూ శాయశక్తులా నటించాడు గాని, నా పథకం ఘోరంగా విఫలమయింది."

ఇద్దరి స్టేట్‌మెంట్స్ వినేసరికి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు తల దిమెక్కిపోయింది. □

అల్పాహారం!

పొదుపరి భర్తలు గడుసరి భార్యలు

జొన్నలగడ్డ రామలక్ష్మి

రామం, రవి ఇద్దరూ ఒకే గదిలో అద్దెకుంటున్నారు. అది చాలా చిన్నగది అయితేనేం అద్దె కూడా చాలా తక్కువ. ఇద్దరూ ఒకే కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఒకే జీతం. ఇద్దరికీ యించుమించు ఒకేమారు పెళ్ళిళ్ళు అయ్యాయి. ఇద్దరి భార్యలదీ ఒకే ఊరు. వారిద్దరూ స్నేహితురాండ్రు.

రామం, రవి—ఇద్దరికీ యింకా పాతికేళ్ళు నిండలేదు.

కాపురం పెట్టాలంటే యిద్దరికీ భయంగానే వున్నది. కారణం....ఖర్చులు....

సుమారు ఎనిమిది వందల రూపాయల జీతం వస్తుంది. అందులో ఇంటి అద్దె వందరూపాయలు. చెరో యాభయ్యీ యిచ్చుకుంటారు. ఇద్దరూ ఖర్చుల విషయంలో యెంతో పొదుపుగా వుంటారు. వాళ్ళ అయిడియా ఏమంటే ఒకటి రెండు సంవత్సరాలపాటు డబ్బు బాగా పోగుచేసి అప్పుడు భార్యలను కాపురానికి తీసుకురావాలని!

వీళ్ళ కీ అభిప్రాయం కలగడానికి స్నేహితులు కారణం. ఆడవాళ్ళు దుబారా మనుషులనీ—భర్త యిబ్బందుల నర్థం చేసుకోరనీ— ఒకసారి కాపురం పెట్టాక—వాళ్ళు ఏమంటే అది చేసితీరాలనీ స్నేహితులంతా వీళ్ళని భయపెట్టారు. అందులో కొంత నిజమూ వున్నదని వీళ్ళకు అనిపించేది. పెళ్ళయి కాపురాలు పెట్టిన స్నేహితులంతా అప్పులపాలై వున్నారు.

రామం, రవి—ఇళ్ళ కీ విషయం రాయలేదు. ఇంటి కోసం వెతుకుతున్నామనీ దొరకగానే కాపురం పెడతామనీ వాళ్ళు రాశారు.

ఇద్దరిలోకీ రామం నిదానస్తుడు. రవి దుడుకు మనిషి. అతడికి ఇట్టే కోపం వచ్చేస్తుంది. అది పాలపొంగులా తగ్గి పోతుంది కూడా. రవికి తన బలహీనత గురించి తెలుసు. అందుకని అతడు సాధారణంగా రామం సలహా తీసుకుంటే గానీ ఏ విషయంలోనూ ముందుకు వెళ్ళడు.

ఇద్దరూ సెలవులు కలిసివచ్చినపుడు కలిసి యింటికి వెళ్ళి వస్తూంటారు. వీళ్ళని ఆదర్శస్నేహితులుగా చాలా మంది చెప్పుకుంటారు.

రామం భార్య కమల. రవి భార్య విమల. వాళ్ళనుంచి

వారానికి రెండుసార్లు ఉత్తరాలు వస్తాయి. ఆ ఉత్తరాలు వచ్చిన రోజు వాళ్ళకు పండుగ రోజు. ఉత్తరం వచ్చిన వెంటనే బదులు రాస్తూంటారు.

ఆ రోజున ఇద్దరికీ ఉత్తరాలు వచ్చాయి. రామం తనకు వచ్చిన ఉత్తరాన్ని చదువుకుని అదోలాగున ఉండి పోయాడు. రోజూ కనిపించే మెరుపు ఆ రోజు అతడి కళ్ళలో కనబడలేదు. అయితే ఆ విషయం రవి గమనించ లేదు. అతడు తన ఉత్తరం చదువుకునే హడావుడిలో వున్నాడు ఉత్తరం చదవడం పూర్తికాగానే అతడి ముఖం అయోమయంగా అయిపోయింది.

"ఇది నా ఉత్తరం కాదు బ్రదర్?" అన్నాడు రవి. అతడా ఉత్తరాన్ని రామానికి అందించాడు.

"డియర్ మూర్తీ!

మా వారిప్పట్లో నన్ను కాపురానికి తీసుకెళ్ళరు. ఇక్కడికి రావడం కూడా వచ్చే దసరాలకే! నువ్వు కొన్నాళ్ళ పాటు నెల నెలా యిక్కడికి క్యాంపులు వేసుకోరాదూ! నీ కౌగిలి కోసం ఎదురు చూస్తు న్నాను. పెళ్ళికి ముందు నీతో అనుభవాలు మధు రానుభూతులుగా నెమరువేసుకుంటున్నాను. కానీ ఎంత కాలమని యిలా నెమరు వేసుకోను....కొత్త అనుభూతులు కలిగించడానికి ఒక్కసారి రావూ?

నీ

విమల"

రామం ఉత్తరం పూర్తిచేసి—"ఈ ఉత్తరం నీకు కాదు— కానీ....ఇది నీ భార్య వ్రాసిందే ...క్రింద సంతకం చూడు...." అన్నాడు

అప్పటికి రవి బుర్ర పనిచేయసాగింది. ఉత్తరంలోని

సారాంశం అతడికి వంటబట్టేసరికి ముఖం ఎర్రబడింది.

"అంటే?" అన్నాడతాడు పిడికిలి బిగించి.

"ఆవేశపడకు" అన్నాడు రామం.

"నీకూ ఇలాంటి ఉత్తరం వచ్చివుంటే నా బాధ తెలిసేది...." అన్నాడు రవి.

రామం నవ్వి ఊరుకున్నాడు.

"దాన్ని చంపేస్తాను" అన్నాడు రవి.

"అందువల్ల నీకు లాభమేమిటి?"

విమలను తను చంపడంలోని లాభనష్టాల గురించి ఆలోచించడానికి రవికి కాసేపు పట్టింది.

"అవును—అందువల్ల నాకు లాభమేమిటి? దానికి విడాకులిచ్చేస్తాను. ఇంకో పెళ్ళి చేసుకుంటాను...." అన్నాడు రవి.

"ఆ సంగతి తర్వాత చూడొచ్చు. నువ్వు కంగారు పడకు. ఈ రోజే ఇంటికి బయల్దేరి వెళ్ళు. నీ భార్యను ఏకాంతంలోకి పిలు. ఈ ఉత్తరాన్ని చూపించి సంజాయిషీ అడుగు అప్పుడు....బహుశా నువ్వు అనుకోనిది జరుగవచ్చు" అన్నాడు రామం సాలోచనగా.

"కానీ .... నేను నా ఆవేశాన్ని అణచుకోలేమోనని పిస్తోంది. నువ్వు కూడా నాతో రారాదూ" అన్నాడు రవి.

"నో....నేను రాను. నువ్వొక్కడివే వెళ్ళివచ్చి జరిగింది నాకు చెప్పాలి" అన్నాడు రామం.

"నే నొక్కడినే వెడితే దాన్ని చంపేస్తానని నా అనుమానం...."

"అయితే నీకూ స్వర్ణకూ జరిగిన వ్యవహారం విమలకు తెలిస్తే—విమల నిన్నేం చేయాలి?" అన్నాడు రామం.

"అదా?....అది వేరు...." అన్నాడు రవి నీళ్ళు

నమ్ముతూ.

"అది వేరెందుకవుతుంది? వయసులో ఒంటరి తనం యువతీ యువకుల మనసుల్ని పెడద్రోవ తొక్కిస్తుంది."

"కానీ పెళ్ళయ్యాక కూడా—ఇలా బరితెగించి...."

"చూడు రవీ! నీకు స్వర్ణతో కలిగిన సంబంధాన్ని పెళ్ళి అంటారా? అదొక తాత్కాలికమైన అనుభవం. మన భార్యలకు సంబంధించినంతవరకూ మన విషయమూ అంతే! వారికీ మనకూ సరియైన అనుబంధమేదీ! కొన్నాళ్ళు కలిసి కాపురం చేస్తే తప్ప అసలైన అనుబంధం ఏర్పడదు. అప్పుడొకరి నొకరు గాఢంగా ప్రేమించడమూ, ఒకరి కోసం ఒకరు బ్రతకాలనుకోవడమూ జరుగుతుంది. నా మటుకు నాకు తప్పు మనదే ననిపిస్తున్నది. త్వరగా కాపురం పెట్టే ఏర్పాట్లు చేయాలనిపిస్తున్నది" అన్నాడు రామం.

"ఇంకా దానితో కాపురమా?" అన్నాడు రవి.

"చూడు....గురివింద గింజలా మాట్లాడకు" అన్నాడు రామం.

2

రవి తలుపు తట్టగానే విమలే వచ్చి తలుపు తీసింది.

"మీరా?" అన్నదామె. ఆశ్చర్యంతో ఆమె కనురెప్పలు అల్లల్లాడాయి. క్షణమాత్రం ముగ్ధుడై చూశాడు రవి.

"ఇంట్లో ఎవ్వరూ లేరా?" అన్నాడు రవి.

"లేరు—ఉత్తరం లేకుండా ఇలా వచ్చేశారేమిటి?"

"ఏం రాకూడదా? నీ కార్యక్రమాలకు అంతరాయం కలుగుతుందా?" కటువుగా అన్నాడు రవి.

"మీరు వస్తే నా కార్యక్రమాలకు అంతరాయం కలగడ

మేమిటండీ — కార్యక్రమాలు ప్రారంభమయ్యేదే మీ రాకతో....” అంది విమల మనోహరంగా నవ్వుతూ.

ఆ నవ్వుకు రవి కరిగిపోతున్నాడు. తను కరిగిపోకుండా వుండడం కోసం అతడు ఉత్తరం గుర్తు చేసుకుంటున్నాడు. మళ్ళీ అతనిలో ఆవేశం పుడుతున్నది.

ఆ యింట్లో రవి-విమల....ఇద్దరే!

విమల తనకు భార్య....ఏకాంతంలో దొరికింది....కొద్ది నెలల విరహం ...కానీ ఆమె కులట....

కులట అయితేం....తనకు భార్య కాబట్టి తన కోరికకు అభ్యంతరం చెప్పదు. తన కోరిక తీరాక అప్పు డామెను నిలదీయాలి. నిందించాలి. కాల దన్నిపోవాలి.

అదీకాక రామం తనను ఆవేశపడవద్దన్నాడు.

రవి విమల భుజంమీద చేయివేశాడు. ఆమె అతడిని వాటేసుకున్నది అది స్త్రీ పురుషుల కౌగిలి. ఆ అనుభూతి అనుభవంలో మాత్రమే తెలుసుకొనగలిగినది.

“ఏమండీ!” అంది విమల.

“ఊఁ” అన్నాడు రవి.

“మన మెప్పుడూ యిలాగే....” సగంలో ఆపేసింది విమల.

రవికి మళ్ళీ భార్య కులట అన్న విషయం గుర్తుకు వచ్చింది. ఇప్పుడు ఈ పళంగా ఈమెను పీకె పిసికి చంపేస్తే....

....అమ్మో....జైలు....ఉరిశిక్ష....

తన కౌగిలిలో వున్నది ఓ కులట. ఆమెనెలా భరించడం?

రవికి రామం సందేశం గుర్తు వస్తున్నది. కులట అయిన స్త్రీ వద్దకు కులట అని తెలిసి వెళ్ళి దబ్బిచ్చి అనుభ

వించి వస్తున్నా రెందరో పురుషులు.

విమల తన భార్య కాదు. వేశ్య! ఆమెనొక వేశ్యగా భావించి అనుభవించాలి!

రవికి శరీరావసరం.... ఈ తర్కాన్ని ఉపయోగించు కున్నది.

అతడి వంటిలోని వేడి తగ్గడానికి కాసేపు పట్టింది. ఆపైన విమల అతడికి విందుభోజనం కొసరి కొసరి తిని పించింది.

"మీ కిష్టమని పులిహోర చేశాను. మీ కిష్టమనే సేమ్యా హల్వా చేశాను...." అంటూ ఆమె అతడికి ఒకొక్కటే వడ్డిస్తూంటే రవికి చిన్న అనుమానం వచ్చింది.

"ఇది నేను వచ్చేక చేసిన వంటకాదు. నేను వస్తానని ముందే ఊహించావా?" అన్నా రవి.

"ఊఁ" అంది విమల.

"ఎలా ఊహించావు?"

"మీరు వస్తారని తెలిసే మా వాళ్ళంతా మనకు ఏకాంతాన్ని వదిలి వెళ్ళిపోయారు. నేను మీ కిష్టమైన వంటలన్నీ చేశాను" అంది విమల.

"అదే—ఎలా తెలుసు?—అని అడుగుతున్నాను" అన్నాడు రవి. అతడి కంఠంలోని కాఠిన్యం హెచ్చింది.

"నా ఉత్తరం అలాంటిది కదా—అది అందుకున్న వెంటనే మీ ఊళ్ళో ఏ ట్రైన్‌కు మీరు బయల్దేరుతారో— ఈ ఊరు ఎప్పటికి చేరుకుంటారో.... అన్నీ సరిగ్గా నేను లెక్క కట్టినట్లు జరిగాయి" అంది విమల.

"ఏ ఉత్తరం?" అన్నాడు రవి.

"అదే—నేను మూర్తి పేరున రాసిన ఉత్తరం" అంది విమల.

రవి క్షణకాలం దిగ్భ్రాంతుడయ్యాడు. ఏ ఉత్తరం చూపించి ఆమెను నిలదీయాలనుకున్నాడో ఆ ఉత్తరం ప్రసక్తి తనే ముందు తీసుకుని వచ్చింది. అంటే ఇదంతా తన్ను యిక్కడికి రప్పించడాని కాడిన నాటకమా!

"ఆ ఉత్తరం నా కెందుకు పోస్టు చేశావు?" అన్నాడు రవి.

"మిమ్మల్నిక్కడకు రప్పించాలని ...నన్ను మీరు త్వరగా మీ వద్దకు తీసుకునిపోయే ఏర్పాట్లు చేస్తారని ..." అంది విమల నవ్వుతూ.

రవి కీ మాటలు నమ్మశక్యంగా అనిపించలేదు. మళ్ళీ అతడి మెదడు చురుగ్గా పని చేయసాగింది.

విమలకు మూర్తితో వ్యవహారమున్న మాట నిజం. పొరపాటున మూర్తికని వ్రాసిన ఉత్తరం నాకు పోస్టు చేసింది. అయితే జరిగిన పొరపాటు మూర్తి ద్వారనో మరో విధంగానో ఆమెకు తెలిసి వుంటుంది. అప్పుడు వెంటనే యింటిలో చెప్పుకుని వుంటుంది. అంతా కలిసి తన్ను వెఱ్ఱివెధవని చేసి ఆడించడాని కో ఉపాయం పన్నారు. అసలు వీళ్ళ కీ ఉపాయం ఆ మూర్తిగాడే చెప్పి వుంటాడు.

"నీ కట్టుకథలు నేను నమ్మను. ఎవడో మూర్తితో నీకు సంబంధ ముంది. వాడికి నువ్వుత్తరం వ్రాశావు. పొర పాటున కవర్లు మారాయి. అది గ్రహించి ఈ కొత్త నాటకం ఆరంభించావు" అన్నాడు రవి.

విమల కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి—"మీరిలాగంటూంటే నా కెంతో బాధగా వుంది. నేను మిమ్మల్ని నమ్మినట్లే మీరు నన్ను నమ్మాలి" అంది.

"నేను నమ్మను. అందు కీ ఉత్తరమే సాక్షి!" అంటూ

జేబులోంచి ఉత్తరం తీశాడు రవి.

విమల తన జాకట్లోంచీ ఓఉత్తరంతీసి "నేనునిర్దోషిని. అందుకీ ఉత్తరమే సాక్షి" అంటూ అతడికి అందించింది.

రవి ఆశ్చర్యంగా ఆ కొత్త ఉత్తరాన్ని అందుకున్నాడు. ఉత్తరంచూసేక ఆశ్చర్యంతో అతడి కళ్ళు పెద్దవయ్యాయి.

అది తనకు వచ్చిన ఉత్తరానికి నకలు. నకలు అంటే వేరే మళ్ళీ వ్రాసినది కాదు. కార్బన్ కాపీ!

"మీరిలా అనుమానించక పోతే ఎంతో సంతోషించే దాన్ని. అయినా ఆడదిగా నా జాగ్రత్తలో నేనుండడం కోసం ఉత్తరం వ్రాసేటప్పుడే కార్బన్ కాపీ తీశాను. కార్బన్ కాపీమీద నా స్నేహితురాలు కమల సాక్షి సంతకం కూడా తీసుకున్నాను. ఇంకా మీకు అనుమానమేనా?" అన్నది విమల.

"నన్ను క్షమించు విమలా!"అన్నాడు రవి. క్షమార్పణ పేరిట ఆ దంపతు లిద్దరూ కొద్దిసేపు ఒకరి కౌగిట్లో ఒక రుండిపోయారు.

"అది సరే! అసలిలాంటి రిస్కు ఎందుకు తీసు కున్నావు?" అనాడు రవి. ఈ పర్యాయం అతడి కంఠంలో లాలన ధ్వనించింది.

"ఎందుకా?" అంది విమల. తను చెప్పదల్చుకున్నది చాలా వున్నదేమో—ఆమె తన కంఠాన్ని పర్యాయం సవరించుకుని అప్పుడు ప్రారంభించింది.

"ఏం చేయను చెప్పండి.... పెళ్ళయినప్పట్నించీ మా యింట్లో నేను పరాయిదాన్నయిపోయాను. మా యింట్లో అన్నిటికీ నన్ను వేరుగా చూస్తున్నారు. చుట్టుపక్కల కూడా నే నింకా కాపురానికి వెళ్ళలేదని చులకనగా చెప్పు కుంటున్నారు. కొందరైతే మీ గురించి కూడా చెడ్డగా

అంటున్నారు. అయ్య అక్కడ—అమ్మ ఇక్కడ అనీ చాలా మంది వేళాకోళంగా అంటున్నారు కలో గంజో మీతోనే కలిసి తాగాలనీ, మీతో కలిసి కష్ట సుఖాలు పంచుకోవాలని నాకుంది. మీ గురించిన ధ్యాసలో నాకూ మా యింట్లోని వారంతా పరాయి వాళ్ళుగా కనబడుతున్నారు చివరికి....ఇంతపని చేశాను... ''

"అయామ్ వెరీ వెరీ సారీ విమలా....ఇప్పుడు వెళ్ళగానే వారంరోజుల్లో ఇల్లు సంపాదించి నిన్ను తీసుకు వెళ్ళిపోతాను'' అన్నాడు రవి.

"అంత మాటన్నారు అదే చాలు నాకు'' అంది విమల.

3

"అదీ సంగతి'' అన్నాడు రవి.

రామం ముఖం ఆనందంతో వెలిగిపోయింది "రవీ— నీకు నేను అనేక విధాల థాంక్స్ చెప్పుకోవాలి'' అన్నాడు.

"నువ్వా, నాకా!'' అన్నాడు రవి ఆశ్చర్యంగా.

"అవును రవీ....నీది పాల పొంగులాంటి ఆవేశం. ఎలా పొంగుతుందో అలాగే చల్లారిపోతుంది. నే నలాంటి వాణ్ణికాదు. నాలో క్రమంగా ఆవేశం పేరుకుని పెరిగి పెరిగి ఒక రోజున అగ్నిపర్వతంలా బద్దలవుతుంది. అప్పుడు నేనే కాదు—నా చుట్టూ వున్నవారు కూడా ఎందరో నాశనమవుతారు'' అంటూ...."ఇది చూడు'' అన్నాడు రామం.

రవి చూశాడు. సుమారు పన్నెం డంగుళాల కత్తి అది.

"ఎందుకిది'' అన్నాడు రవి ఆశ్చర్యంతో.

"నే నిది కమలను హత్య చేయడం కోసం కొన్నాను....''

"కమలనా—హత్యా—ఎందుకు?''

"ఆమెనుంచీ నాకూ అలాంటి ఉత్తరమే వచ్చింది—''

అన్నాడు రామం గంభీరంగా.

"ఆ ఉత్తరం చూడగానే నే నామెను చంపేయాలను కొన్నాను. నీకూ అలాంటి ఉత్తరం వచ్చిందని తెలియగానే నాలో కాస్త ఆశ పుట్టింది. ఇద్దరు స్నేహితురాండ్రు కలిసి ఏదయినా నాటకమాడుతున్నా రేమోనని! అయితే నే నూరికి వెళ్ళదల్చుకోలేదు. వెడితే నీకులా వెళ్ళి మాట్లాడలేను. చాటుగా వెళ్ళి చంపి వస్తాను. అందుకే నిన్ను పంపాను. కానీ నువ్విలాంటి నిజం పట్టుకువస్తావన్న ఆశ నాకు లేదు. నీకు చాలా చాలా థాంక్స్!"

తర్వాత రామం భార్యకు ఉత్తరం రాశాడు.

"డియర్ కమలా!

నువ్వు కావాలని ఆ ఉత్తరం నా కవర్లో పెట్టి పోస్టు చేశావని నేను గ్రహించగలను. రవి కిలా నిన్ను సాక్ష్యాలు కూడా అడగను. నేను నిన్ను ప్రేమించాను. ప్రేమిస్తూనే వుంటాను. సరిగ్గా వారం రోజుల్లో మనం కలుసుకుంటాం—ఆ పైన మన మెప్పుడూ విడిపోము. నీ

రామం—"

4

"కమలా! నువ్వు నీ భర్తకు రాసిన ఉత్తరం నాకు అందింది. అంటే నాకు రాసిన ఉత్తరం నీ భర్తకు చేరిందేమోనన్న కంగారులో పరుగున వచ్చాను—" అన్నాడు మూర్తి.

"ఆ ఉత్తరం నేను నీకు పొరపాటున వ్రాయలేదు. కావాలనే పోస్టు చేశాను. నేను నా భర్తను ఎంతగా ప్రేమిస్తున్నానో గ్రహించాలని—నీ కా ఉత్తరం పోస్టుచేశాను" అన్నది కమల.

"అదే నిజమైతే ఫరవాలేదు కమలా! నే నూళ్ళో లేని సమయంలో నీ ఉత్తరం వచ్చింది. చూడగానే కంగారుపడి పరుగున వచ్చాను. ఏదో క్షణంలో—అజ్ఞానపుటా వేళంలో ఓ తప్పు చేస్తే అదే తప్పు కలకాలం చేయకూడదు. ఆ విషయం నాకూ తెలుసు—...." అని వెళ్ళిపోయాడు మూర్తి.

అతడు వెళ్ళిపోయిన కొద్దిసేపటికి కమలకు రామం నుంచి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చదువుకుని ఉత్సాహంగా విమల ఇంటికి పరుగెత్తింది కమల.

"ఏమిటే ఆ హుంషారు!" అంది విమల.

"విమలా! నీ మేలు మరిచిపోలేను. పొరపాటున మూర్తికీ, ఆయనకూ వ్రాసిన ఉత్తరాలు తారుమారై పోయాయి. ఉత్తరం పోయిన వెంటనే నీకు తెలియ బర్చాను. వెంటనే నువ్వూ అలాంటి ఉత్తరం నీ భర్తకు రాపి—నకలు కూడా వుంచి నాటకమని నిరూపించావు. ఇది నా భర్తమీద బాగా పని చేసింది—" అంది కమల—రామం తనకు వ్రాసిన ఉత్తం చూపిస్తూ.

"మైనస్ ఇంటూ మైనస్ ప్లస్సవుతుంది. అదే సూత్రాన్ని నే నుపయోగించాను. కానీ ఇకమీదట పొర పాట్లు చేయవు కదూ!" అంది విమల.

"ముర్తికి కూడా చెప్పవలసిన విధంగా జవాబు చెప్పాను. నా ఆలోచనల్లో నావారు తప్ప యింకెవ్వరూ వుండరిక...."

"విష్యూ ఆల్ ది బెస్టు!" అంది కమల.

సరిగ్గా రెండువారాల్లో ఆ అతివలిద్దరూ తమ తమ భర్తలతో హాయిగా కాపురం చేసుకుంటున్నారు. □

కాళిదాసు పారిపోయాడు

కె.వి.రమణ

అర్ధరాత్రివేళ అదేపనిగా తలుపులమీద చప్పుడుకు, హెడ్ కానిస్టబుల్ ఐరావతం వులిక్కిపడుతూ నిద్ర లేచాడు. జారిపోతున్న లుంగిని సర్దుకుంటూ హడావుడిగా తలుపులు తెరిచాడు ఐరావతం.

ఒన్‌నాట్‌త్రీ, త్రీనాట్‌ఒన్‌లు చెమటలు కక్కుతూ, దేబిముఖాలతో అతనికి దర్శనమిచ్చారు. ఒన్‌నాట్‌త్రీ

దాదాపు ఏడుపు గొంతుతో "కొంప మునిగింది గురూ!" అన్నాడు.

నిద్ర మత్తులో వున్న ఐరావతం ఒన్‌నాట్‌త్రీ మాటతో కంగారు పడిపోయి ఇల్లంతా ఒకసారి కలయజూశాడు. అంతా సవ్యంగానే వుంది.

"ఒరేయ్! అర్ధరాత్రి బంగారం లాంటి నిద్ర చెడ గొట్టింది గాక, వెధవ కబుర్లు చెబితే పెచ్చులూడిపోగలవ్! చెప్పేదేదో సరిగ్గా చెప్పి ఏడవండి" అంటూ ఇల్లెగిరేట్టు అరిచాడు ఐరావతం.

"కాళిదాసుగాడు పారిపోయాడు" ఒకే మాటతో ఆటం బాంబు పేల్చాడు త్రీనాట్‌ఒన్.

ఐరావతం నిలుచున్నవాడల్లా దబ్బున గుమ్మంమీదనే కూలిపోయాడు.

కాళిదాసు, రాష్ట్రంలో పేరు మోసిన క్రిమినల్! హత్యలు, దోపిడీలు అతడి నిత్యకృత్యాలు. ఇన్‌స్పెక్టర్ షరీఫ్, అజయ్‌కుమార్‌లు యెంతో ప్రయాసతో అతణ్ని బంధించారు. మరుసటి రోజు కాళిదాసును కోర్టులో హాజరు పరిచేందుకు అన్ని యేర్పాట్లూ జరిగిపోయాయి. ఈ స్థితిలో అతడు తప్పించుకు పోయాడంటే ఎంతోమంది పోలీసులు వుద్యోగాలు కోల్పోతారు. మరెందరికో రివర్ట్‌లు, చీవాట్లు కాగితాలు తప్పవు.

కాళిదాసు పట్టుబడిన విషయానికి వార్తా పత్రికలు అత్యంత ప్రాధాన్యతను యిచ్చాయి. పోలీసుశాఖ సామర్థ్యాన్ని కొనియాడుతూ ప్రత్యేకించి ఇన్‌స్పెక్టర్ షరీఫ్, డిటెక్టివ్ అజయ్‌కుమార్‌లను అవి ఆకాశానికెత్తేశాయి. ఇప్పుడు కాళిదాసు తప్పించుకున్నాడని తెలిసిన మరుక్షణమే అంతకు మించి వ్యతిరేక ప్రచారం చేయగలవు. ఒక్క

మాటలో చెప్పాలంటే విశాఖపట్టణంలోని పోలీసుశాఖ ప్రస్తుతం 'అత్యంత విషమ స్థితి'లో వుంది.

జరిగింది జరగబోయేది అంతా 70 ఎం ఎం పిక్చరులా ఐరావతం కళ్ళముందు ఒక్కసారి మెదిలింది.

"గురూ! ఈ సమయంలో నువ్వే యిలా మట్టికరిస్తే ఎలా?" అన్నాడు ఒన్‌నాట్‌త్రీ.

ఐరావతం ఒక్కసారిగా తెప్పరిల్లాడు. ఔను! తను తొందరగా ఏదో ఒకటి చేయాలి. లేకపోతే అందరూ చిక్కుల్లో పడక తప్పదు. సమయానికి ఇన్‌స్పెక్టర్ షరీఫ్ లేరు. తండ్రికి సీరియస్‌గా వుందని టెలిగ్రాం వస్తే తెల్లారేలోగా వచ్చేస్తానని వూరెళ్ళారు. డిటెక్టివ్ అజయ్ కుమార్ సయితం యేదో హత్య కేసులో వూటీ వెళ్ళారు. దీన్ని ఏదో రకంగా తనే సాధించాలి! పట్టుదలగా పిడికిలి బిగించాడు ఐరావతం.

"ఒరేయ్! అసలేం జరిగిందో సరిగ్గా చెప్పండి" అన్నాడు ఒన్‌నాట్‌త్రీ, త్రీనాన్‌ఒన్‌ల కేసి చూస్తూ.

ఒన్‌నాట్‌త్రీ గొంతు సవరించుకొంటూ, "తొమ్మిది గంటల ప్రాంతంలో కాళిదాసుకు భోజనం పెట్టాం గురూ. ఆ టైములో వాడికి కాపలా వున్న దాదాపు పదిహేనుమందీ అక్కడే వున్నాం. కూర్చొని భోజనం చేసేందుకు కాళ్ళకు వున్న బేడీలు యిబ్బందిగా వున్నాయని కాళిదాసు అల్లరి చేశాడు. ఇందర ముందగా వాడెక్కడికి పోతాడు లెమ్మని కాళ్ళకు వేసిన బేడీలు తప్పించాం. చేతులకు వేసిన బేడీలు అలాగే వున్నాయ్.

భోజనం అయ్యాక చేతులు కడుక్కునేందుకని వాణ్ణి పెరటివేపుకు తీసుకెళ్ళాం. త్రీనాట్‌ఒన్ కాళిదాసు చేతుల మీద నీళ్ళు పోశాడు. నేను త్రీనాట్‌ఒన్ పక్కనే నిల్చు

న్నాను. మిగిలిన వాళ్ళందరూ గదిలో యేవో మాటల్లో పడ్డారు.

చేతులమీద పడుతున్న నీటిని దోసిటనిండా పట్టి హఠాత్తుగా ఆ నీటిని మా యిద్దరి కళ్ళల్లో పడేట్టు చల్లాడు కాళిదాసు. కారం నీళ్ళు కళ్ళనిండా పడడంతో యిద్దరం కూడా వెంటనే కళ్ళు తెరవలేకపోయాం. మేం కళ్ళూ నోరూ తెరిచేసరికి కాళిదాసు గోడ దూకేశాడు. కొద్ది నిముషాల తేడాతో అందరం గోడ దూకి రోడ్డుపైకి వెళ్ళాం. కాళిదాసు జాడ కనుచూపు మేరలో యెక్కడా లేదు'' అంటూ ముగించాడు.

ఐరావతం ఆలోచనల్లో పడ్డాడు కాళిదాసు అంత హఠాత్తుగా అక్కణ్ణుంచి మాయమయ్యాడంటే రోడ్డుమీద ఏ కారో, మోటారు సైకిలో సిద్ధంగా వుందన్న మాట. అందుకే కాళ్ళ సంకెళ్ళు యిబ్బందిగా వున్నాయంటూ అల్లరి చేయడం, అంతా ఒక ప్లాను ప్రకారం జరిగింది.

కాళిదాసు కస్టడీ నుండి తప్పించుకుని రెండు గంటలు దాటిపోయింది. పోవాలనుకుంటే ఈసరికి తమకు అందనంత దూరం పోవచ్చు. కానీ కాళిదాసు పద్ధతి తెలిసిన వాళ్ళకు యిప్పుడు అతడు ఏ ప్రయత్నంలో వుంటాడో గ్రహించడం ఏమంత కష్టం కాదు.

కాళిదాసు యిప్పుడు తన అనుచరులను కూడగట్టుకొని రిటైర్డు మిలిటరీ మేజర్ జనార్ధన్ యింటిమీద దాడిచేసే పనిలో వుంటాడు. ప్రాణాలు పోయే దశలో కూడా ప్రతీకారానికి ప్రథమస్థానం యిచ్చే మన స్తత్వం కాళిదాసుది. మేజర్ జనార్ధన్ యిచ్చిన ఇన్ఫర్మేషన్ ఆధారంగానే అజయ్‌కుమార్, షరీఫ్‌లు తెలివిగా వల పన్ని అతణ్ణి బంధించారు.

ఈ అవకాశాన్ని ఆధారంగా కాళిదాసును తిరిగి బంధించడమే గాక, మేజర్ జనార్ధనం కుటుంబాన్ని ఈ క్రూరుడి కబంధహస్తాల నుండి కాపాడే బాధ్యత కూడా తమదేనని ఐరావతం భావించాడు.

పరిస్థితి తన శిష్య పరమాణువుకు అర్థం అయేలా చెప్పే వుద్దేశ్యంతో "ఒరేయ్! నువు కాళిదాసువే అనుకో! పోలీసుల బారినుండి తప్పించుకున్నావ్........" అంటూ యింకా యేదో చెప్పబోయాడు.

ఒన్‌నాట్ త్రీ ఒక్కసారిగా అదిరిపోతూ "గురో! అన్యాయం. ఆ కాళిదాసుగాడి పేరుతో నన్ను యిందులో యిరికించెయ్యాలని చూస్తున్నావా?" అంటూ లబ లబ లాడాడు.

ఐరావతం తల బాదుకొంటూ "నీకేవో డిటెక్షన్ నేర్పాలనుకోవడం నాది బుద్ధి తక్కువ. సరేగానీ మీ రిద్దరూ స్టేషనుకెళ్ళి జీపు సిద్ధం చేయించండి. మనవాళ్ళందర్నీ తుపాకులతో బాటు రడీగా వుండమనండి. బట్టలు మార్చుకొని పది నిముషాల్లో నేనూ వచ్చేస్తాను" అన్నాడు.

ఒన్‌నాట్ త్రీ, త్రీనాట్ ఒన్‌లు ఐరావతానికి సెల్యూట్ చేసి, తమ సైకిళ్ళను స్టేషనుకేసి పరుగుతీయించారు. ఐరావతం వారు వెళ్ళినవేపే చూస్తూ "ఒరేయ్! నా కొడుకా కాళిదాసూ! తెల్లారేలోగా నీచేత వూసలు తిరిగి లెఖ్ఖెట్టించకపోతే నా పేరు ఐరావతం కాదురా!" అనుకుంటూ యింట్లోకి దూరాడు.

2

అర్ధరాత్రి దాటి అరగంట గడిచింది. రిటైర్డు మేజర్ జనార్ధన్ బంగళా ప్రశాంతంగా వుంది. మేజర్ జనార్ధన్ అతని భార్య వర్ధని, కుమార్తెలు ప్రతిమ, నీలిమ హాయిగా

నిద్రపోతున్నారు.

బంగళా గేటు తెరచి ఐదుగురు వ్యక్తులు కాంపౌండ్‌లో ప్రవేశించారు. నిద్రా భంగమైన వూరకుక్కలు వీధిలో అదే పనిగా అరుస్తున్నాయి. ఆగంతకులు ఐదుగురూ యమ కింకరుల్లా వున్నారు. అందరి చేతులూ ఖాళీగానే వున్నాయ్! కానీ వారు నడుముకు కట్టుకున్న చైన్లు, మొలలో దోపిన బాకులూ నిత్యం రక్తంతో తడవాల్సిందే.

ఒకే ఒక తాపుతో వరుసగా తలుపు లన్నిటినీ ఎగర గొడుతూ వారు ఏ ఆటంకమూ లేకుండా మెయిన్ హాల్లోకి ప్రవేశించారు గదుల్లో వున్న మేజర్ కుటుంబాన్ని హాల్లోకి ఈడ్చుకొచ్చారు. హాల్లో నడుంమీద రెండు చేతులతో వికటంగా నవ్వుతున్న మహాకాయాన్ని చూసి మేజర్ జనార్ధన్ గతుక్కుమంటూ "నువ్వా...." అన్నాడు.

"నేనేరా ముసలి క్కా! నన్ను పోలీసులకుపట్టిస్తావురా. నిన్నూ నీ కుటుంబాన్నీ ముక్కలుకింద నరుకుతానని ఆ నాడే ప్రతిజ్ఞ చేశాను" అని తన నలుగురు అనుచరులతో "ఒరేయ్! అందర్నీ స్థంభాలకు కట్టేయండ్రా!" అన్నాడు.

హాల్లో వున్న రెండు స్థంభాల్లోనూ ఒకదానికి మేజర్‌ను అతని భార్యను కట్టి మిగిలిన స్థంభానికి ప్రతిమ, నీలిమ లను కట్టేందుకు సిద్ధపడుతుండగా కాళిదాసు వాళ్ళను ఆగ మని "గుంటలు మహాపసందుగా వున్నార్రా! మేజర్‌గాడి కళ్ళముందు వీళ్ళను కసితీరా నలిపిపారేసి ఆనక అందర్నీ నరికిపారేద్దాం" అన్నాడు

కాళిదాసు వికటంగా నవ్వుతూ మేజర్ పెద్దకుమార్తె ప్రతిమను సమీపించాడు. మేజర్ భార్య వర్ధని "బాబూ! వారి బ్రతుకు నాశనం చేయకండి. మీకు దణ్ణంపెడతాను.

మీకు మామీద కోపం వుంటే మమ్మల్ని చంపండి" అంటూ హృదయవిదారకంగా ఏడవసాగింది. అదంతా రాతిమీద పోసిన నీరు లాంటిదే వారిముందు. జాలి, కరుణ లాంటి పదాలు వాళ్ళ నిఘంటువుల్లో లేవు.

కాళిదాసు ఒక్కో అడుగూ ముందుకు వేస్తుంటే ప్రతిమ భీతహరిణలా వెనక్కి తగ్గసాగింది. కాళిదాసు ముందు ప్రతిమ సింహం ముందు చిట్టెలుక. వెనక్కి తగ్గుతున్న ప్రతిమ జారిపోయిన తన పైటను గమనించే స్థితిలో లేదు. క్రింద వేలాడుతున్న పైటను చటుక్కున దొరకబుచ్చుకొని దానిని తనవేపుకు బలంగా గుంజాడు కాళిదాసు.

ఆ విసురుకు ప్రతిమ ఒంటిమీద చీర కాళిదాసు చేతికి వూడిరావడమే గాక, ప్రతిమ కూడా గిరగిర తిరుగుతూ కాళిదాసుమీద పడింది. ప్రతిమ జాకెట్టూ బాడీ ఒకేసారి తెంచిపారేశాడు కాళిదాసు. ఏ ఆచ్ఛాదనా లేని తన యవ్వన సంపదను రెండు చేతులమాటునా దాచేందుకు విఫలయత్నం చేస్తూ గిరుక్కున వెనుదిరిగి పారిపోబోయింది ప్రతిమ.

అదే అదనుగా వెనకనుండి ప్రతిమ శరీరాన్ని అంటి వున్న ఒకే ఒక లంగాను తెంపివేసేందుకు వుత్సాహంగా తన చేతిని చాచాడు కాళిదాసు. మేజర్ కుటుంబం హాహాకారాలు చేసింది.

అదే సమయానికి చెవులు చిల్లులు పడే శబ్దం. కాలసర్పంలా ప్రతిమ మానాన్ని కాటువేసేందుకు కురుకుతున్న కాళిదాసు హస్తం చచ్చుబడిన దానిలా వేలాడింది.

చేతిలో తుపాకీతో గుమ్మంలో ఐరావతం రౌద్రాకారం దాల్చివున్నాడు. తుపాకీ గొట్టంనుండి తెల్లనిపొగలు యింకా వస్తూనే వున్నాయ్. కాళిదాసు ప్రవాహంలా రక్తాన్ని చిందిస్తున్న తన కుడిభుజాన్ని ఎడమచేతితో పట్టుకున్నాడు.

"ఎవరూ కదలకండి! కదిలారా ఎవడి బొందిలోనూ ప్రాణం వుండదు" అని ముందుకు అడుగు వేయబోయాడు ఐరావతం.

ఈ హఠాత్సంఘటనకు నిశ్చేష్టులయిన కాళిదాసు అనుచరుల్లోని రవూఫ్ వెంటనే తేరుకొని గబుక్కున జనార్ధన్ దంపతులు కట్టివేయబడిన స్థంభం చాటుకు దూకాడు. చేతిలోని కత్తిని జనార్ధన్ కంఠానికి ఆనించాడు. ముందుకు రాబోతున్న ఐరావతం, అతని వెనకగా వున్న పోలీసులూ ఈ కొత్త పరిణామానికి నివ్వెరపోయారు.

రవూఫ్ "ఎవరూ ముందుకు రావద్దు. నా మాటను నిర్లక్ష్యం చేస్తే మేజర్ దంపతులు చచ్చినట్టే లెక్క" అన్నాడు కఠినంగా. పోలీసులు శిలా ప్రతిమలయ్యారు.

కాళిదాసు ముఠా యీ అవకాశాన్ని బాగా వినియోగించుకున్నారు. స్థంభానికి కట్టబడ్డ మేజర్ కట్లు విప్పి అతని కంఠంమీద కత్తిని అలాగే వుంచి, వెనక్కు తగ్గుతూ హాలు వెనక భాగాన వున్న తలుపును చేరారు. అందరూ ఆ ద్వారంగుండా బయటికి చేరి, మేజర్ని మాత్రం హాలు మధ్యకు వచ్చి పడేటట్టు ఒక తన్ను తన్ని చటుక్కున తలుపులు వేసేశారు.

ఐరావతం రెండు అంగల్లో హాలు మధ్యకు వచ్చి, సిగ్గుతో మొగ్గలా నేలమీద ముడుచుకుపోయిన ప్రతిమ మీదకు ఆమె చీరను విసురుతూ హాలు వెనక తలుపులను చేరాడు. ఎంత లాగినా తలుపులు రాలేదు. అవి అవతలవేపు గడియ వేయబడ్డాయి.

"పెరటి ద్వారంగుండా వాళ్ళు వెనకవున్న రోడ్డును చేరుకోవచ్చు. మనం యిటునుండి అటు చేరుదాం రండి" అంటూ మేజర్ జనార్ధన్ ముందు ద్వారంవేపు పరుగు

తీశాడు. ఐరావతం పోలీసులు అతణ్ని అనుసరించారు.

రోడ్డుమీద కాళిదాసు మృతా అయిపులేదు. ఐరావతం వుసూరుమంటూ నిట్టూర్చాడు.

"చేతికి అందినట్టే అంది తప్పించుకుపోయారు వెధవలు. కొట్టిన దెబ్బేదో సరిగ్గా గుండెల్లో కొట్టినా మనకు పీడా పోయేది గురూ," అన్నాడు ఒన్‌నాట్‌త్రీ నీరసంగా.

ఐరావతం ఆ మాటలేవీ పట్టించుకోకుండా తన ఆలోచనలో తా మున్నాడు. కాళిదాసు భుజానికి బలమైన గాయమే తగిలింది. ఆ గాయంతో అతనిప్పుడు వూరు దాటేమాట కల్ల. కాళిదాసు తప్పకుండా వైద్యుడి దగ్గరకు వెళ్ళాలి. అయితే ఏ హాస్పిటల్‌కి వెళతాడు.

ఈ స్థితిలో గవర్నమెంటు హాస్పిటల్‌కు వెళ్ళడు. అలాగే పరిచయం లేని డాక్టర్ల వద్దకూ వెళ్ళడు. తుపాకీ గుండుతో వచ్చిన వ్యక్తిని గురించి వాళ్ళు ప్రత్యక్షంగానో పరోక్షంగానో పోలీసులకు తప్పకుండా తెలియజేస్తారు. కాబట్టి అది రిస్క్‌తో కూడుకున్న పని. కాళిదాసు ప్రస్తుతానికి ఎటువంటి రిస్కూ తీసుకోగల స్థితిలో లేడు. ఇటువంటి కార్యాలకు సాధారణంగా తమ విషయం తెలిసి తమకు నమ్మకస్థులైన డాక్టర్లనే వారు ఆశ్రయిస్తారు.

ఆ సంగతి ఒన్‌నాట్‌త్రీకి చెప్పి "ఈ ప్రాంతానికి దగ్గర్లో అటువంటి డాక్టరు ఎవరైనా వున్నారా" అని అడిగాడు ఐరావతం.

ఒన్‌నాట్‌త్రీ ఒక క్షణం ఆలోచించి "డాక్టరు ముకుందం" అన్నాడు.

3

డాక్టరు ముకుందం హిస్పిటల్ కమ్ నివాసానికి ఫర్లాంగు దూరంలోనే జీపును ఆపుచేయించాడు ఐరావతం.

మఫ్టీలో వున్న ఇద్దరు కానిస్టేబుల్స్‌ను పిలిచి వాళ్ళకు ఏం చేయాలో చెప్పాడు. ఇంకొక కాన్స్టేబిల్‌కి డ్రాయరు, బనీను మాత్రమే వుంచి మిగతా బట్టలు తీపివేయించాడు. అతనికి తలకి ఒక కట్టు కట్టించి మఫ్టీలోని ఇద్దరు కాన్స్టేబుల్సూ అతణ్ణి ముకుందం నివాసానికి మోసుకుపోయి అక్కడ ఏం చేయాలో వారికి వివరించాడు.

ఆ ముగ్గురూ అలా ఐరావతం చెప్పినట్టుగా డాక్టరు ముకుందం నివాసం చేరుకున్నారు.

గేటు ముందు చిన్న బల్లమీద కూర్చొని బీడీ దమ్ము లాగుతూ కాళిదాసు ముఠావాడొకడు దిక్కులు చూస్తున్నాడు. ఇద్దరు చేతులమీద మోస్తుండగా బాధతో మెలికలు తిరిగిపోతున్న వ్యక్తిని చూస్తూ "ఏమయింది యితనికి, డాక్టరుగారు ఇప్పుడు ఎవర్నీ చూడరు" అన్నాడు కరుగ్గా.

"లారీ గుద్దేసింది బాబూ! చాలా ప్రమాదంగా వుంది. ఎలాగైనా డాక్టరుగార్ని చూడాలి బాబ్బాబు" అంటూ చేతుల మీద వున్న వాణ్ని నేలమీదే పరుండబెట్టి ఇద్దరూ వాణ్ని ప్రతిమాలుతున్నట్టుగా చెరోప్రక్క చేశారు. ఓరగా పరిసరాలను ఒకమారు గమనించి ఇద్దరూ ఒకేసారిగా తమ పిడికిళ్ళతో వాడి ముఖాన్ని ఎడతెరిపి లేకుండా బాదారు. ఏం జరుగుతున్నదీ తెలుసుకునే లోగానే కాళిదాసు ముఠా వాడు స్పృహతప్పి నేలమీద ఒరిగిపోయాడు.

టార్చిలైటుద్వారా అందిన పిగ్నల్‌తో మిగతా బృందాన్ని వెంటబెట్టుకొని అక్కడికి చేరాడు ఐరావతం. అందరూ ఏ మాత్రం చప్పుడు లేకుండా ముకుందం ఇంటిని చేరారు.

ఓరగా వేసిన తలుపులు తోసి వరండాలో ప్రవేశించారు. తలుపు సందుగుండా వెలుతురు ప్రసరిస్తున్న గదిలోకి, ఆ సందుగుండానే ఒక కన్నుతో తన దృష్టిని సారించాడు

ఐరావతం.

గది మధ్యగా వున్న బెడ్ మీద కాళిదాసు పడుకొని వున్నాడు. డాక్టరు ముకుందం ఆపరేషను చేసి తుపాకి గుండు తీసే ప్రయత్నంలో మునిగి వున్నాడు. డాక్టరుకు కాస్త వెనగ్గా కాళిదాసు అనుచరులు ముగ్గురూ రఘూఫ్‌తో సహా చేతులు కట్టుకొని రాతి స్థంభాల్లా నిలబడి వున్నారు.

ఐరావతం తన వుక్కు పాదంతో తలుపును బలంగా ఒకే ఒకతాపు తన్నాడు. తలుపుకు లోన పెట్టబడిన గెడలు ఐరావతం తన్నుకు స్క్రూలతో సహా లేచిపోయి తలుపులు ఫడాలుమంటూ తెరుచుకున్నాయి.

గదిలోని మనుషులు తుళ్ళిపడుతూ వెనక్కి తిరిగిచూసే లోగా ఐరావతం బృందం లోనికి ప్రవేశించి తిరగబడినవాడినల్లా నిర్దాక్షిణ్యంగా కాళ్ళూ చేతులూ విరగ్గొట్టి మరీ స్వాధీనంలోకి తీసుకున్నారు.

తెల్లవారేసరికి భుజానికి పెద్ద కట్టుతో కాళిదాసూ, తలకూ, కాళ్ళకూ, చేతులకూ బాండేజీలతో అతని అనుచరులూ లాకప్‌లో పూసలు లెక్కపెడుతూ కూర్చున్నారు.

ఈ వార్త అప్పటికే వూరంతా ప్రాకిపోయి వుత్సాహవంతులైన జనంతోనూ, పత్రికా విలేఖరులతోనూ స్టేషను యావత్తూ నిండిపోయింది.

"గురూ! కాళిదాసులాంటి ఘనుడ్ని నీ శపథం మేరకు తెల్లారేలోగా తిరిగి లాకప్‌లో పెట్టావు. నీ తెలివి అమోఘం. యు ఆర్ గ్రేట్! ఐరావతం ది గ్రేట్!" అంటూ బిగ్గరగా అరిచాడు ఒన్‌నాట్‌త్రీ. అందరూ అతడిని ఆకాశానికెత్తేశారు.

ఐరావతం సంతోషంతో వుబ్బితబ్బిబ్బై ఇంద్రుడి ఐరావతాన్ని మించి పెరిగిపోయాడు. □

తిరుమలశ్రీ

మర్డర్ హంట్

గది తలుపులు తెరుచుకొని లోపల ప్రవేశించారు—వాణి, ప్రసాదరావులు.

గది మధ్యగా పడివుందొక పధ్నాలుగు సంవత్సరాల అమ్మాయి.

"బాలా! నీ నటనకు మెచ్చుకుంటున్నాము .... లే!" అంది వాణి చిరునవ్వుతో.

"ఎలాగైతేనేం శవాన్ని కనిపెట్టగలిగాం. ఈ గేమ్‌లో ప్రయిజు మనదే!" .... ప్రసాదరావు అన్నాడు. "ఓ శవాకారం! ఇక నీ నటనను చాలించవచ్చు—"

జవాబు రాలేదు వారికి. బాల కనీసం కదలనైనా లేదు.

"బాలా! ఊపిరి బిగబట్టి ఎంతసేపు వుండగలవు? పైకిలే—" అంటూ హుషారుగా ఆ అమ్మాయి చేయి పట్టుకొని లాగిన వాణి—మరు క్షణంలోనే 'కెవ్వు' మంది.

"మైగాడ్! బాల నిజంగానే చచ్చిపోయినట్లుంది—" అంది కంగారుగా.

ఆమె పలుకులు వింటూనే చటుక్కున బాల దేహాన్ని సమీపించాడు ప్రసాదరావు. జాగ్రత్తగా ఆమెను పరీక్షించి—"బాను శవంగా నటించబోయి—నిజంగానే శవమయింది!" అన్నాడు ఆందోళనగా.

2

"త్రిమూర్తిగారూ!....ఈ రోజు మా మ్యారేజ్ డే. మా ప్రథమ వివాహ వార్షికోత్సవం చాల గొప్పగా జరిపించాలనుకున్నాము. మర్డర్ హంట్ — వంటి గేమ్ యీనాటి డిన్నర్‌కొక హైలైట్ ...."

ఆగాడు భైరవమూర్తి. ఒకసారి ఆ హాలులో కూర్చున్న వారందరినీ కలయచూసాడు .... డిటెక్టివ్ శ్రీ త్రిమూర్తి. అసిస్టెంట్ మోహన్. క్రయింబ్రాంచి యిన్‌స్పెక్టర్ మధు. ఆనాటి పార్టీలో పాల్గొన్న అతిథులూ ఆసీనులయి వున్నారక్కడ.

"—తమకివ్వబడిన గుర్తుల ప్రకారం శవం యున్న చోటికి చేరుకోవాలి పోటీదారులు. శవాన్ని కనిపెట్ట గలిగితే—తరువాత వారికివ్వబడే క్లూలనుబట్టి హత్యను ఎవరు చేసినదీ, ఎలా చేసినదీ కనిపెట్టాలి. గేమ్‌లో గెలుపొందిన

వారికి తగిన బహుమతి యివ్వబడుతుంది....'' చెప్పుకు పోయాడు భైరవమూర్తి. "....తమ కివ్వబడిన ఆధారాల ప్రకారం వాణి, ప్రసాదరావు లిద్దరూ శవం యున్నచోటికి చేరుకోగలిగారు. వాళ్ళు వెళ్ళేసరికి, ఈ గేమ్‌లో శవంగా నటిస్తున్న బాల—నిజంగానే చచ్చి పడివుంది...."

"అసలీ గేమ్‌ను తయారు చేసిందెవరు?" ప్రశ్నించారు డిటెక్టివ్ త్రిమూర్తి.

"నా భార్య మైథిలి...."

"ఈ గేమ్‌లో బాలను శవంగా నటించమని సూచించిన దెవరు?"

"మా పనిపిల్ల బాలను యిందుకు ప్రోత్సహించినది నేనే త్రిమూర్తిగారూ?" భైరవమూర్తి అన్నాడు. "నా సూచనపైనే బాల యిందు కంగీకరించింది. అందుకే నాకు విచారంగా వుంది. ఆమె చావుకు నేనే కారకుడ్నన్న విషయం నన్నెంతో బాధిస్తోంది."

"బాల కెవరైనా శత్రువులున్నారేమో తెలుసా?"

"నాకు తెలిసినంతమటుకు ఎవరూ లేరని అనుకుంటున్నాను. అయినా, బాలవంటి పధ్నాలుగేళ్ళ పసిపిల్లకు శత్రువు లెవరుంటారు?"

భైరవమూర్తి వంక పరిశీలనగా చూసారు త్రిమూర్తి. అతని వయస్సు దాదాపు ముప్పయ్ఐదు సంవత్సరాలుంటుంది. ఎత్తుగా, దృఢంగా వుండే ఆకార మతనిది. సంవత్సరం క్రితం ధనవంతురాలయిన మైథిలిని చేసుకోవడంతో మద్రాసులోని ధనవంతులలో, పెద్దమనుష్యులలో ఒకడుగా పేరు పొందాడు.

"మీ యింట్లో ఎందరుంటున్నారు?" అంటూ ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ మధు.

"నేను, నా భార్య కాక—వంటలక్క రాజమ్మ, పని పిల్ల బాల వుంటున్నాము."

"బాల యెన్ని రోజుల నుండి పని చేస్తున్న దిక్కడ?" ప్రశ్నించాడు అసిస్టెంట్ మోహన్.

"ఏడాదిగా మాతోనే వుంటున్నది."

"మీ భార్య యెక్కడ?" అడిగారు త్రిమూర్తి.

"లోపల వుందనుకుంటాను."

"పిలవండి...." త్రిమూర్తి అన్నారు.

"అలాగే" అన్నాడు భైరవమూర్తి అచ్చటి నుండి నిష్క్రమించుతూ.

"ఇన్స్పెక్టర్! హత్య సాయంత్రం, నాలుగు-అయిదు గంటల మధ్య జరిగివుంటుందని డాక్టర్ చెబుతున్నాడు. బాల మెడలో స్కార్ఫ్‌లా కట్టుకున్న రుమాలును ఆమె కంఠానికి బిగించి హత్య చేసారెవరో!"—గదిలో సాలో చనగా పచార్లు చేస్తూ చెప్పసాగారు డిటెక్టివ్ త్రిమూర్తి.

"—నాలుగు, ఐదు గంటల మధ్య హత్యాప్రదేశం పరిసరాలలో నున్నవాళ్ళు అయిదుగురు. ఈ భవనం వెనుక నున్న పెద్ద తోటలో, దాదాపు అరమైలు దూరంలో నున్న చిన్నగదిలో హత్య జరిగింది. హత్య జరిగిన సమయానికి యీ భవనంలో నున్న వాళ్ళు సుమారు పదిహేను మంది."

హఠాత్తుగా ఆగారు త్రిమూర్తి. హడావుడిగా గదిలోనికి వస్తున్న భైరవమూర్తి వంక ప్రశ్నార్థకంగా చూసారు.

"ఎక్స్క్యూజ్ మీ, త్రిమూర్తిగారూ!" కంగారుగా అన్నాడు భైరవమూర్తి. "నా భార్య మైథిలి మాయమయింది!"

నొసలు చిట్లించి, అర్థంకానట్లుగా చూసారాయన.

"మైథిలి కనిపించడంలేదు. ఈ భవనము, పరిసరాలు—

అంతా గాలించాము. ఎక్కడా లేదు" అన్నాడతను ఆందోళనగా.

"ఎక్కడికైనా వెళ్ళిందేమో?" అన్నారు త్రిమూర్తి.

"లేదు....మైథిలి గేటు దాటలేదని ఘూర్కా చెబుతున్నాడు. వాడి దృష్టిలో పడకుండా భవనం దాటడం అసంభవం."

భైరవమూర్తి పలుకులకు, ముఖాలు చూసుకున్నారు డిటెక్టివ్‌లు.

"అయితే ఏమయినట్లు మరి?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ మధు.

"అదే నాకూ బోధపడటంలేదు" అన్నాడు భైరవమూర్తి దిగులుగా.

ఒకక్షణం ఏదో ఆలోచిస్తూ వుండిపోయారు త్రిమూర్తి. తరువాత కొంతసేపటికి భైరవమూర్తి వంక చూశారు.

"ఆఖరుసారిగా మీ భార్యను ఎప్పుడు చూశారు మీరు?" అంటూ ప్రశ్నించారు.

"మధ్యాహ్నం డిన్నరు ముగిసాక మళ్ళా ఆమెను చూసిన జ్ఞాపకంలేదు."

"ఎవరైనా చూసారేమో కనుక్కున్నారా?"

"లేదంటున్నారు."

"ఉహుఁ...." అంటూ సాలోచనగా తలపంకించారు త్రిమూర్తి.

"బాలను హత్యచేసి—ఎక్కడో దాక్కొని వుండవచ్చునామె" అన్నాడు ఇన్‌స్పెక్టర్ మధు అకస్మాత్తుగా.

అపనివంక కోపంగా చూశాడు భైరవమూర్తి. "ఇన్‌స్పెక్టర్! ఏమిటి మీరనేది?" అన్నాడు.

"ఆమె అదృశ్యం కావడానికది కూడా ఒక కారణం

కావచ్చునంటున్నాను" అన్నాడు మధు.

తిరిగి ఏదో అనబోయాడు భైరవమూర్తి.

అంతలోనే, "భైరవమూర్తిగారూ! మీ భార్య గది నొకసారి పరీక్షించాలి ..." అన్నారు త్రిమూర్తి సాలోచనగా."

ఒకక్షణం తటపటాయించాడతను. చివరకు, "పదండి" అన్నాడు బయటకు దారితీస్తూ.

3

మైథిలి గదిలో గోడనున్న ఒక ఫోటో డిటెక్టివ్ త్రిమూర్తి నాకర్షించింది. పరిశీలనగా దానిని చూసారాయన. అది ఏడాది క్రితం తీయబడిన వారి పెళ్ళి ఫోటో. భైరవ మూర్తి ప్రక్కనే నిలుచుంది మైథిలి....దానినుండి మరల్చ బడిన ఆయన చూపులు. టేబిల్ పైన వున్న కార్డు సైజు ఫోటోపైన పడినయ్. ఆ మధ్యనే మైథిలి వంటరిగా తీయించు కున్న ఫోటో అది.

క్షణకాలం ఆ రెండు ఫోటోలను తదేకంగా చూస్తూ వుండిపోయిన త్రిమూర్తి—అసిస్టెంట్ మోహన్ పలుకు లతో తన దృష్టిని మరల్చలున్నారు.

"రేడియోపైన ఈ టెలిగ్రాం దొరికింది" అంటూ ఒక కవరును త్రిమూర్తి చేతిలో పెట్టాడు మోహన్.

దానిని చదువుకున్నారు త్రిమూర్తి.

దానిలో—"అరైవింగ్ బై జి. టి. టుమారో— నాగేష్" అని వుంది.

దానిని పరిశీలించి, అది క్రితం రోజు ఢిల్లీ కంటోన్ మెంట్ నుండి యివ్వబడిందని గ్రహించారాయన. ఆ టెలిగ్రాం కవరుమీది అడ్రసు మైథిలిది ...సాలోచనగా దానిని ఇన్స్పెక్టర్ మధు చేతిలో పెట్టారు త్రిమూర్తి.

దానిని చదువుకున్న మధు—"జి. టి. మధ్యాహ్నం రెండూ-ఇరవైకి సెంట్రల్‌కి చేరుకుంటుంది. ఇతనెవరో-ఈ పాటికి వచ్చియుండాల్సిందేనే!" అన్నాడు మధు ఆశ్చర్యంగా.

"ఔను. ఆ విషయం భైరవమూర్తి నడిగితే తెలుస్తుంది" అన్నారు త్రిమూర్తి.

మైథిలి సూట్‌కేసు తెరిచారు త్రిమూర్తి లోపలి దుస్తులు ఒక్కొక్కటే పైకితీసి పరీక్షించసాగారు. పెట్టె అడుగున పాతపేపర్ ఒకటి పరచబడియుంది. దానిక్రింద నేదో యున్నట్లనిపించేసరికి ఆ పేపరును తొలగించారాయన. అడుగున రెండు-మూడు పాత ఉత్తరాలున్నాయి. ఒక కవరులో కార్డుసైజు ఫొటోగ్రాఫ్ ఒకటి వుంది. దానిమీద తేదీ దాదాపు రెండు సంవత్సరాల క్రితానిది. ఆ ఫొటోలో భైరవమూర్తి, అతని ప్రక్కనే ఎవరో యువతి వున్నారు.

ఒక క్షణం దానిని తీక్షణంగా చూసారు త్రిమూర్తి తరువాత వుత్తరాలను చదివారు. వాటిని కోటుజేబులో పెట్టుకున్నారాయన. ఒక కాగితంపైన ఏదో అడ్రసు వ్రాసి మధు చేతిలో పెట్టారు—

"మధూ! ఈ అడ్రసుగల యింటిలోనున్న వ్యక్తిని వెంటనే యిక్కడకు రప్పించే ఏర్పాట్లు చెయ్యి....క్విక్-" అన్నారు.

"అలాగే సబిన్‌స్పెక్టర్ మురళిని పంపిస్తాను" అంటూ హడావుడిగా బయటకు నడుస్తున్న యిన్‌స్పెక్టర్ నుద్దేశించి—

"మధూ! భైరవమూర్తిని పంపించు," అన్నారు త్రిమూర్తి ఏదో ఆలోచిస్తూ.

మరో నిముషంలో—ఆ గదిలో అడుగుపెట్టాడు భైరవ

మూర్తి.

"భైరవమూర్తిగారూ! ఈ రోజు మీ భార్య కేదైనా టెలిగ్రాం వచ్చిందేమో మీకు తెలుసునా?" అంటూ ప్రశ్నించారు త్రిమూర్తి.

"తెలియదు" అన్నాడతను.

త్రిమూర్తి యిచ్చిన టెలిగ్రాం చదువుకొని ఆశ్చర్య పోయాడు. "ఈ విషయం మైథిలి నాకు చెప్పలేదు" అన్నాడు.

"నాగేష్ ఎవరు?"

"నా భార్య పెదతండ్రి కొడుకు."

"అతడీరోజు రాలేదా?"

"లేదు."

"ఢిల్లీలో అతనేం చేస్తున్నాడు?"

"ఆర్మీలో హవాల్దార్‌గా వుంటున్నాడు."

"అనుకున్న ప్రకారం అతడు రాలేక పోవడానికి కారణాన్ని మీరు వూహించగలరా?"

"బహుశా ట్రెయిన్ మిస్ అయి వుంటుందనుకుంటాను."

"కాని. అతను మిలిటరీ మాన్ అని మరిచిపోకండి. ప్రతి పనినీ పంక్చువల్‌గా చేసే డిసిప్లిన్ వాళ్ళ కలవాటు. ట్రెయిన్‌ను మిస్ చేసి వుంటాడనుకోను" అన్నారు త్రిమూర్తి.

"కావచ్చు....ఒకవేళ ప్రయాణాన్ని వాయిదా వేసుకొనియుండవచ్చును."

"మీ భార్య కతని రాక యేష్టమేనంటారా?" సూటిగా అతని కళ్ళలోనికి చూస్తూ ప్రశ్నించారు త్రిమూర్తి.

"నాగేష్‌పైన మైథిలికి ప్రేమ యెక్కువ. ఆమెకు

మిగిలియున్న బంధువు అతడు ఒక్కడే కావడంతో అత నంటే అభిమాన మెక్కువ. కాని...." అంటూ మధ్యలోనే ఆగిపోయాడు భైరవమూర్తి.

"ఏమిటి?" కుతూహలంగా ప్రశ్నించాడు త్రిమూర్తి.

"అప్పుడప్పుడు అతడ్ని గూర్చి బాధపడుతూ యుంటుంది మైథిలి...."

"ఎందుకు—?"

"మిలిటరీలో చేరిన తరువాత అతని స్వభావం మారి పోయింది. దుర్మార్గ ప్రవృత్తి నలవరచుకున్నాడతను."

"మరి కొంచెం విపులంగా చెప్పండి."

ఒక నిముషం మాట్లాడలేదతను. తరువాత నెమ్మదిగా యిలా అన్నాడు—"అతడు—మనుష్యుల్ని చంపుతాడు!"

4

అసిస్టెంటు మోహన్‌ను చూడగానే అటెంషన్‌లో నిలుచుని సాల్యూట్ చేశాడు ఘూర్కా.

"ఈ రోజు మధ్యాహ్నం పన్నెండు గంటల తరువాత మీ అమ్మగారు బయటకు వెళ్ళడం చూశావా?" అంటూ హిందీలో ప్రశ్నించాడు మోహన్.

"నహీ, సాబ్! ఈవేళ అసలు అమ్మగారెక్కడికీ వెళ్ళలేదు" అన్నాడు ఘూర్కా.

"ఒకవేళ నీవు చూపియుండక పోవచ్చుగా?"

"లేదు. ఉదయం నుండీ నేనీ కాబిన్‌లోనే కూర్చుని యున్నాను. ఎవరైనా లోపలినుండి బయటకు వెళ్ళినా, బయటనుండి లోపలికి వెళ్ళినా నా కంట్లో పడక తప్పదు" అన్నాడు వాడు దృఢంగా.

"అలాగా....పోనీ మధ్యాహ్నం తరువాత మరెవరైనా వెళ్ళిపోవడంగాని, రావడంగాని చూశావా?"

"ఎవరూ రాలేదు గాని, ఒకామె మాత్రం వెళ్ళి పోయింది."

"ఎవరామె?"... అంటున్న మోహన్‌కు మధ్యలోనే అడ్డుతగిలాడు ఘూర్కా.

"విచిత్రంగా వుంది, సాబ్! ఆవిడ లోపలికెళ్ళడం నేను చూడలేదు. ఈరోజు వచ్చిన అతిథులంతా నాకు గుర్తున్నారు. దాదాపు అందరినీ ఎరుగుదును కూడాను. కాని ఆవిడ రావడం మాత్రం చూసిన గుర్తులేదు...." అన్నాడు.

వాడి పలుకులకు విస్తుపోయాడు మోహన్.

"ఆమె ఎలా వుంటుంది?" అని అడిగాడు.

ఒక నిముషంపాటు ఆమె రూపాన్ని నెమరు వేసుకుంటూ వుండిపోయాడు ఘూర్కా. తర్వాత యిలా అన్నాడు__

"ఆమె వయస్సు పాతిక సంవత్సరాలుంటుంది. సన్నగా, పొడవుగా, అందంగా వుంది. గులాబిరంగు నైలెక్స్ చీరె కట్టింది. అదేరంగు టెర్లిన్ జాకెట్ తొడిగింది. ఒక చేతికి రిస్టువాచీ వుంది. మెడలో ఒకే ఒక బంగారు గొలుసు వుంది. ఒకమాదిరి ఎత్తుమడమల జోళ్ళు కాళ్ళకు వున్నాయి. చేతిలో హ్యాండ్‌బ్యాగ్ వుంది."

"మనిషి కంగారుగా వుందా?"

"లేదు, తాపీగానే నడిచి వెళ్ళింది."

"ఆమె నింతకుముందెప్పుడైనా చూసావా?"

"లేదు."

"ఆమెను మళ్ళా చూస్తే గుర్తుపట్టగలవా?"

"హాఁ, సాబ్!"

ఒక క్షణం ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు మోహన్.

తర్వాత జేబులోనుండొక ఫొటో తీసాడు. దానిలో సగ భాగాన్ని తెలివిగా చేతులతో కప్పి, తక్కిన సగాన్ని ఘూర్కాకు చూపించాడు.

"ఇలాచూడు....ఈ ఫొటోలో వున్నామెను ఎప్పుడైనా చూసావా?" అన్నాడు వాడి ముఖ కవళికలను జాగ్రత్తగా గమనిస్తూ.

అది చూడగానే వాడి కళ్ళు మెరిసాయి.

"సాబ్! నేను చెప్పిన యువతి యీమే!" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఈమె తప్ప వేరెవరైనా వచ్చారేమో, బాగా గుర్తు చేసుకో!" అన్నాడు మోహన్ ఫొటోను జేబులో పెట్టుకుంటూ.

తల అడ్డుగా వూపాడు వాడు. "నహీ, సాబ్!" అన్నాడు దృఢ స్వరంతో.

పర్సులోనుండి పది రూపాయల నోటుతీసి, ఘూర్కా చేతిలో పెట్టాడు మోహన్.

* * *

"నాకు తెలియదు—" అంది వంటామె రాజమ్మ. "భోజనాలు అయిన తర్వాత మళ్ళా మైథిలిని చూడలేదు నేను."

"ఈ రోజు వుదయం ఆమెకొక టెలిగ్రాం వచ్చింది ... ఆ విషయం నీకు తెలుసునా?" ప్రశ్నించారు డిటెక్టివ్ త్రిమూర్తి.

"తెలుసు. అది చూడగానే ఆమె ముఖమెందుకో— వెల—వెలబోయింది" వంటామె అంది.

"నాగేష్‌ను ఎరుగుదువా?"

"తెలుసు."

"ఎటువంటి వాడు?"

"మంచివాడేనండి."

"మీ అమ్మగారికి అతనంటే యిష్టంలేదా?"

"ఆయనంటే ఆవిడకెంతో అభిమానమండి. ఆయన వచ్చింది మొదలు 'అన్నయ్యా' అంటూ ఆయన వెంట— వెంటనే తిరుగుతూ యుంటుందామె.

"ఉహుం—" అంటూ సాలోచనగా తలపంకించారు త్రిమూర్తి. "నీ మాట నిజమయితే — నాగేష్ యిచ్చిన టెలిగ్రాం చూసి ఆమె ఆనందించాలే తప్ప—ఆమె ముఖ వైఖరి మారిపోవడానికి కారణమేమిటంటావ్?"

"ఆశ్చర్యంగానే వుంది...." రాజమ్మ అంది. "అయినా యీ మధ్య అమ్మగారి ప్రవర్తన యెందుకో వింతగా వుంటుంది."

"అలాగా!" ఆశ్చర్యంగా అన్నాడు త్రిమూర్తి. "అలా ఎందుకంటున్నావ్?"

"అమ్మగారు చాలా శాంతంగా, ఎప్పుడు చూసినా నవ్వుతూ యుండేవారు. కాని యీమధ్య ఎందుకో చికాకుగా, కోపంగా వుంటున్నారు. కొన్ని—కొన్ని ముఖ్యమైన అలవాట్లలోకూడ మార్పులు వచ్చినయ్."

"ఎప్పటినుండి—?"

"సుమారు ఒక వారం నుండి ఆమెలో మార్పును గమనిస్తూనే యున్నాను."

"నాగేష్‌ను కలుసుకోవడం యిష్టంలేక—అతడు వచ్చే సమయానికి మైథిలి మాయమయిందంటావా?" సూచించారు త్రిమూర్తి.

"నమ్మలేని విషయం—" అందామె దృఢంగా.

"బాలను చంపే అవసరం ఎవరికి వుంటుందో

వూహించగలవా?"

"ఆ పిల్లను చంపే అవసరం ఎవరికుంటుంది?" అంటూ ప్రశ్న రూపకంగా జవాబిచ్చిందామె.

"బాల గది యెక్కడ వుంది?"

"నా గది ప్రక్కనే వుంది. రండి, చూపుతాను."

వంటామె చూపిన బాల గదిలో ప్రవేశించారు త్రిమూర్తి... గదంతా పరీక్షించసాగారు. ఆయనకు కావలసినదేమీ లభించలేదు. అంతలోనే ఆయన దృష్టి ఒక మూలగా పడియున్న ఒక అట్టపైన పడింది. దానిని తీసి చూసారాయన. దానిపైన ఒక ప్రక్కను ఏవేవో పిచ్చి వ్రాతలు వున్నాయి. అవి బాల వ్రాసియుంటుందని గ్రహించారాయన. వాటిని వోపికగా ఒక్కొక్కటే చదవ సాగిన త్రిమూర్తి ముఖం వికసించింది.

5

తన ఎదురుగా నిలుచున్న ఆ యువకుని వంక పరిశీలనగా చూసాడు యిన్‌స్పెక్టర్ మధు ...మిలిటరీ దుస్తులలో గంభీరంగా వున్నాడతను.... అతని కన్నులలో జీవితమంటే నిర్లక్ష్య భావం స్పష్టంగా కానవస్తోంది.

"మిస్టర్ నాగేష్! మధ్యాహ్నం జి.టి. లో వచ్చానంటున్నారు. ఇప్పుడు టైము ఆరు దాటుతోంది. ఇంతవరకు మీరెక్కడ వున్నారు?" అన్నాడు మధు సూటిగా చూస్తూ.

"నాతోపాటు నా మిత్రుడు ఒకతనుకూడా వచ్చాడు. వాడి బలవంతంపైన వాడి యింటికి వెళ్ళి యింతవరకు వుండి వచ్చాను" అన్నాడు నాగేష్.

"మీరు సెలవులో వస్తున్నారా?"

"మొన్న పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో—లాహోర్ ఫ్రంట్‌లో గాయపడ్డాను నేను. మెదడుకు కొద్దిగా దెబ్బ

తగిలింది. గాయాలు నయంకాగానే, ప్రశాంత వాతావరణంలో కొద్ది రోజులు గడిపితే మెదడుకు బలం చేకూరుతుందని డాక్టర్ సంహా యిచ్చాడు. అందుకే నెల్లాళ్ళ సెలవు గ్రాంట్ చేసి నన్ను యింటికి పంపించారు అధికారులు."

"ఈ విషయం మైథిలికి తెలుసా?"

"వచ్చేముందు టెలిగ్రాం యిచ్చాన్ను."

"మిష్టర్ నాగేష్! మైథిలి మాయమైంది!" అన్నాడు మధు అతని ముఖ కవళికలను గమనిస్తూ.

నొసలు చిట్లించా డతను.

"ఇన్‌స్పెక్టర్! ఏమిటి మీరంటున్నది?" అన్నాడు.

"ఈ రోజు మధ్యాహ్నం నుండి మైథిలి కనిపించడం లేదు " మధు అన్నాడు. "మిమ్మల్ని కలుసుకోవడం యిష్టంలేక మరెక్కడైనా దాక్కుందేమో చెప్పగలరా?"

విచిత్రంగా చూసాడు నాగేష్.

"ఆశ్చర్యంగానే వుంది. ఇన్‌స్పెక్టర్! నా రాకకై ఎదురుతెన్నులు చూసే మైథిలి అలా చేస్తుందంటే నమ్మ లేకుండా వున్నాను" అన్నాడు.

"అఫ్‌కోర్స్ — ఇది నా అభిప్రాయం మాత్రమేనను కోండి" అన్నాడు మధు, "భైరవమూర్తి మీతో చనువుగా వుంటారా?"

"మామూలుగానే వుంటారు."

ఒక నిముషం మౌనంగా వుండిపోయాడు మధు.

"మిస్టర్! మీకు బాల తెలుసా!" అన్నాడు.

"ఎవరు? పనిపిల్ల బాల సంగతా మీరడిగేది?"

"ఔను."

"తెలుసు."

"బాల హత్య చేయబడింది!" అన్నాడు మధు సూటిగా చూస్తూ.

బిత్తరపోయి చూశాడు నాగేష్.

"ఇన్‌స్పెక్టర్! ఏమిటిదంతా? ఈ యింటికేమైనా శని పట్టిందా?" అన్నాడు వుద్వేగంతో.

"అదే తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నాను" అన్నాడు మధు పొడిగా.

మాట్లాడలేదతను.

కాస్సేపాగి — "మిస్టర్ నాగేష్! మద్రాసులోని మీ మిత్రుడి అడ్రసు చెప్పండి" అన్నాడు మధు జేబులోనుండి డైరీ, పెన్నూ తీస్తూ.

6

బాల హత్య జరిగిన తోటలోని చిన్న గదికి సమీపంలో వుంది టూల్‌రూమ్. నేలమాళిగవలె వున్న ఆ గదిలోనుండి మైథిలి శవాన్ని బయటకు తీసుకువచ్చారు పోలీసులు. శవం నుండి దుర్గంధం వస్తోంది. శవం తీరునుబట్టి మరణం సంభవించి వారం రోజులవుతుందని గ్రహించారు డిటెక్టివ్ త్రిమూర్తి.

హాల్లో వుంచబడిన మైథిలి శవం చుట్టూ—డిటెక్టివ్‌లు, పోలీసులు కాక భైరవమూర్తి, హవల్దార్ నాగేష్, ప్రసాదరావు, లాయర్ చంద్రశేఖరం, ఆనంద్, రమాదేవి, వాణి మొదలగువారు మూగియున్నారు.

భైరవమూర్తి వైపు చూసారు త్రిమూర్తి. "భైరవమూర్తిగారూ! శవం తీరు చూస్తుంటే — బహుశా విష ప్రయోగం చేయబడి వుంటుందని తోస్తోంది. అంతేకాదు-మీ భార్య హత్య చేయబడి వారం రోజులు కావచ్చు"

అన్నారు.

విచిత్రంగా చూసాడు భైరవమూర్తి.

"మీరు చెబుతున్నది నాకు బోధపడడంలేదు. ఈ రోజు మధ్యాహ్నం వరకు జీవించియున్న నా భార్య వారంరోజుల క్రితం మరణించడం ఎలా సాధ్యం?" అన్నాడు.

ఏదో అనబోయారు త్రిమూర్తి.... అంతలోనే టెలిఫోన్ మ్రోగింది. చటుక్కున దానిని సమీపించి, రిసీవరు అందుకున్నారాయన.

"హలో!...." అని, "యస్....స్పీకింగ్—" అన్నారు వెంటనే.

దాదాపు అయిదునిముషాలపాటు మౌనంగా వింటూ వుండిపోయారాయన. తర్వాత రిసీవర్‌ను హుక్ మీద పెట్టి, శవం వద్దకు తిరిగి వచ్చారు.

"ఇనస్పెక్టర్! భైరవమూర్తిని అరెష్టు చెయ్యి!—" అన్న త్రిమూర్తి గంభీర కంఠస్వరం ఆ గదిలో ప్రతిధ్వనించింది.

ఉలిక్కిపడ్డారంతా.

"త్రిమూర్తిగారూ! ఏమిటిది?" అన్నాడు భైరవమూర్తి కంగారుగా.

"నీ భార్య మైథిలి, పనిపిల్ల బాలను హత్య చేసిన నేరానికి నిన్ను ఆరెష్టు చేయమంటున్నాను, మిస్టర్!" అన్నారు త్రిమూర్తి గంభీరంగా.

"ఆఁ! .. నా భార్యను నేను హత్య చేయడమేమిటి? బాలను చంపితే నాకేమి వొరుగుతుంది? మీకేమైనా మతిపోయిందా?" అంటూ కోపంగా అరిచాడు భైరవమూర్తి.

అచ్చట నున్నవారంతా ఆశ్చర్యంతో అవాక్కయి చూస్తూ వుండిపోయారు.

"మిస్టర్ భైరవమూర్తీ!" డిటెక్టివ్ త్రిమూర్తి కంఠం గంభీరంగా ధ్వనించింది—"సామాన్యుడవైన నీకు అదృష్ట వశాత్తు స్థితిమంతురాలైన మైథిలితో పరిచయమయింది. ఎలాగో నీ మాయలో పడి ఏడాది క్రితం నిన్ను వివాహ మాడింది. దాంతో గొప్ప స్థితిమంతుడవయ్యావు. ధనవంతు లలో ఒకడుగా చెలామణి యవుతున్నావు.

"కానీ, నీవు మైథిలిని చేసుకునేందుకు ముందుగానే నీ ప్రియురాలు నాగమణితో తాంబరంలో వుంటున్నావు. మైథిలి ధనానికి ఆశించి మాత్రమే ఆమెను వివాహమాడిన నువ్వు, సమయం చూసి ఆమెను మట్టుపెట్టాలని చూసావు. చివరకు వారం క్రితం విషప్రయోగంతో మైథిలిని చంపావు. తరువాత ఆమె స్థానంలో నీ ప్రియురాలు నాగ మణిని మైథిలి రూపంలో ప్రవేశపెట్టావు. తరువాత వీలు చూసుకొని మైథిలి చనిపోయిందని ప్రకటించి అటుపైన నాగమణిని అసలు రూపంలో భార్యగా స్వీకరించాలను కున్నావు.

అయితే, వారం నుండి మైథిలిలో వచ్చిన మార్పులను వంటామె రాజమ్మ, పనిపిల్ల బాల గమనించారు. కాని యెప్పుడో మీ సంభాషణలను బాల ఆలకించివుంటుంది. అందుకే తనకు లభించిన ఒక అట్టమీద సుద్దతో తాను తెలుసుకున్న రహస్యాలను వాక్యాల రూపంలో క్లుప్తంగా వ్రాస్తుండేది.

బాల దురదృష్టవశాత్తు ఒకరోజు మైథిలి రూపంలోని నాగమణి ఆ యట్టను చూడడం సంభవించింది. తమ రహస్యం బాల పసిగట్టిందేమోనని భయపడిందామె. ఆ సంగతి విన్న నీవు ఎలాగైన ఆ పిల్ల నోరు మూయకుంటే

ప్రమాదమని ఎంచావు.

ఈ రోజు మీ ప్రథమ వివాహ వార్షికోత్సవం సాకుతో 'మర్డర్ హంట్' అన్న గేమ్‌ను ఏర్పాటుచేశావు. అందులో బాలను శవంగా నటించమని సలహా యిచ్చావు. సమయం చూసుకొని, ఎవరూ అచ్చటికి చేరుకొనకముందే బాలను రుమాలుతో గొంతుకు బిగించి చంపేశావు....

ఇంతలో ఎదురుచూడని విధంగా మైథిలి అన్న హవల్దార్ నాగేష్ వస్తున్నట్లు టెలిగ్రాం అందింది. దానిని చూడగానే నాగమణి ముఖం వెల వెల బోవడాన్ని వంటావిడ చూసింది. నిజానికి నాగేష్ రాక మైథిలికి పండుగవంటిదే! కాని నకలు మైథిలికి అతనిరాక గుండెలమీది కుంపటిలా పరిణమించింది.

ఇంతవరకు యెవరికీ అనుమానం కలుగకుండేలా అతి సమర్థతో మైథిలి పాత్రను పోషించింది నాగమణి. కాని చిన్నప్పటినుండి మైథిలితో పరిచయమున్న నాగేష్ తన్ను గుర్తించవచ్చునని భయపడిందామె. మీరిద్దరూ యోచించారు. ఫలితంగా మైథిలి మాయమైంది! ఇది మీరు వేసుకున్న ప్లాను—"

"కథ చక్కగా అల్లారు....ఇలాగే ఎందరో నిర్దోషులను మీరు ఉరికంబ మెక్కిస్తున్నారో-ఇప్పుడర్థం చేసుకోగలుగుతున్నాను" అన్నాడు భైరవమూర్తి మధ్యలోనే వ్యంగ్యంగా.

"పూర్తిగా విను, మిస్టర్!" త్రిమూర్తి అన్నారు. "క్రొత్తవ్యక్తులయితే పెనగులాడివుండేది బాల. కాని అటువంటి లక్షణాలేవీ కనిపించలేదు. అంటే యెవరో పరిచితులే ఆమెను చంపారన్న మాట. ఏవో మాటలు

చెబుతూ ఆమెను సమీపించావు నువ్వు. ఆదమరపుగా వున్న ఆ పిల్ల మెడలోని రుమాలును బిగించి చంపే సావు....

"వంటావిడ రాజమ్మను ప్రశ్నించి, యీ మధ్య మైథిలిలో యేదో వూహింపజాలని మార్పు వచ్చినట్లు తెలుసుకున్నాను. బాల గదిలో నున్న అట్టను చూశాను. దానిపై "మారిపోయిన మైథిలమ్మ.... మోసపోయిన మైథిలమ్మ...." అన్న వాక్యాలు నన్ను ఆకర్షించినయ్....

మైథిలి పెట్టె యడుగున కొన్ని పాత ఉత్తరాలు, ఒక ఫొటో దొరికినయ్. ఎవరో యువతి, నీవూ కలిసి తీయించుకున్న ఫొటో అది. ఉత్తరాలు నాగమణియన్న యువతికి నీవు వ్రాసినవి. అవి మైథిలి పెట్టెలోని కెలా వచ్చినయ్! వాటి మూలంగా నా ఆలోచనల కొక రూపం ఏర్పడింది.

పెట్టెలో దొరికిన ఫొటో, ఉత్తరాలలోని నాగమణిదయి వుంటుందని వూహించాను. ఒక అపరిచిత వ్యక్తి మధ్యాహ్నం భవనంలో నుండి బయటకు వెళ్ళిందని ఘూర్కా మూలంగా తెలుసుకున్నాను. పెట్టెలో దొరికిన ఫొటోలోని నాగమణిగా ఆమెను గుర్తుపట్టాడతను. నా అనుమానాన్ని తీర్చుకునే నిమిత్తం ఉత్తరాలలోని నాగమణి అడ్రసుకు సబిన్‌స్పెక్టర్ మురళిని పంపడమయింది.

ఈ లోపున రమాదేవి ద్వారా ఒక ముఖ్యమైన విషయాన్ని తెలుసుకున్నాడు మా మోహన్....ఆధారాల ననుసరించి హత్యాప్రదేశం దరిదాపులకు చేరుకోగలిగిన రమాదేవికి అనుకోని సంఘటన యొకటి ఎదురయింది. నీవూ, మైథిలీ అక్కడున్న టూల్ రూమ్‌లో ప్రవేశించడాన్ని

కళ్ళారా చూపిందామె. తరువాత కాసేపటికి మైథిలికి బదులుగా మరో యువతి సీతో టూల్‌రూమ్ నుండి బయటకు వచ్చింది. ఆ వింతకు విస్తుపోయింది రమాదేవి. అంతలోనే ఆ యువతి భవనం వైపు వెళ్ళిపోవడాన్ని చూసింది. నీవు మాత్రం బాల వున్న యింటికి వెళ్ళావు. మరో రెండు నిముషాలలో బయటకు వచ్చిన నీవు వడివడిగా అడుగులు వేసుకుంటూ చెట్లచాటున కలిసిపోయావు....”

“శుద్ధ అబద్ధం. మీ అసభ్యత నిక సహించేది లేదు.... మీ పైన పరువునష్టం దావా వేస్తా!” అంటూ కోపంగా అరిచాడు భైరవమూర్తి.

గంభీరంగా నవ్వాడు త్రిమూర్తి.

“మిస్టర్! ఇప్పుడు నాకు వచ్చిన ఫోన్‌కాల్ ఏమిటనుకున్నావ్? సబిన్‌స్పెక్టర్ మురళి తాంబరం వెళ్ళి నాగమణిని కలుసుకున్నాడు. మొదట బొంకినా, దబాయించేసరికి ఆమె తన నేరాన్ని అంగీకరించి—జరిగినదంతా చెప్పివేసిందట ...కాసేపటిలో ఆమె యిక్కడకు తీసుకురాబడుతుంది—”

అని త్రిమూర్తి అంటున్నంతలోనే, ఒక యువతితో అచ్చట ప్రవేశించాడు సబిన్‌స్పెక్టర్ మురళి.

నాగమణిని చూస్తూనే కొయ్యబారిపోయాడు భైరవమూర్తి,

“ఎన్ని తెలివితేటలు వుపయోగించినా, నేరస్థులు తప్పించుకోలేరు మిస్టర్!” అన్నారు డిటెక్టివ్ శ్రీ త్రిమూర్తి గంభీరంగా.

(పదహారేళ్ళనాటి 'అపన' కథ) □

పెళ్ళి డబ్బు



బి. రాజేశ్వరి

"ఈ వార్త చూశావా? పాపం, హాయిగా హనీమూన్ గడపాలని సిటీ కొచ్చిన భార్యా భర్తల్ని కిడ్నాప్ చేసి భర్తని చంపి భార్యను అమానుషంగా అయిదుగురు దుండగులు మానభంగం చేశారట! ఎంత ఘోరం!" అన్నాడు డిటెక్టివ్ శేషు.

డిటెక్టివ్ వాసు నోరు చప్పరించి, "ఆహా, అది వార్తే కాదు. ప్రతినిత్యం దేశంలో ఏ మూల చూసినా మాన భంగాలే! మొదట్లో యీ వార్త హాట్ హాట్ కేక్‌లా

వుండేది. కాని యిప్పుడు ఉప్పులేని పప్పులా చప్పగా నిస్సారంగా వుంది! సో ఇటీజ్ నాటెటాల్ సెన్సేషనల్ న్యూస్, లీవిట్!" అన్నాడు.

శేషు నీరుకారిపోయాడు.

"దేశంలో యిన్నిరకాల నేరాలు జరుగుతున్నాయి. ఇంతమంది నేరస్థులు రోజు రోజుకీ పుట్టగొడుగుల్లా పుట్టు కొస్తున్నారు. అయినా మనకి గిరాకీలేదు. కారణం ఏమి టంటావు?" అన్నాడు.

వాసు కాసేపు దీర్ఘంగా ఆలోచిస్తూన్నట్టు ఫోజుపెట్టి "బహుశా, ఈ గ్రేట్ డిటెక్టివ్స్ వాసు అండ్ శేషుల ఘనత వాళ్ళదాకా పాకివుండదు. సో ఇటీజ్ లాక్ ఆఫ్ పబ్లిసిటీ! మనం బాగా పాప్యులర్ కావాలంటే ఓ మంచి కేసు దొరకాలి. దాన్ని మనం ఎవరూ వూహించలేని విధంగా పరిశోధించి పరిష్కరించాలి! దెన్, దానంతట అదే వస్తుంది పబ్లిసిటీ! అదే పాప్యులారిటీకి ఫస్ట్ స్టెప్!" అన్నాడు.

"యు ఆర్ రైట్! కాని మన ప్రతిభ నిరూపించుకోవ టానికి సరయిన అవకాశమే రావడంలేదే! నెల దాటి పోయింది మన ఏజన్సీ స్థాపించి! కాని ఇంతదాకా బోణీయే కావడంలేదు! కనీసం చిన్న చిన్న దొంగల్ని పట్టే కేసులు కూడా రాలేదు ఏం చేస్తాం?" దిగులుగా అన్నాడు శేషు.

"నిరాశావాదం వద్దు! మానవుడు ఆశాజీవి. ఆశ లేనిదే మానవ మనుగడే లేదు, సో లెటజ్ ప్రే గాడ్ ఫర్ గుడ్ డేస్!" వాసు మందహాసంగా అన్నాడు.

సరిగ్గా అదే సమయంలో అధునాతనంగా అలంకరించు కున్న ఓ యువతి లోపలికి వచ్చింది.

"రండి, రండి!" అంటూ ఆహ్వానించాడు వాసు లేచి

నిలబడి.

"వాసు అండ్ శేష డిటెక్టివ్ ఏజన్సీయే కదండీ!" అన్నదామె మృదుమధురంగా, వీణ మీటినట్టున్న ఆ కంఠ స్వరానికి ముగ్ధుడైపోయాడు శేష.

"ఎస్సెస్ ఇదే మేడమ్! అయామ్ శేషూ అండ్ హి ఈజ్ డిటెక్టివ్ వాసూ!" అన్నాడు పరిచయం చేస్తూ.

ఆమెలో అందం కన్న ఆకర్షణ, అలంకరణ అధిక పాలలో కనిపించటం ఇద్దరూ గమనించారు.

ఆమె కూచుంటూనే, "నాకు మా వారి నుండి విడాకులు కావాలి!" అన్నది.

డిటెక్టివ్ లిద్దరు త్రుళ్ళిపడి చూశారు.

"అదేమిటమ్మా, మీరు విడాకులకోసం వచ్చినట్టయితే యిది సరైన అడ్రసు కాదే! ఏ లాయరుగారినో సంప్రదించండి. మా ఇద్దరికి 'లా' తెలియకపోదుగాని లాయర్లం కాదు" అన్నాడు శేష.

"ఆ విషయం నాకు తెలుసు. లాయర్లకు తగిన కారణం చూపించాలి. లేకుంటే కోర్టు విడాకులు మంజూరు చెయ్యదు!" అన్నదామె.

"దానికేం, ఉన్న కారణమేదో చూపించేస్తే సరి. ఇంతకీ మీ ఆయన తాగుబోతా? తిరుగుబోతా?"

"సంసార జీవితానికి అనర్హుడా? మిమ్మల్ని హింసిస్తున్నాడా?"

ఆమె చెవులు మూసుకుంది. "ఇవేవీ కాదు. ఆయన శ్రీరామచంద్రుడంత మంచివాడు. నెమ్మదస్తుడు. వచ్చే జీతం ప్రతిపైసా నా చేతిలోనే పెడతాడు. నన్ను బాగానే చూసుకుంటాడు. నా మీద ఈగ వాలనివ్వడు. నేను గీచిన గీటు దాటడు. నేనన్నదానికి మారు మాట్లాడడు. నేను 'కా'

అంటే 'కా' 'కీ' అంటే 'కీ' అంటాడు" ఊపిరి తీసు కోవటానికి ఓ క్షణం ఆగింది.

వాసు, శేషు నిలువు గుడ్లేసుకుని చూస్తున్నారు.

"మరయితే విడాకులు దేనికమ్మా?" అన్నారు ఒకేసారి.

"నా భర్త యిలాంటి అసమర్థుడై వుండకూడదు. నా మీద అధికారం చలాయించాలి. అవసరమైతే నన్ను కొట్టాలి, హింసించాలి. నన్ను నోరు తెరవనివ్వకుండా సమాధానం చెప్పాలి. ఇవ్వన్నీ చెయ్యనివాడు భర్తే కాడు నా దృష్టిలో! అందుకే యీ చేతకాని భర్తతో జీవితం మొహం మొత్తింది. అతనిమీద తప్పుడు సాక్ష్యాలు బనా యించి కోర్టుకెక్కించి, అతనిదే తప్పని నిరూపించి విడా కులు సంపాదించాలి.

అందుకా వలసిన సాక్ష్యాలు మీరు సంపాదించి పెట్టాలి. అందుకే మీ ఏజన్సీని వెతుక్కుంటూ వచ్చాను" అన్న దామె వేనిటీ బాగ్‌లోంచి హేండ్ కర్చీఫ్ తీసి మొహం తుడుచుకుంటూ.

"మేడమ్, మీరు వెంటనే లేచి బయటికి వెళ్ళండి!" అన్నాడు శేషు వీరభద్రుడి అవతారం దాల్చి.

అతని తీవ్రతకు బెదిరిపోయి చటుక్కున లేచి నిలబడిం దామె. వాసు వారించబోయాడు. కాని, శేషు ఎవర్నీ లెక్కచేసేలా లేడు.

"ఇంత మంచి భర్త దొరకాలని కన్నెపిల్లలు ముక్కోటి దేవతలకు మొక్కుకుంటుంటారు. కాని నీలాంటి మూర్ఖులు సిద్ధాన్నాన్ని కాలదన్నుకుంటారు తమ అజ్ఞానంతో! ఇలాంటి కేసులు టేకప్ చేసేటంత హీనస్థితికి మా డిటెక్టివ్ ఏజన్సీ దిగజారిపోలేదు. ప్లీజ్ గెటవుట్!" అన్నాడు శేషు.

మరుక్షణంలో ఆమె అక్కడ లేదు.

2

ఆయన చాలా విచారంగా వున్నాడు. కొండంత భారాన్ని నెత్తిన మోస్తున్నవాడిలా బరువుగా అడుగులు వేస్తూ లోనికొచ్చాడు.

వాసు సాదరంగా ఆహ్వానించాడు. "రండి, రండి! అలా కూచోండి.... చెప్పండి, మా వల్ల ఏ సాయం కోరి వచ్చారు?" అనడిగాడు.

శేషు ఆయనవంక పరీక్షగా చూశాడు.

ఆయనకు దాదాపు యాభై ఏళ్ళుంటాయి. తెల్లటి పంచె దానిమీద తెల్లటి కమీజు పైన కండువా ధరించి వున్నాడు. చామన ఛాయతో అనుభవంతో పండిన జుట్టుతో, నిలువెత్తు విగ్రహంతో చూడగానే గౌరవం పుట్టించే పర్సనాలిటీతో చూపరులను యిట్టే ఆకర్షించగలిగేలా వున్నాడు.

అయితే నలిగిన గుడ్డలు, కళ్ళకింద నల్లటి చారలు ఆయన ఏదో సమస్యల వలయంలో చిక్కుకున్నట్టు చెప్పకనే చెప్తున్నాయి. ఆయన వాళ్ళిద్దరికీ యెదురుగా కూచున్నాడు.

"బాబూ! మీ రిద్దరు నా పరువు కాపాడాలి! రెండు రోజుల్లో అమ్మాయి పెళ్ళి పెట్టుకున్నాను. ఇంతలో అనుకోని ఆపద వచ్చిపడింది. అమ్మాయి పెళ్ళికే ఆటంకం వచ్చేలా వున్నది" అన్నా డాయన.

శేషు జాలిగా చూశాడాయన వంక.

వాసు ముందుకు వంగి, "చెప్పండి సార్! ఏమిటి మీ కొచ్చిన ఆపద?" అనడిగాడు.

ఆయన దీర్ఘంగా నిట్టూర్చి, "ఎల్లుండి మా అమ్మాయి వివాహం బాబూ! కట్నం పదిహేను వేలు యివ్వటానికి నిర్ణయమయింది. కట్నానికి, పెళ్ళి ఖర్చులకి మొత్తం

యిరవై ఐదు వేలు కూడబెట్టాను. నిన్ననే డ్రా చేసి తెచ్చాను. ఈ రోజు ఉదయం చూద్దునుగదా, పెట్టె ఖాళీ! తాళాలు వేసినవి వేసినట్టే వున్నాయి, డబ్బు మాయ మయింది" అన్నాడు.

వాసు తల పంకించి, "మీ యింట్లో ఎవరెవరుంటు న్నారు? అయ్‌మీన్ ఫామిలీ మెంబర్స్...." అన్నాడు.

"ముందుగా నా గురించి పరిచయం చేసుకోనివ్వండి. నా పేరు పరంధామయ్య. హైస్కూలు హెడ్‌మాస్టరుగా పని చేస్తున్నాను. నాకు ఇద్దరు కూతుళ్ళు, ఓ కొడుకు. ఆడ పిల్లలిద్దరూ పెద్దవాళ్ళు. అందులో పెద్దమ్మాయికి ఎల్లుండి వివాహము నిశ్చయించాము. కొడుకు పదిహేనేళ్ళవాడు చదువుకుంటున్నాడు. నా భార్య, నేను — ఐదుగురం కుటుంబ సభ్యులం!" అన్నాడు పరంధామయ్య—ఆ పెద్ద మనిషి.

డిటెక్టివ్ లిద్దరూ శ్రద్ధగా వింటున్నారు.

"ప్రస్తుతం మీ యింట్లో మీ మెంబర్సు కాక బయటి వాళ్ళెవరయినా వున్నారా?" అన్నాడు వాసు.

"నలుగురున్నారు బాబూ! నిన్న యిద్దరు, మొన్న యిద్దరు వచ్చారు. దగ్గరవాళ్ళులెండి. అందుకే రెండు రోజులు ముందుగానే వచ్చి చేరారు."

"వివరాలు చెప్పండి."

"నా భార్య తమ్ముడు, నా భార్య మేనత్త మొన్న వచ్చారు. నిన్న మధ్యాహ్నం నా తమ్ముడు అతని భార్య వచ్చారు. ఈ రోజు అంటే దొంగతనం జరిగిపోయాక యింకా మరి కొంతమంది బంధువులు వచ్చారు. పిల్లలతో కూడా."

"అయితే ఇప్పుడు ఈ నలుగురినే అనుమానించాల్సి

వస్తోంది.... మీ అడ్రెసు, వివరాలు చెప్పండి!" అన్నాడు శేషు నోట్ బుక్ బాల్ పెన్ అందుకుంటూ.

పరంధామయ్య చెప్పగా వివరాలు రాసుకున్నాడు.

"బాబూ! ఎల్లుండే నా బిడ్డ పెళ్ళి. ఓ పక్క పెళ్ళి పనులు రెండో పక్క బంధువుల దాడి. ఇప్పుడిలా యీ అవాంతరం. నా గుండె పగిలిపోవటానికి సిద్ధంగా వుంది. డబ్బు దొరక్కపోతే పెళ్ళి ఆగిపోతుంది. నా బిడ్డ జీవితం నాశనమైపోతుంది. నేనే నుయ్యో, గొయ్యో చూసుకోవాలి!" పై కండువాతో కళ్ళొత్తుకున్నాడు పరంధామయ్య.

"మీరు విచారించకండి సార్! మీ డబ్బు ఎక్కడికీ పోదు. ముందీ సంగతి చెప్పండి! ఈ నలుగుర్లో ఎవరైనా నిన్న రాత్రి నుండి యీ రోజు ఈ క్షణం వరకు బయటికి వెళ్ళారా?"

"నేను వచ్చేవరకు ఎవరూ వెళ్ళలేదండి. నేనిలా వచ్చాక ఎవరైనా వెళ్ళారేమో తెలీదు!"

"సరే! ఆ విషయం వదిలేద్దాం. ముందు ఈ నలుగురి గురించి—వాళ్ళ అలవాటు, పద్ధతులు గురించి, వాళ్ళ స్వభావాల గురించి వివరంగా చెప్పండి!" అన్నాడు శేషు.

"నా భార్య తమ్ముడు పేరు వేణు. ఇరవై రెండేళ్ళు. ఇంకా పెళ్ళి కాలేదు. కుర్రవాడు బి.కాం. చదువుతున్నాడు. బుద్ధిమంతుడే! అతనికిలాంటి పాడుబుద్ధులు లేవు. వాళ్ళ మేనత్త రంగమ్మ. తల చెడిన ఆడది. నాలుగేళ్ళుగా మా అత్తారింట్లోనే వుంటుంది. ఆమె కూడా మంచి మనిషే. బోళా మనిషి. పిల్లలు లేరు. ఆస్తి అంతా ఆమెకే సంక్రమించింది భర్త నుండి. ఆ ఆస్తిపాస్తుల వ్యవహారం మా మామగారే చూసుకుంటున్నారు. మా తమ్ముడికి రెండేళ్ళ క్రితమే పెళ్ళయింది. ఇంకా పిల్లలు లేరు. అతని

పేరు ప్రకాశం. భార్య పేరు వనజ. ఆమె కూడా మంచి కుటుంబంలోని పిల్ల. ఇంటర్ వరకు చదువుకుంది. ఇవీ వాళ్ళ గురించిన వివరాలు!"

"మీరు ఎవర్ని అనుమానిస్తున్నారు?"

"నా మటుకు నాకు వీళ్ళెవరి మీదా అనుమానం లేదు బాబూ!"

"మరి ఇంకెవరి మీద వుంది?"

"ఎవరి మీదా లేదు."

శేషు తల పట్టుకున్నాడు. "మరి డబ్బుకి కాళ్ళొచ్చి యినప్పెట్లోంచి పారిపోదు కదండీ! ఎవరో తీసేవుండాలి కదా!" అన్నాడు.

"తీసిన మాట నిజమే బాబూ! కాని ఎవర్నీ అనుమానించలేను. అందరూ మంచివాళ్ళు, ఆత్మీయులు, దగ్గర బంధువులు ఎవర్ని అనుమానించేటట్టు?"

వాసు, శేషు ముఖాలు చూసుకున్నారు.

తర్వాత వాసు, "సరే, మీరు వెళ్ళండి. ఓ గంట తర్వాత మేమిద్దరం మీ యింటికొస్తున్నాం. మీ స్నేహితులమనీ పెళ్ళికి వచ్చామనీ మీ బంధువులకి చెప్పండి. మేము కూడా మీ యింట్లో మకాం పెట్టడానికి సిద్ధంగా వస్తాం.

ఈ లోపల ఓ పని చెయ్యండి ఈ రోజు వచ్చిన బంధువుల్ని వాళ్ళ తాలూకు పిల్లపాపల్తోపాటు సెపరేట్ చెయ్యండి. అంటే వాళ్ళని వేరే మరో చోటికి, సపోజ్ విడిదిందికి బదిలీ చెయ్యండి. మీ యింట్లో అంటే పెళ్ళి జరిగే యింట్లో మీ కుటుంబ సభ్యులు, యీ నలుగురు బంధువులు తప్ప మరెవరూ లేకుండా జాగ్రత్త తీసుకోండి" అన్నాడు.

"అలాగే బాబూ! వెంటనే ఆ పనిలో వుంటాను. మీ

ఫీజు విషయం....?"

"అయిదువందలు. అడ్వాన్సు అక్కరలేదు. పనయ్యాక ఇవ్వండి."

3

"రండి, రండి! నాలుగురోజులు ముందుగా రావద్దా? పరాయివాళ్ళలాగా మీరూ పెళ్ళి దగ్గిరయ్యాక వస్తారా?" అంటూ ఆహ్వానించాడు పరంధామయ్య.

వాసు, శేషు ఏర్‌బ్యాగ్‌లు కింద పెడుతూ, "అప్పుడే బంధువులంతా వచ్చేసినట్టుందే!" అంటూ పందిట్లోని కుర్చీల్లో ఆసీనులయ్యారు.

పరంధామయ్య ఒక్కరొక్కరుగా తన కుటుంబ సభ్యుల్ని పరిచయం చేశాడు. తమ్ముడిని, మరదలిని, బావ మరిదిని, భార్యా మేనత్తని కూడా క్యాజువల్‌గా పరిచయం చేసినట్లు చేశాడు.

వాసు, శేషు వాళ్ళ నలుగుర్నీ పరీక్షగా చూశారు. పైకి మామూలుగా విష్‌చేశారు.

ఆ సాయంత్రం ఊరి బయటకు షైరుగా వెళ్తున్నట్టు చెప్పి వాసు, శేషు బయటపడ్డారు.

"నువ్వు కనుగొన్న ఆసక్తికరమైన విషయాలేమిటి?" అన్నాడు వాసు.

"ఈ దొంగతనం చెయ్యటానికి ఎక్కువ ఆస్కారం పరంధామయ్యగారి మరదలికే వున్నట్టు అనిపిస్తోంది."

"అదెలా?"

"ఆమె—వనజ కదూ పేరు—చీటిమాటికీ పెళ్ళికి వచ్చిన అమ్మలక్కల బంగారు నగల గురించి ఎంక్వయిరీ చేస్తోంది. ఎన్ని కాసులు, ఎన్ని తులాలు—ఎంత ఖర్చ యిందీ, ఎక్కడ చేయించారు అని అడుగుతోంది. ఆమె

భర్త సామాన్య గుమాస్తా. అతను ఆమెకు నగలు యెలా చేయించగలడు? కాబట్టి వనజే సమయం చూసి, బావగారు దాచిన పాతికవేలు కాజేసి వుంటుంది. దానితో ఏయే నగలు చేయించుకోవాలో ప్లాన్ చేసుకుంటుంది. వనజే దొంగ!" అన్నాడు శేషు.

"వనజే కాకపోవచ్చు. వనజ భర్తచేత అ పని చేయించి వుండొచ్చు కదా! ఆడదానికి అంత ధైర్యముండదు, భర్తని బ్రతిమాలో బామాలో, చస్తానని బెదిరించో తన కోరిక నెరవేర్చుకొని వుంటుంది! ప్రకాశమే దొంగ కావచ్చు."

"నో, నో. అతను చాలా సౌమ్యుడు. నువ్వు గమనించావో లేదో అన్నగారి పిల్లలంటే అంతులేని ప్రేమ, వాత్సల్యం అతనికి! అందునా యిప్పుడు పెళ్ళి కాబోయే పిల్లంటే యింకా చాలా ప్రేమ! చేజేతులా స్వార్థంకోసం ఆ పిల్ల పెండ్లు జీవితాన్ని బలిచెయ్యడు. మరో కారణం కూడా వుంది. అతను చిన్ననాటి నుంచీ అన్న వదినల పెంపకంలో పెరిగాడు. తండ్రి పోయాక బాధ్యత తీసుకుని తనకు చదువు చెప్పించి ప్రయోజకుడిని చేసిన అన్నంటే అతనికి భయము, భక్తి, గౌరవం వున్నాయి—కాబట్టి ప్రకాశం దొంగ కాదు."

"సరే, ప్రస్తుతానికి వనజని లిస్టులో మొదట వేసుకుందాం. ఇంకా యిద్దరున్నారు. పరంధామయ్యగారి భార్య మేనత్త రంగమ్మ, ఆయన బావమర్ది వేణు. వాళ్ళ విషయమేమిటి? నీ కేస్ స్టడీ ఏమిటి?" అడిగాడు వాసు.

"వేణు చాలా బుద్ధిమంతుడయిన కుర్రాడు. ఇంకా యెలాంటి బాదరబందీ లేని విద్యార్థిదశలో వున్న పిల్లాడు.

అలాంటివాడికి దొంగతనం అంటగట్టడం మహా పాపం. అతనితో మాట్లాడిన కొద్ది నిమిషాల్లోనే అది గ్రహించాను. అలాంటి కుర్రాళ్ళు యీ రోజుల్లో చాలా అరుదుగా వుంటారు."

"ఊఁ! సరే, మరి రంగమ్మగారి సంగతి?...."

"ఆమె చాలా ఆస్తిపరురాలే గాని మహాపినారి. పూర్వ సంవాసిని. ఆమెకు నోటి దుసురుతనం కూడా హెచ్చుగానే వున్నట్టుంది. చాలా పెళుసుగా మాట్లాడుతుంది. పరంధామయ్యగారి భార్య మీద చాలా అధికారం ధాష్టీకం చెలాయిస్తోంది. పిల్లల్ని కూడా దగ్గరికి తీసుకోవటంలేదు. అంతే కాదు ఆమెకు చేతివాటం కూడా జాస్తిగానే వుంది. చిన్న చిన్న స్పూనులు, స్టీలు గ్లాసులు తనతో తెచ్చిన పెద్ద సంచీలో జాగ్రత్తపెట్టడం నేను చూశాను. ఆ దొంగ చూపులు, ఆ లేకితనం, వెకిలి మాటలు చూస్తుంటే యీ దొంగతనం ఆమె పనే కావచ్చుననిపిస్తోంది. నా రెండో అనుమానితురాలు రంగమ్మ!" అన్నాడు శేషు.

"యు ఆర్ రైట్! నా ఊహకు చాలా దగ్గరగా వచ్చావు. నే నయితే ఫస్టునెంబర్ రంగమ్మ, నంబర్ టూ వనజ—అని ఇమేజిన్ చేస్తున్నాను. ఎక్కువ అవకాశాలు రంగమ్మకే వున్నాయి" అన్నాడు వాసు.

"అయితే ఆమె సంచీ, గుడ్డలున్న పెట్టె చెక్ చేద్దామా?"

"కంగారుపడొద్దు. రంగమ్మగారంటే పరంధామయ్యగారికి చాలా గౌరవం. అమెను అనుమానించినట్టు వాసన తగిలినా రంగమ్మ ఊరుకోదు. అతని యిల్లు పీకి పందిరి వేస్తుంది—పెళ్ళిపందిరితో పాటు జంటగా వుంటుందని! అదీగాక ఆమె తన ట్రంకుపెట్టెను సంచీని వెయ్యి కళ్ళతో

కాపాడుకొంటూ వుంటుంది. సమయం చూపి చెక్ చెయ్యాలి!"

"మరి వనజ విషయం....?"

"వాళ్ళ సూట్ కేస్‌లు కూడా పరంధామయ్యకి చెప్పి ఏ అర్ధరాత్రో చెక్ చేయించాలి! అందుకే తక్కిన బంధువుల్ని విడిదియింటికి మార్పించెయ్యమన్నాను. మనకి యిన్వెస్టిగేషన్ సులభమవుతుం దిప్పుడు!"

"అయితే సమయం ఎక్కువ లేదు. ఈ రాత్రికే మన చెకింగ్ పని పూర్తి చేసుకోవాలి."

4

"మీ కోసం మా బావగారు అడుగుతున్నారు. ఇంతదాకా ఎక్కడికి వెళ్ళారు—భోంచెయ్యకుండానని!" అంటూ ఎదురొచ్చాడు వేణు — పరంధామయ్య బావమరిది.

వాసు, శేషు స్నేహపూర్వకంగా నవ్వారు.

ఈ లోపల పరంధామయ్యగారు లోపలి నుండి వస్తూ, "అరె, భోజనాల టైం దాటిపోతోంది, యెక్కడికి వెళ్ళారు?" అన్నాడు. తర్వాత వేణు వంక తిరిగి, "పురోహితు డిచ్చిన సరుకుల లిస్టు నీ దగ్గిరుండాలి కదా, ఏదీ?" అనడిగాడు.

వేణు జేబునుండి పావురావు సైజు కాగితం తీసి బావకిచ్చే సమయంలో చిన్న పచ్చరంగు కాగితం ముక్క కింద పడింది. శేషు చూపు చురుగ్గా పనిచేసింది. దాన్ని కిందపడ్డుండగానే దానిమీద కాలువేశాడు కనపడకుండా. వేణు యిదేం గమనించలేదు.

"రండి, మీకు భోజనం ఏర్పాట్లు చేసివస్తాను" అంటూ వేణు లోపలికి వెళ్ళిపోయాడు.

శేషు కాలు కింద నించి కాగితం ముక్కను పైకి

తీశాడు.

అది సేవింగ్స్ బ్యాంక్ పే-యిన్-స్లిప్ కౌంటర్ ఫాయిల్. ఇరవై అయిదువేల రూపాయలు డిపోజిట్ చేసినందుకు బ్యాంక్ వారిచ్చిన యినీషియల్ పేమెంట్ స్లిప్!

వాసు చూపులు శేషు చూపుల్తో కలుస్తున్నాయి. శేషు కళ్ళతోనే మెసేజ్ పంపాడు.

ఈ లోపల వేణు బయటికి వచ్చాడు. అతని వెంట యిద్దరు భోజనానికు నడిచారు.

భోజనం కాగానే శేషు వాసును తీసుకుని వీధి చివరి పాన్ షాపుకు వెళ్ళాడు.

"మన అంచనాలు తారుమారయ్యాయి. దొంగ ఎవరో కాదు—సాక్షాత్తు పరంధామయ్యగారి బావమర్ది వేణు! ఈ రోజే డబ్బు మొత్తం బ్యాంక్‌లో తన పేర ఎస్.బి.లో వేసుకున్నాడు" అన్నాడు శేషు.

వాసు యిబ్బందిగా మొహం పెట్టి, "ఈ వూళ్ళో యితనికి తెలిసి బ్యాంక్ కస్టమర్సు యెవరున్నారు? ఇనిషియల్ అకౌంట్ ఓపెన్ చేసేటపుడు బ్యాంక్ కస్టమర్ సంతకం వుండాలి కదా! అదెలా సంపాదించాడు?"

"ఏమో. యీ వూళ్ళో వేణుకు తెలిసిన కస్టమర్స్ ఎవరయినా వున్నారేమో? అయినా, అవన్నీ తర్వాత చూద్దాం. ముందు యీ డబ్బు పరంధామయ్యగారికి చేరే మార్గం చూడాలి!"

"బ్యాంకువాళ్ళు అతనికి చెక్‌బుక్కో, పాస్‌బుక్కో యిష్యూ చేసివుంటారు కదా! అది సంపాదించాలి! చెక్ బుక్ అయితే మన పని సుళువవుతుంది."

"అంటే యీ రాత్రి వేణుకు సంబంధించిన సూట్

కేస్‌లు, బ్యాగ్‌లు బాగా పరిశోధించాలి! ఎక్కడికి పోతా డిక? పోలీసుకు అప్పగిస్తామంటే సరి, వెంటనే దారి కొస్తాడు!"

5

రాత్రి మూడుగంటల సమయం.

వేణు చటుక్కున లేచాడు. అప్పటిదాకా నిద్రపోవటం లేదని శేషు, వాసు గమనిస్తూనే వున్నారు. వేణు పడక పక్కనే తమ పడకలు ఏర్పాటు చేసుకున్నారు. వేణు తన సూట్‌కేస్‌ను, ఏర్‌బ్యాగ్‌ను తను పడుకున్న మంచం పక్కనే పెట్టుకుని వుండటం యిద్దరి దృష్టినీ దాటిపోలేదు.

శేషు వాసుకి సైగ చేశాడు. వాసు వేణుని అనుస రించాడు.

శేషు ఆలస్యం చెయ్యకుండా సూట్‌కేస్‌మీదికి లంఘిం చాడు. వేణు వెనక్కి తిరిగి రాకుండా వాసు అతన్ని మాటల్లో పెట్టి, తన పని పూర్తయ్యేవరకు ఆలస్యం చేస్తా డని శేషుకి తెలుసు!

వాసు వేణు వెనకనే అనుసరించి వెళ్ళాడు.

వేణు సరాసరి తన అక్కగారి గదిలోకి వెళ్ళాడు. అక్కడ పరంధామయ్యగారి భార్య రోజంతా పెళ్ళి పనుల్లో అలసిపోయి నిద్రిస్తోంది. పక్కనే పెళ్ళి కూతురు పడు కొని వుంది. దూరంగా ఆమె చెల్లెలు, తమ్ముడు నిద్రిస్తూ న్నారు.

వేణు పెళ్ళికూతుర్ని తట్టి లేపాడు. త్రుళ్ళిపడి లేచిం దామె. వేణుని చూసి కంగారుపడింది.

"ఉష్, అల్లరి చెయ్యకు, నేనే!" అన్నాడు వేణు.

"ఈ రాత్రప్పుడు నీకిక్కడేం పని?" అన్నది పెళ్ళి కూతురు.

"నామీద నీ కింకా కోపం పోలేదా? నేను నిన్నెంతగా కోరుకుంటున్నానో నీకు తెలీదా?"

"మామయ్యా! అనవసర మాటలు వద్దు, వెళ్ళిపో! నిన్ను పెళ్ళి చేసుకోవటం నా కిష్టం లేదని యిదివరకే చెప్పేశాను. ఆ తర్వాతనే యీ సంబంధం స్థిరపరిచారు— రేపు పెళ్ళి జరగబోతూండగా నువ్విలా మాట్లాడడం బావుండలేదు."

"నీ పెళ్ళి జరుగుతుందనే అనుకొంటున్నావా?"

"ఏం అలా అంటావు? నీ కసంతా మాటల్లో తీర్చుకోవాలనుకుంటున్నావా?"

"మాటల్లోనే కాదు, చేతల్లోనే చూపించాను—మీ నాన్న పెళ్ళి కట్నంకోసం దాచిన డబ్బును హుష్ కాకీ అనిపించేశాను. నీ పెళ్ళి ఆగిపోయినట్టే!"

"మామయ్యా!"

"ఊరికే అరవకు, అమ్మ లేస్తుంది....ఇప్పుడు మనిద్దరం ఒప్పందాని కొచ్చేద్దాం. నువ్వు నాతో పెళ్ళికి ఒప్పుకో! నేను తీసిన డబ్బు మన పెళ్ళిరోజునాడు మీ నాన్నకు యెదురు కట్నంగా యిస్తాను. నన్ను కాదన్నావనుకో, మీ నాన్న గుండె ఆగిపోతుంది, తర్వాత నీ పెళ్ళి ఆగిపోతుంది నేను డబ్బు తీసినట్టు యెవరికీ తెలీదు. చివరికి మీ నాన్నకు కూడా ఇంకా తెలీదు. ఆ డబ్బు ప్రస్తుతం నా దగ్గిరకూడా లేదు. నన్ను దొంగగా నిరూపించే ఆధారాలేవీ లేవు....ఆలోచించుకో, నాతో పెళ్ళికి ఒప్పుకుంటావో లేక పదిమందిలోను మీ నాన్న పరువు మర్యాదలు మంట కలిసిపోయి, మీ నాన్న గుండె ఆగిపోతే చూస్తూవుంటావో- నిర్ణయించుకో!"

పెళ్ళికూతురు స్థాణువులా నిలబడిపోయి, నిలువు

గుడ్లేసుకుని చూస్తోంది. వేణు విజయగర్వంతో నవ్వి, "రేపు ఉదయం పది గంటలవరకు టైమిస్తున్నాను. ఏ విషయము నిర్ణయించి చెప్పు!" అంటూ వెనుతిరిగాడు.

వేణు తన గది దగ్గరకు రాకుండానే శేషు చెక్‌బుక్‌తో వాసు కెదురొచ్చాడు. ఇద్దరూ వేణుని అప్పుడే చూసినట్టు "ఎక్కడినుంచి వస్తున్నారు?" అన్నారు.

వేణు తడబడ్డాడు.

శేషు చెక్‌బుక్ తీసి వేణు ముందు ఆడించాడు. వేణు దిగ్భ్రాంతితో చూశాడు.

"ఏమిటిది? ఎవరిది?"

"ఎవరిదో నీకూ తెలుసు, మాకూ తెలుసు. మర్యాదగా యీ చెక్‌మీద 25 వేల అంకె వేసి సంతకం పెట్టు. మీ బావ పరంధామయ్యగారికి చెల్లించేలా రాయి. తర్వాతి విషయం మేం చూసుకుంటాం!"

వేదు తడబడ్డాడు.

"ఏమిటీ జబర్దస్తీ? ఈ చెక్‌బుక్ ఎవరిది? 25 వేలు వేలు వెయ్యటమేమిటి?" దబాయించబోయాడు.

"అన్నీ బయటికి వస్తాయి. పోలీసులు నిన్ను తమ అతిధిగా తీసుకువెళ్ళటానికి వస్తారు. గుట్టుచప్పుడు కాకుండా నువ్వు బ్యాంకులో వేసిన సొమ్ము మీ బావగారికి తిరిగి చెల్లిస్తావో కటకటాలు లెక్కపెడతావో తేల్చుకో! ఇదిగో, బ్యాంకువారు నీ కిచ్చిన నగదు రశీదు! ఇప్పటికయినా మాకు అన్ని విషయాలు తెలిసిపోయాయని గ్రహించావా? ఇక మరీ బెట్టు చెయ్యకు కొత్త పెళ్ళికొడుకులా! నీ వెంట నేను వచ్చి పెళ్ళికూతురుతో చెప్పిన మాటలన్నీ విన్నాను. కమాన్ క్విక్! ఇదిగో పెన్ను!" వాసు పెన్ అందించాడు.

వేణు దొరికిపోయినట్టు చూశాడు. మారు మాట్లాడకుండా చెక్ పరంధామయ్యగారి పేర 25 వేలకు రాసి యిచ్చేశాడు.

*　　*　　*

"మొత్తానికి నా పరువు ప్రతిష్టలతో బాటు, అమ్మాయి జీవితాన్ని కాపాడారు—మీ రుణం తీర్చుకోలేను!" అన్నాడు పరంధామయ్య డిటెక్టివ్ చేతులు పట్టుకుని.

"కొంపతీసి మా ఫీజుకూడా చెల్లించరా ఏమిటి ఖర్మ!" అన్నాడు శేషు.

"అన్నన్నా, ఎంత మాట! బ్యాంక్ నించి కేష్ తెస్తూనే మీ ఫీజు దార్లోనే చెల్లించేస్తాను. అమ్మాయి నెత్తిన అక్షతలు వేసేవరకు మీరు ఎక్కడికీ వెళ్ళటానికి వీల్లేదు" అన్నాడు పరంధామయ్య ఆప్యాయంగా యిరువురి చేతులూ నొక్కి వదిలి. □

గోల్డులోన్?

జ్వాల

బి. వి. సత్యనారాయణ

రివాల్వింగ్ చెయిర్‌లో అతడు తిరిగాడు. నల్లకళ్ళద్దా ల్లోంచి విలాసంగా చూశాడు. ట్రిబుల్ ఫైవ్ సిగరెట్ తీసి ముట్టించాడు. పొగ వదులుతూ చిటికెవేశాడు.

గోపాలం వినయంగా చేతులు కట్టుకుని నిలబడి వున్నాడు.

"నిన్ను యెవరు పంపారన్నావు?" అడిగాడు మహా దేవరావు.

"డాక్టర్ సుందరరావుగారు సార్!" అన్నాడు గోపాలం ఫైలు సర్దుకుంటూ.

మహాదేవరావు యాష్ట్రేలో నుసి రాల్చి "డాక్టర్‌గారికి నువ్వు ఎలా తెలుసోయ్?" అన్నాడు.

"వారి యింట్లో పని చేసేవాడిని సార్! వారే నన్ను ఎలక్ట్రిక్ వైరింగ్, గాస్ కటింగ్ లాంటి విద్యలు నేర్చుకోను ఏర్పాట్లు కూడా చేశారు సార్!"

"ఐ.సీ."

"తమ కంపెనీలో నాకు మంచి అవకాశ ఉంటాయిని తమ వద్దకు సిఫారసు చేసి పంపించారు సార్!"

మహాదేవరావు సున్నితంగా సిగరెట్టు పీల్చుతూ, "సర్టిఫికేట్లు తెచ్చావా?" అన్నాడు.

"తెచ్చాను సార్!" ఫైలు తెరవబోయాడు గోపాలం.

"అక్కరలేదు. ఎలక్ట్రికల్ సెక్షన్‌లో ఫోర్‌మన్ వుంటాడు? అతడికి చూపించు" తలూపాడు మహాదేవరావు.

గోపాలం నమస్కారం పెట్టి వెనక్కి తిరగబోయాడు. స్వింగ్‌డోర్ చప్పుడయాయి. గదిలోకి బరబర లాడుతోన్న చీరతో ఒక స్త్రీ ప్రవేశించింది.

"కూర్చో షకీలా! డిక్టేషన్ తీసుకో!" అన్నాడు మహాదేవరావు.

షకీలా సుతారంగా నవ్వి, "థాంక్యూ బాస్!" అని గొపాలంవైపు చూచింది.

గోపాలం ఆమె మీద చూపు మరల్చుకోలేక పోయాడు.

పెళుసుగా ఎత్తిపెట్టే ఆర్గండీ చీరను హడావుడిగా శరీరానికి చుట్టబెట్టుకున్నట్టు కట్టుకుంది. చిగురాకులలో కూర్చుండే చిలకలాగా పచ్చరంగు చీరమీద పచ్చటి బ్లవుజ్

వేసుకుంది. మొహానికి దట్టంగా పౌడర్ పూసుకుంది. దోసగింజలాంటి బొట్టూ, తీర్చిదిద్దిన కనుబొమలూ, లిప్‌స్టిక్ పూసిన పెదిమలూ, చెవులకు రింగులూ షకీలా అందానికి చమ్కీలు అంటించాయి.

గోపాలాన్ని పసివాడిని చూచినట్టు చూచింది షకీలా. హొయలు ఒంపుతూ కుర్చీలో కూర్చుంది.

గోపాలం బయటకు వెళ్ళిపోయాడు. కంపెనీ వద్దకు బస్సులో చేరుకున్నాడు. ఫోర్‌మన్ గోపాలాన్ని పనిలో చేర్చుకున్నాడు.

"గోపాలం! టెక్నికల్ ట్రయినింగ్ కావడం ఒక ఎత్తూ, ఆ పరిజ్ఞానాన్ని నీ కర్తవ్య నిర్వహణలో వుపయోగించుకోవడం మరో ఎత్తూ" అన్నాడు ఫోర్‌మన్.

గోపాలం తలూపాడు. తనకు ఒప్పగించిన పనిలో నిమగ్నమయాడు. 'మహదేవరావు — షకీలా — ఫోర్‌మన్....' గోపాలరావు గొణుక్కున్నాడు. 'ఈ ముగ్గురితోనే తనకు పని పడటం బాగుంది. ఏదో తెలుగు సినిమాలో చూపించినట్టు ముగ్గురూ మూడు చోట్లకు చెల్లాచెదురు కాలేమ'.

గోపాలం కొలిమి దగ్గరకు నడిచాడు. కొలిమిలో జ్వాల రేగుతోంది. అక్కడ వున్న సాంకేతిక నిపుణుడు జ్వాల రేగడానికి గ్యాస్‌ను వదలిపెట్టాడు. గోపాలం రేగుతోన్న జ్వాలవైపే చూడసాగాడు. జ్వాలలో అతడికి గతం గుర్తుకు రాసాగింది.

2

"నువు అర్జెంటుగా షకీలాను పిలుచుకురా!" అన్నాడు ఫోర్‌మన్. కామరాజు అతడిని విస్తుబోయి చూశాడు.

"సార్! ఏమిటిసార్ మీరనేది?" అడిగాడు కామరాజు.

"మహాదేవరావు వద్ద డిక్టేషన్ తీసుకుంటోంది. ఆమె బయటకు రాగానే నేను రమ్మన్నానని చెప్పి తీసుకురా!"

కామరాజు తటపటాయించాడు. షకీలా అమ్మగారిని ఫోర్‌మన్ అంత చనువుగా పిలుస్తోన్నాడు. ఫోర్‌మన్ మొహంలోకి చూడలేక కామరాజు కంపెనీలోంచి బయటకు కదిలాడు. బస్సు ఎక్కి ఆఫీస్‌వద్ద దిగాడు.

మహాదేవరావు గదిలోంచి షకీలా బయటకు వచ్చింది. ఆమె చేతిలో షార్ట్‌హాండ్ పుస్తకం, పెన్సిలూ వున్నాయి.

"మాడం!" పిలిచాడు కామరాజు.

షకీలా ఎందుకన్నట్టు చూచింది.

కామరాజు చెప్పాడు. షకీలా చకచక తన గదిలోకి పరుగెత్తింది. పుస్తకమూ పెన్సిలూ బల్లమీద పడవేసి బయటకు వచ్చింది.

"నువు బస్సులో వెళ్ళు!" అంది షకీలా.

కామరాజు తలూపి బయటకు వెళ్ళిపోయాడు.

కామరాజు కంపెనీకి తిరిగి వచ్చేటప్పటికి షకీలా వచ్చేసి వుంది ఫోర్‌మన్ గదిలో మాట్లాడుతోంది.

సాయంకాలమయింది. కామరాజు మిగతా వుద్యోగుల మాదిరిగా కంపెనీలోంచి బయటకు కదిలాడు. కాని ఇంటికి వెళ్ళిపోలేదు. కంపెనీ యివతల కాకా టీ హోటల్‌లో కూర్చున్నాడు.

షకీలా వచ్చి గంట అయింది. అంతసేపూ ఆమె ఫోర్‌మన్ గదిలో కూర్చుండే మాట్లాడుతోంది. కామరాజు ఓపికగా కంపెనీ భవనంవైపు చూస్తున్నాడు.

సాయంకాలం ఆరయింది. భవనం గేటువద్ద కారు ప్రత్యక్షమయింది. షకీలా కారు నడుపుతోంది. కారులో ఆమె ప్రక్క ఫోర్‌మన్ వున్నాడు. కాకా హోటలును

దాటుకుంటూ వెళ్ళిపోయింది. కామరాజు హోటలులోంచి రోడ్డుమీదకు వచ్చాడు. ఖాళీగా వున్న టాక్సీని కుదుర్చుకున్నాడు. కారును కనుచూపు మేరలో వెంబడించసాగాడు.

"ఆ కారులో ఎవరున్నారు బాబూ?" అడిగాడు టాక్సీ డ్రయివర్.

"ఎవరో ఒకరు. నీ కెందుకు?" చిరాకుపడ్డాడు కామరాజు.

టాక్సీ డ్రయివర్ ఓరకంట అతడిని చూచి టాక్సీ వేగం పెంచాడు. షకీలా నడుపుతోన్న కారు దగ్గర పడుతోంది. కారు 75 ఫీట్ రోడ్లోకి మళ్ళి రోడ్డు ప్రక్కగా ఆగింది. షకీలా కారు దిగింది. ఫోర్‌మన్ రెండో ప్రక్క నుండి కారు దిగాడు. ప్లాట్ నెం. 10 లోకి నడిచారు యిద్దరూ.

టాక్సీ ఆ యింటికి కొద్ది దూరంలో ఆగింది.

కామరాజు మీటర్ ప్రకారం బాడుగ చెల్లించి రూపాయి నోటు అదనంగా యిచ్చి ప్లాట్ నెం 10 ముందుకు నడిచాడు.

షకీలా, ఫోర్‌మన్ యింట్లోకి వెళ్ళి తలుపు వేసుకున్నారు. కామరాజు చప్పుడు కాకుండా కిటికీవద్దకు చేరుకున్నాడు.

"నీకు అంత తొందరపాటు వుండకూడదు!" కసురుకుంటోంది షకీలా.

"నా తొందర నీకేం తెలుసు! అవతల కొంపలంటుకుంటున్నాయి!"

"ఆదాయం పన్ను అధికారుల దాడి గురించి నువు అంత కంగారు పడిపోవడంలో అర్థం లేదు."

ఫోర్‌మన్ పిచ్చిగా చూశాడు. "షకీలా! నీకు మతి పోలేదు కదా! వాళ్ళు రేపే దాడి చేయబోతున్నారు. డబ్బు ఎక్కడ దాస్తాం?"

"బాత్ రూంలో దొంగ అర తీయించాం కదా! దాంట్లో దాచి వుంచవచ్చును."

"ఏడ్చినట్టుంది సలహా!"

"ఏం?"

"ఆదాయం పన్ను అధికారులకు ఈ ట్రిక్కులన్నీ బాగా తెలుసు. సినీతారల యిళ్ళమీద దాడిచేసి వాళ్ళు యివన్నీ నేర్చుకున్నారు."

"అయితే పెరట్లో గొయ్యితీసి కప్పి పెడదాం!"

"మనం గొయ్యి త్రవ్వడం ఎవడైనా చూస్తే త్రవ్వకు పారిపోతాడు."

"బాంకిలో దాస్తేనో?"

"పెద్ద మొత్తాలు దాచేటప్పుడు వాళ్ళకు వివరాలు యివ్వాలి!"

"ఆ! ఐడియా...." షకీలా గుసగుస లాడింది.

కామరాజు కిటికీ తలుపులకు చెవి ఆన్చాడు. అతడి భుజం మీద చెయ్యి పడింది. కామరాజు ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూశాడు. టాక్సీ డ్రైవర్ కాకీ దుస్తులలో వున్నాడు అతడు. తలమీద కాకీ గుడ్డతో టోపీ వుంది.

"ఎవరు నువ్వు?" అడిగాడు కామరాజు.

అతడు టోపీ తొలగించాడు. కామరాజు భయంతో నిర్ఘాంతపోయాడు. తన యజమాని! మహాదేవరావు. తాను ఇందాక యితడు నడిపిన టాక్సీలోనే ప్రయాణించాడు. టాక్సీ డ్రైవర్ అనుకొని యిష్టం వచ్చినట్టు కసురు

కున్నాడు. కామరాజు వణికిపోయాడు.

"లోపల ఏం జరుగుతోంది!" అడిగాడు మహాదేవ రావు.

"సార్....సార్...."

"ఫరవాలేదు. నెమ్మదిగా చెప్పు:"

కామరాజు చెప్పబోయాడు. కిటికీకి అవతల అడుగుల చప్పుడవుతోంది. షకీలా, ఫోర్‌మన్ వస్తోన్నారు. కామ రాజు, మహాదేవరావు చటుక్కున అక్కడి నుండి కదిలారు.

షకీలా కిటికీ తలుపు తెరిచింది.

"అతడు మన కామరాజు కదా!" అంది షకీలా.

ఫోర్‌మన్ కిటికీలోంచి చూశాడు. కామరాజు గేటు దాటుతోన్నాడు.

"ప్రక్కనున్న కాకీబట్టల వ్యక్తి ఎవరు?" అడిగాడు ఫోర్‌మన్.

షకీలా కాకీబట్టల వ్యక్తిని పరిశీలనగా చూసింది.

"అతడు మహాదేవరావు!" ఫోర్‌మన్ కంగారుగా అరిచాడు.

ఇద్దరూ కామరాజునూ, మహాదేవరావునూ సమీపించారు.

"సార్! మీరు .... ఈ వేషంలో .... ఏమిటి సార్?" ఫోర్‌మన్ గడగడ లాడాడు.

మహాదేవరావు ఆశ్చర్యంగా చూచి, "ఏం రాకూడదా?" అన్నాడు.

"అది కాదు సార్! మా ఇంటి వరకూ వచ్చారు. మమ్మల్ని పిలవకుండానే తిరిగి వెళ్ళిపోతోన్నారు. రండి సార్! కాస్త టీ సేవించి...."

మహాదేవరావు తల త్రిప్పి కామరాజును చూశాడు.

"ఏం కామరాజూ! వెళ్దామా?" అన్నాడు.

కామరాజు తబ్బిబ్బుపడి, "మీ యిష్టం సార్!" అన్నాడు.

"షకీలా! నీకూ ఫోర్‌మన్‌కీ సంబంధం వున్నట్టు నాకు తెలియదు!" అన్నాడు మహదేవరావు.

షకీలా మనోహరంగా నవ్వి, "ఫోర్‌మన్ నాకు దూరపు బంధువు. కజిన్ అవుతాడు. రండి సార్ ఇంటికి వెళ్దాం" అంది.

మహదేవరావు వెనక్కి తిరిగాడు.

నలుగురూ డ్రాయింగ్ రూంలో కూర్చున్నారు.

"కామరాజూ! నువ్వు యిక్కడికి ఎలా వచ్చావు?" అడిగింది షకీలా.

కామరాజు యిరకాటంలో పడ్డాడు.

ఫోర్‌మన్ ఆమెను చూచి కన్ను కొట్టాడు. షకీలా లోపలకు వెళ్ళింది. నాలుగు డ్రింకు గ్లాసులతో తిరిగి వచ్చింది. నలుగురూ నాలుగు గ్లాసులూ అందుకున్నారు.

షకీలా ఫోర్‌మన్ మొహాలు చూసుకుని మందహాసం చేశారు.

మహదేవరావు గ్లాసు టీపాయ్‌మీద పెట్టబోయాడు. గ్లాసు జారి పడింది. క్రింద కార్పెట్ మీద సున్నితంగా పడి శబ్దమయింది. మహదేవరావు సోఫాలోకి వెనక్కు వాలాడు. సోఫా వెనక్కి తల వాల్చాడు. మగతగా చూస్తోన్నాయి అతడి కళ్ళు. క్షణాల్లో అతడి కనురెప్పలు మూతపడ్డాయి.

కామరాజు చటుక్కున లేచి నిలబడ్డాడు. చెమటలు కక్కసాగాడు. అతడి పెదిమలు వణకుతున్నాయి. కంగారుగా గుమ్మంవైపు పరుగెత్తబోయాడు. ఫోర్‌మన్

అతడికి తన కాలు అడ్డం పెట్టాడు. కామరాజు తుళ్ళి టీపాయ్‌మీద పడి అటు మొగ్గవేశాడు. ఫోర్‌మన్ అతడిని కాలర్ పట్టి లేవనెత్తాడు.

"ఒరేయ్! నీవు మా గురించి యేం తెలుసుకున్నావు? చెబుతావా మక్కెలు విరగ తన్నమన్నావా?" అరిచాడు ఫోర్‌మన్.

కామరాజు పెదిమ తుడుచుకున్నాడు. రక్తం నోటికి ఉప్పగా తగిలింది. పెదిమ చిట్లిన గాయం భగ భగ మండింది.

"నాకు ఏమీ తెలియదు. మహాదేవరావుగారూ నేనూ కలసి వచ్చాం!" అన్నాడు కామరాజు మొండిగా.

ఫోర్‌మన్ కళ్ళు ఎర్ర చేశాడు. "మహాదేవరావు టాక్సీ డ్రయివర్ వేషం యెందుకు వేసుకున్నాడు?" అని అడిగాడు.

"నాకు తెలియదు సార్!"

"నీవు విన్న రహస్యం ఏమిటి?"

"నేనేమీ వినలేదు."

ఫోర్‌మన్ చాచిపెట్టి అతడి చెంప వాయించాడు. కామరాజుకు దంతాల్లో ఎక్కడో కలుక్కుమంది.

"కామరాజూ! నువ్వు మా రహస్యం దాచి వుంచు. ఎంత కావాలో చెప్పు" అంది షకీలా.

కామరాజు కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాడు. చివరకు అన్నాడు—

"రెండు లక్షలు!"

"కామరాజూ! నీకు ఇది న్యాయం కాదు. మేం సంపాదించుకున్నదే పాతికవేలు!"

"అబద్ధం! మహాదేవరావుచేత చెక్కులమీద గుడ్డి సంతకాలు చేయించుకుని రెండు లక్షలరూపాయలు సంపాదించాడు. ఆ డబ్బు మొత్తం నా పరం చేయండి!"

"చేయక పోతే?...." క్రూరంగా అన్నాడు ఫోర్‌మాన్.

"చెక్కుమీద అంకెలు మార్చిన నేరానికి మీమీద పోలీస్ కంప్లయింట్ ఇస్తాను."

ఫోర్‌మన్ కళ్ళు ఎర్రబడ్డాయి. షకీలావైపు తిరిగాడు. షకీలా కన్ను కొట్టింది. ఫోర్‌మన్ విజిల్‌వేసి జేబులో చెయ్యి పెట్టాడు.

కుర్చీలో అలికిడయింది. మహాదేవరావు మత్తుగా లేచి కూర్చున్నాడు.

"సార్! వీళ్ళిద్దరూ కలసి మిమ్మల్ని మోసం చేశారు సార్! ఆఫీస్ సొమ్ము రెండు లక్షలు...." కామరాజు గొంతు అడ్డం పడింది.

ఫోర్‌మన్ శక్తికొద్దీ అతడి పొట్టలో గుచ్చాడు. పదునయిన కత్తి నిర్దాక్షిణ్యంగా చర్మం పొరలనూ, రక్తనాళాలనూ ఛేదించుకొంటూ పొట్టలోకి దూసుకువెళ్ళోంది.

ఫోర్‌మన్ కత్తిని లాగి మరల గుచ్చబోయాడు.

కామరాజు చటుక్కున కత్తి పట్టుకొన్నాడు. "సార్! నాకు ఒక్కడే కొడుకు సార్! వాడు అనాథ కాకూడదు సార్...." అతడి చెయ్యి చీరుకుపోయింది.

ఈసారి కత్తి అతడి గుండెల్లో దిగింది. రక్తం పీపాకు చిల్లు పెట్టినట్టు కామరాజు శరీరంలోంచి నెత్తురు వెలుపలకు చొచ్చుకు వస్తోంది.

కామరాజు గుండెల్లోంచి కత్తి లాగాడు ఫోర్‌మన్. మహాదేవరావు చేష్టలు మరచి నిర్ఘాంతపోయి చూస్తూ

న్నాడు. ఫోర్‌మన్ అతడి చేతిలో కత్తి పెట్టాడు. మహా దేవరావు అవుననలేదూ కాదనలేదు. ఫోర్‌మన్ ప్రక్కకు తప్పుకున్నాడు.

కామరాజు నేలకూలిపోయాడు. మహాదేవరావుతన చేతిలోని కత్తివైపు నిర్లిప్తంగా చూడసాగాడు. కత్తినుండి రక్తం బొట్లు బొట్లుగా కారుతోంది.

ఫ్లాష్ తళుక్కుమంది. ఒకసారి కాదు. ఎన్నోసార్లు! ఒక కోణంలో కాదు. ఎన్నో కోణాలలో. షకీలా రీలు మొత్తం వుపయోగిస్తోంది.

మహాదేవరావు చేతిలోంచి కత్తి లాక్కొన్నాడు ఫోర్‌మన్.

"నోరు మూసుకుని పడివుండు మహాదేవ్! షకీలాతో నీ ప్రణయ కలాపాలూ, ఈ హత్యా దృశ్యాలూ పత్రికలకు చిక్కకూడదనుకుంటే మేం చెప్పినట్టు పత్రికా ప్రకటన యివ్వు" అన్నాడు ఫోర్‌మన్.

మహాదేవరావు అవుననను లేదు కాదనను లేదు.

* * *

గోపాలం తన చేతిలోని పేపర్ కటింగును చూశాడు. రెండు సంవత్సరాలనాటి పేపర్ కటింగ్ అది. గోపాలం కటింగును చదవసాగాడు.

సేఫ్‌ను పగలగొట్టిన దొంగ వైనం

విశాఖపట్నం—మార్చి 14: స్థానిక పారిశ్రామికవేత్త మహాదేవరావుగారి ఆఫీసులో నిన్న రాత్రి దొంగతనం జరిగింది. ఆఫీస్ సేఫ్‌ను పగులగొట్టి దొంగ రెండు లక్షల రూపాయలు ఎత్తుకపోయాడు. దొంగ ఎవరో కాదు కామరాజు. అతడికి అదే కంపెనీలో వుద్యోగం అని తెలియ వస్తోంది. రెండవ టవున్ సబ్ ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు

చేస్తున్నారు.

గోపాలం పళ్ళు బిగించాడు. తన తండ్రిమీద దొంగ తనం నేరం మోపి మహాదేవరావూ, అతడి మనుషులూ చేతులు కడుక్కున్నారు. తన తండ్రికి వున్నది తనొకడు. తన ఒక్కడికోసం తండ్రి రెండు లక్షల రూపాయలు దొంగిలించాడని పోలీసు వర్గాలు కూడా భావిస్తున్నాయి.

తన బాధను డాక్టర్ పరాత్పరంతో చెప్పుకున్నాడు. తాను పరాత్పరంగారి ఆసుపత్రిలో ఎలక్ట్రికల్ వైరింగ్ చేస్తోన్నాడు.

"మీ నాన్న దొంగతనం చేసే మనిషి కాదు. నాకు అతడి గురించి బాగా తెలుసు!" అన్నాడు డాక్టర్ పరాత్పరం.

తాను పళ్ళు బిగించాడు. దొంగతనం చేసి తన తండ్రి యెక్కడకు పారిపోతాడు? సరిగ్గా ఆ మాటే పరాత్పరం గారు కూడా అన్నారు.

"డబ్బుతో పారిపోయేవాడు నిన్ను కూడా వెంట పెట్టుకుపోయేవాడే కదా!"

"అవును సార్! నాకూ అదే అనుమానం!"

పరాత్పరం చాలాసేపు ఆలోచనలో పడ్డాడు.

"గోపాలం! నాకో అనుమానం వస్తోంది. మీ నాన్న కనిపించకుండా పోయిన రోజు రాత్రి మహాదేవరావు నా దగ్గరకు వచ్చాడు. యాసిడ్ కావాలని కోరి చాలాసేపు ఆగి పోయాడు.

"మీకు యాసిడ్ ఎందుకు?" అని అడిగాను.

మహాదేవరావు నాకు సరైన సమాధానం చెప్పలేదు. కాని... అతడు దేన్నో కరిగించడానికే యాసిడ్ కావాలని అడిగి వుంటాడు."

"ఎంత మొత్తంలో యాసిడ్ యిచ్చారు?" అడిగాడు తాను.

"రెండు బీర్ బాటిల్సు పట్టేటంత!"

"దేన్ని కరిగించడాని కంటాడు?"

పరాత్పరం యిబ్బందిగా కదిలి, "మహాదేవరావుకు అంత యాసిడ్ ఎందుకు కావలసి వచ్చింది? ఈ విషయమై ఆలోచించాను. మీ నాన్నను వాళ్ళు ఏం చేశారో? మీ నాన్న మీద వాళ్ళకు కసిదేనికి? యాసిడ్ చల్లి మీ నాన్నను గాయ పరచారో — హత్యచేసి శవాన్ని కరగించాలని చూస్తు న్నారో...." అన్నాడు.

తాను చాలసేపటికిగానీ తేరుకోలేదు.

తన తండ్రికి ఏమయిందో తాను తెలుసుకోవాలి. అందుకు డా. వరాత్పరంగారి సానుభూతిని వుపయోగించుకోవాలి.

"సార్! నన్ను మహాదేవరావు గారికి పరిచయం చేయండి. ఆయనే మా నాన్నను మాయంచేసి వుంటాడని నా నమ్మకం! లేకపోతే మా నాన్నకు దొంగతనం అంటకట్టి ఆయనను అంతం చేసి వుంటాడు."

"నువు ఒంటరిగా మహాదేవరావు యింటికి వెళ్తావా?"

"ఆతడి కంపెనీలో ఏ చిన్న వుద్యోగమయినా సరే చేస్తాను సార్!"

"ఆల్‌రైట్! నేను యిప్పుడే శిఫారసు వుత్తరం రాసి యిస్తాను."

3

గోపాలం తల విదిలించాడు. తాను ఆ రకంగా మహా దేవరావు కంపెనీలో వచ్చి చేరుకున్నాడు. మహాదేవరావు గదిలోకి షకీలా ప్రవేశించినపుడల్లా ఆ చుట్టు ప్రక్కల ఎవరూ వుండకుండా మహాదేవరావు జాగ్రత్తపడతాడు.

షకీలా అతడితో అతి చనువుగా వుంటుందని ఆఫీసులో ఎక్కువమందికి తెలుసును.

సాయంత్రం గోపాలం కంపెనీలోంచి నడిచి బయటకు వచ్చాడు. ఫోర్‌మన్ కూర్చున్న కారు గోపాలం కంట్లో పడింది. గోపాలం కళ్ళు ఆశ్చర్యంతో మెరిశాయి. ఫోర్‌మన్ కారు నడుపుతోన్నాడు. కారులో వెనకసీట్లో షకీలా, మహాదేవరావూ కూర్చున్నారు.

ఫోర్‌మన్ కారు నడపడం ఏమిటి? మహాదేవరావు కారు డ్రయివర్ ఏమయాడు?

గోపాలం ఆఫీసువద్దకు చేరుకున్నాడు. మహాదేవరావుకు కారు నడిపే డ్రయివర్ ఆఫీసు గదిముందు కూర్చుండి వున్నాడు.

"రండి. కాఫీకి వెళ్దాం!" అన్నాడు గోపాలం అతడితో.

డ్రయివర్ బతుకు జీవుడా అని లేచాడు. ఇద్దరూ బయటకు నడిచారు. హోటలులో కూర్చున్నాక డ్రయివర్ అడిగాడు.

"ఎవరు బాబూ నువ్వు?"

"నాకు డ్రయివర్ ఉద్యోగం యిస్తానని ఫోర్‌మన్ చెప్పారు" అబద్ధం చెప్పాడు గోపాలం.

డ్రయివర్ కళ్ళు ఎరుపెక్కాయి. "నన్ను ఏం చేస్తా చేస్తాడట?" అన్నాడు.

వెయిటర్ వచ్చాడు.

గోపాలం రెండు ప్లేటు స్వీటు, రెండు ప్లేటు పకోడీ ఆర్డరిచ్చాడు. వెయిటర్ వెళ్ళిపోయాడు.

"ఆ విషయం అర్థంగాకనే మీ వద్దకు వచ్చాను. ఈ రోజున మీరు అన్యాయమై పోతారు. రేపు నా వంతు

వస్తుంది" అతడి మొహంలోకి చూస్తూ అన్నాడు గోపాలం.

"ఆ మాట నిజమే కదా!"

వెయిటర్ ఆర్డర్ తీసుకువచ్చాడు.

ఇద్దరూ తిండిమీద పడ్డారు.

"ఫోర్‌మన్ ఎంత చెబితే అంత మహాదేవరావుకు!" అన్నాడు డ్రయివర్.

"అవును. షకీలా వుందికదా!"

"షకీలాతో మహాదేవరావుకు అక్రమ సంబంధం వుంది. ఫోర్‌మన్ ఆమెను అడ్డం వేశాడు."

"అందువల్లనే ఫోర్‌మన్ ఎంత చెబితే మహాదేవరావుకు అంత!"

వెయిటర్ రాగానే రెండు కూల్‌డ్రింక్స్ ఆర్డరిచ్చాడు గోపాలం.

"మంచి మాట చెప్పావు బాబూ!"

ఇద్దరూ డ్రింక్స్ తాగడం మొదలుపెట్టారు.

"పాపం! కామరాజు డబ్బు ఎత్తుకుపోయాడట కదా!" గోపాలం కదిపాడు.

డ్రయివర్ తల అడ్డంగా త్రిప్పి, "అందులో ఎంత పాపం, పుణ్యం వుందో నాకు తెలియదు కానీ—ఆ రోజు నా యూనిఫాం అడిగి తీసుకున్నారు మహాదేవరావుగారు" అన్నాడు.

"ఎందుకో?"

"ఆయన టాక్సీ డ్రయివర్ వేషం వేసుకుని వెళ్ళారు. పెద్దవారు. వాళ్ళని ఏమడుగుతాం?"

"అప్పుడు నువు ఎక్కడ వున్నావు?"

"కంపెనీ దగ్గర!"

"తన కారులోనే బయటకు వెళ్ళివుంటారు ఆయన."

డ్రయివర్ మందహాసం చేసి "టాక్సీ స్టాండుకు ఫోన్ చేసి ఒక టాక్సీని రప్పించుకున్నాడు. ఆశ్చర్యం! అదే టాక్సీలో కామరాజు ఎక్కాడు. ఫోర్‌మన్, షకీలా ఎక్కిన కారును వీళ్ళిద్దరూ టాక్సీలో వెంబడించారు" అన్నాడు.

"ఈ విషయం పోలీసులకు చెప్పావా?"

"ఏం చెబుతాను? నా మాట ఎవడు నమ్ముతాడు?"

గోపాలం పెదిమలు బిగించాడు. తన తండ్రిని టాక్సీలో కూర్చోబెట్టుకుని టాక్సీ నడిపాడు మహదేవరావు. షకీలా, ఫోర్‌మన్, మహదేవరావులతో తన తండ్రి చేయి కలిపాడా? అలా చేయి కలిపి వుంటేమాత్రం అతడికి రెండు లక్షల రూపాయల మొత్తం ఎలా అందుబాటులోకి వచ్చింది?

"టాక్సీలో వాళ్ళిద్దరూ ఎక్కడకు వెళ్ళివుంటారు!"

"షకీలాని వెంబడించుకుని వెళ్ళివుంటారు!"

గోపాలం తేలికగా చప్పరించి, "ఇంత గందరగోళం మనుషులతో నాకు డ్రయివర్ వుద్యోగం ఏమిటి?" అన్నాడు.

డ్రయివర్ మొహం సంతోషంతో వెలిగింది.

4

షకీలా కూనిరాగం తీస్తూ బాత్‌రూంలోకి ప్రవేశించింది. టవల్, హేంగర్‌మీద వేసింది. చీర విప్పింది. హేంగర్ మీద వేయబోతూ ఆగింది. షవర్‌కి అవతల నీటితొట్టి వుంది. నీటి తొట్టిలో అతడు పండుకుని వున్నాడు. అతడి చేతిలో పొడవుపాటి కత్తి వుంది.

షకీలా అతడిని చూస్తూనే 'కెవ్వు' మంది. అతడు నల్లగా వున్నాడు. మొహానికీ ఒంటికీ నల్లటి మసి రాసు

కున్నాడు. కళ్ళకు కూలింగ్‌గ్లాసెస్ వున్నాయి. ఒత్తయిన మీసాలు. ఒంటికి ఎర్రచారల బనీను వుంది.

షకీలా వెనక్కి తిరిగి పరుగెత్తబోయింది. కాళ్ళు నేలలో పాతుకుపోయినట్టయాయి. అప్పటికే నల్లటి వ్యక్తి నీటి తొట్టెలోంచి లేచి ఆమె గొంతుకు కత్తి ఆనించాడు.

"నువు ఎవరివి?"

"కామరాజ అంతరంగికుడిని!"

"............"

"కామరాజుకు ఏం జ రి గిం దో నాకు తెలుసు. యాసిడ్‌తో...."

"నాకేం తెలియదు."

కత్తి చళుక్‌మంది. ఆమె భుజం మీద నాటు పడింది. నాటు క్రమంగా ఎర్రబడుతోంది. మరుక్షణంలో నాటు లోంచి రక్తంధార కడుతోంది. షకీలా భయభ్రాంతులలో మునిగిపోయింది.

"పీక తెగిపోతుంది తెలుసా?" నల్లటి వ్యక్తి కత్తి ఝళిపించాడు.

షకీలా కొయ్యబారిపోయింది.

"కామరాజు మమ్మల్ని బెదిరించాడు. రెండు లక్షల రూపాయిలకు బ్లాక్‌మెయిలింగ్‌కు తయారయాడు. ఫోర్ మన్ వద్దన్నప్పటికీ మహదేవరావు అతడిని చంపేశాడు."

"తన యజమానిని బెదిరించవలసినంత అవకాశం కామ రాజుకు ఎలా దొరికింది?"

షకీలా తల దించుకుంది. "నాతో మహదేవరావుకు వున్న సంబంధాలు అతడు తెలుసుకున్నాడు."

"మహదేవరావు చంపలేదు. నువ్వూ ఫోర్‌మన్ కలిపి చంపారు."

"లేదు ఫోటోలున్నాయి"

"పద ఫోటోలు చూపించు."

షకీలా భయంగా తలూపి చీర అందుకోబోయింది. నల్లటి వ్యక్తి ఆమెను గదిమాడు. షకీలా బాత్‌రూంలోంచి కదిలింది. గదిలోకి ప్రవేశించింది. ఆమెను నీడలాగా వెంబడించాడు నల్లటి వ్యక్తి.

గాడ్రెజ్ బీరువా తెరచింది షకీలా. ఫోటోలు తీసి అతడికి అందించింది. నల్లటి వ్యక్తికి వాటిని చూస్తూండగానే ఒళ్ళు జలదరించింది. ఫోటోల్లో కామరాజు శరీరం రక్తసిక్తమయి వుంది. అతడి ప్రక్క మహదేవరావు వున్నాడు. అతడి చేతిలో రక్తం కారుతోన్న కత్తి వుంది.

నల్లటి వ్యక్తి పళ్ళు బిగించి చూశాడు.

షకీలా అతడికి చేతులు జోడించింది. "ఈ ఫోటోలు నీకు యిచ్చినట్టు ఎవరితోనూ చెప్పక!" అంది.

"ఏం?"

"మహదేవరావు నా ప్రాణాలు తీస్తాడు."

"కామరాజు శవాన్ని ఎలా మాయం చేశారు?"

"యాసిడ్ పోసి నానబెట్టారు. శవం త్వరగా కుళ్ళిపోయింది. పేలికలయిపోయింది. మురికి కాలవలోకి తోసేశాడు."

"మహదేవరావేనా?"

"అవును."

నల్లటి వ్యక్తి కనుగ్రుడ్లు మరింత ఎర్రబడ్డాయి. అస్థిపంజరం కూడా యాసిడ్ సోకి త్వరగా గుల్లబడిపోయి వుంటుంది. గుల్లపడిన కాల్షియం పదార్థం నాశనంకావడం ఎంతసేపు?

అతడు జేబులోంచి జేబురుమాలు తీశాడు. అతడు చటు

క్కన జేబురుమాలును ఆమె ముక్కుకు అదిమిపెట్టాడు.

షకీలాకు స్పృహతప్పి అతడి చేతులలోకి జారిపోయింది. అతడు ఆమెను మంచంమీదకు చేర్చాడు ఇంట్లోంచి బయటకు కదిలాడు.

"ఆయియే సాబ్!" కుర్చీలోంచి లేచాడు మహాదేవ రావు.

శేట్ నవ్వాడు నోరు తెరిచినప్పుడు అతడి బంగారు పళ్ళు బయటపడ్డాయి. శేట్ కూర్చున్న తర్వాత మహాదేవ రావు తన సీటులో కూర్చున్నాడు.

శేట్ తన బాగ్‌లోంచి కవర్ తీశాడు. మహాదేవరావుకు అందించాడు.

మహాదేవరావు కవర్ తెరిచాడు. ఫోటో జారి ఒడిలో పడింది. మహాదేవరావు ఆశ్చర్యంగా ఫోటో అందుకున్నాడు.

కత్తిపోట్లు తింటున్న కామరాజూ, అతడి ప్రక్కతానూ వున్న ఫోటో అది.

"శేట్!" మహాదేవరావు గొంతు తడారిపోయింది.

"పది లక్షలు!"

"ఈ ఫోటోలు మీకు ఎక్కడివి?"

"ఇవే కాదు. షకీలాతో ప్రణయ కలాపాలు కూడా!"

"ఫోర్‌మన్‌గాడు నా మీద మిమ్మల్ని ప్రయోగించాడన్న మాట!"

"ఫోర్‌మన్? అతడిని కూడా ఫోటోలో యిరికించాను కదా!"

"మీ రెవరు?"

"ఎవరయితే ఏం? బిజినెస్ మాట్లాడండి!"

"కామరాజును హత్య చేస్తామని నీకు ముందే తెలుసా?"

"ఆహా(!"

"ఎలా తెలుసు."

"నేనూ, కామరాజూ పార్టనర్స్ం!"

మహదేవరావు నోట మాట లేదు.

"డబ్బు ఎపుడు యిస్తావు?" అడిగాడు శేట్.

మహదేవరావు తటపటాయించి, "నెగెటివ్స మొత్తం యిచ్చాక!" అన్నాడు.

శేట్ తలూపాడు. గదిలోంచి బయటకు కదిలాడు. చకచక పోర్టికోలోకి వచ్చి టాక్సీ ఎక్కి కూర్చున్నాడు.

అప్పటికి మహదేవరావు తేరుకున్నాడు. చకచక ఫోన్ చేశాడు. అవతల ఫోర్‌మన్ పలికాడు. గాజు అద్దాల్లోంచి టాక్సీ కనిపిస్తోంది, వేగం పుంజుకుంటూ.

"నువ్వూ షకీలా వెంటనే కారులో ఆఫీసువైపు రండి. మీకు ఎపిఎస్ - 6406 నెం. టాక్సీ ఎదురవుతుంది. దాన్ని వెంబడించండి. నేనూ నా కారులో వస్తున్నాను. వాడికి మన రహస్యాలు తెలిసిపోయాయి." అన్నాడు మహదేవరావు.

6

టాక్సీ దిగాడు శేట్. చకచక బిల్డింగ్‌లోకి పరుగెత్తాడు. అతడి టాక్సీకి కొద్ది దూరంలో రెండు కార్లు ఆగాయి. మహదేవరావు ఒక కారులోంచీ, షకీలా, ఫోర్‌మన్ రెండో కారులోంచీ దిగారు.

మహదేవరావు జేబులో పిస్తోలు సర్దుకున్నాడు. ఫోర్‌మన్ పడకత్తిని చేతిలో వుంచుకున్నాడు. షకీలా చేతిలో చిన్నసైజు పిస్తోలు వుంది.

ముగ్గురూ బిల్డింగ్‌లోకి పరుగెత్తారు. బిల్డింగ్ మొత్తం నాలుగు గదులు. రెండు గదులు ఖాళీగా వున్నాయి. మూడో

గదిలోకి ప్రవేశించారు ముగ్గురూ. మంచం మీద యెవరో కూర్చున్నారు. అతడి మొహం గోడవైపుకు తిరిగి వుంది.

ముగ్గురూ అతడి మీదకు దూకారు. మంచం మీదనుండి గడ్డిబొమ్మ క్రింద పడింది. ముగ్గురూ రెచ్చిపోయి వెనక్కి తిరిగారు. తలుపుల వద్ద శేట్ ప్రత్యక్షమయాడు.

మహాదేవరావు పిస్తోలు ప్రేల్చబోయాడు. చటుక్కున శేట్ వేషంలో వున్న గోపాల్ గుమ్మం ప్రక్కకు కదిలాడు. ఫోర్‌మన్ ముందుకు దూకాడు తలుపు మూసుకుంది. ఫోర్‌మన్ తలుపు గుద్దాడు.

మూడు ప్రక్కలా గోడలు. గోడకు కిటికీ కూడాలేదు. తలుపు వేయగానే గదిలో చీకటి అలుముకుంది.

"వాసన! పాడు వాసన! అరిచింది షకీలా.

"గాస్ వాసన" అన్నాడు ఫోర్‌మన్ ఆదుర్దాగా.

"గోడ తడుము! యిక్కడే స్విచ్‌బోర్డు వుండాలి" అన్నాడు మహాదేవరావు.

ఫోర్‌మన్ గోడ తడిమాడు.

"ఇదిగో స్విచ్‌బోర్డ్!" అంది షకీలా.

"గదిలోకి గ్యాస్ వస్తోంది" అన్నాడు ఫోర్‌మన్.

"స్విచ్ వెయ్యి! రెగ్యులేటర్ పీకాలి ..." అన్నాడు మహాదేవరావు.

అతడి మాట ముగియక ముందే స్విచ్ ఆన్‌చేశాడు ఫోర్‌మన్. ప్లస్ మైనస్ రాపిడి. అంతే! గదిలో నీలి మంటలు భగ్గున అంటుకుంది. మంచమూ, గడ్డిబొమ్మా, షకీలా, ఫోర్‌మన్, మహాదేవరావ్....ఒకటేమిటి సమస్తమూ అంటుకుని భగభగ మండుతోంది.

లోపల హాహాకారాలకు బయట గోపాలం పగలబడి నవ్వసాగాడు. □

ఆనందతాండవం

కాశీభట్ల భానుమూర్తి

"శ్రీదేవిలో టిఫిన్ బాగుంది గురూ" అన్నాడు శ్రీకారం.

"అబ్బ! ఆ అల్లం చట్నీ వుంది, దానికదే సాటి" అని లొట్టలు వేయసాగాడు ఓంకారం.

"తణుకులో యింత మంచి టిఫిన్ దొరుకుతుందని నాకు తెలీదురా, ఓంకారం!" అన్నాడు శ్రీకారం.

"ఊరికే ఏమీ దొరకలేదు డబ్బులు పెట్టి కొంటేనే

వచ్చింది. అయినా మనం వచ్చి రెండు నెలలేగా అయ్యింది" అన్నాడు ఓంకారం.

"ఒరే! ఓం! అసలు మన బాస్ 'పరిశోధనరావు'కి బుర్ర లేదురా. నిక్షేపంగా విజయవాడలో సాగుతున్న మన డిటెక్టివ్ వృత్తిని మూసేసి తణుకులో ఆఫీసు తెరిచాడు. మనకు యిక్కడ పనీలేదు పాటాలేదు" అన్నాడు శ్రీకారం.

"విజయవాడలో ఆ పోటీని మన బాసు తట్టుకోలేక పోయారురా! అందుకే తణుకులో....! ఒరే సందులోకి చూడు"అన్నాడు మాట్లాడేమాట సగంలో ఆపేసిఓంకారం.

"ఆ! ఏముంది అక్కడ - 'నీలిమా బుక్ సెంటరు' వుంది. దానికేం?" అన్నాడు శ్రీకారం.

"అది కాదురా. నీలిమా బుక్ సెంటర్‌కి ఎదురుగుండా అరుగుమీద కూర్చుని వున్నారు. వాళ్ళని చూడు...." అన్నాడు ఓంకారం.

"ఆ! వాళ్ళా! ఒకడు దుక్కలా లావుగా వున్నాడు. ఒకడు నక్కలా సన్నగా వున్నాడు. ఇప్పుడు వాళ్ళకే మొచ్చింది" అన్నాడు శ్రీకారం.

"వాళ్ళు మాట్లాడే పద్ధతి అదీ చూస్తుంటే నాకేదో అనుమానంగా వుందిరా? నా అంతర్వాణి నసుగుతోంది" అన్నాడు ఓంకారం.

"నీ వాణికి బాణీలేదు. వాళ్ళని అనుమానించకు. కళ్ళు పోతాయి!" అన్నాడు శ్రీకారం.

"ఇప్పుడు మనం చేసే పని ఏమీలేదుగా? వాళ్ళని అనుసరిద్దాము. నా అనుమానం నిజం అయితే మనకి ఒక కేసు దొరుకుతుంది. మన బాసుకి జేబు నిండుతుంది" అన్నాడు ఓంకారం.

"సరే పదా! అదుగో, వాళ్ళు వెనక్కి చూస్తూ నడుస్తున్నారు. జై వీరహనుమాన్! జై పరిశోధనరావు!!" అన్నాడు శ్రీకారం ఉత్సాహంగా. ఇద్దరూ వాళ్ళని అనుసరిస్తూ బయలుదేరారు.

వాళ్ళు ఆ 'సక్క, దుక్క'లు వెనక్కి చూసుకొంటూ అనుమానం వస్తే ఆగిపోతూ, సందులూ, గొందులూ తిరుగుతూ పాత బస్సు స్టాండు వెనకాల ఒక సందులోకి ప్రవేశించి, ఒక్కసారి అటూ ఇటూ చూసి ఒక ఇంటిలో దూరారు. వెంటనే ఆ ఇంటి తలుపులు మూసుకొన్నాయి.

ఓంకారం, శ్రీకారం ఇద్దరూ ఆ ఇంటి ముందుకి వచ్చి నిలబడ్డారు. కరెంటు లేకపోవడం వలన ఆ వీధి చాలా చీకటిగా వుంది. ఏమి చేయాలో పాలుపోక ఆలోచిస్తూంటే 'కెవ్వు'మన్న సన్నని కేక వినబడింది. ఇక ఆగదలుచుకోలేదు ఓంకారం, శ్రీకారాలు. వెంటనే గుమ్మం ముందు ఉరికి తలుపులు దబదబా బాదసాగారు.

"ఎవరది?" అన్న కేక వినబడింది ఆ యింటిలో నుంచి. మరుక్షణం తలుపులు తెరుచుకొన్నాయి. తెరుచుకొన్న తలుపుల లోంచి రెండు చేతులు దూసుకువచ్చి శ్రీకారాన్ని ఓంకారాన్ని లోపలికి లాక్కొన్నాయి. వెంటనే ఇద్దరు మనుష్యులు, అదే ఆ 'దుక్క, నక్క'లు బయటికి వచ్చి, గొళ్ళెం పెట్టి పారిపోయారు.

ఇదంతా కన్ను మూసి తెరిచేలోపల జరిగిపోయింది. ఒక్క క్షణం ఓంకారానికి, శ్రీకారానికి ఏమి అర్థం కాలేదు. తాము ఎందుకు లోపలికి వచ్చామో, ఎలా వాచ్చామో, తలుపులు ఎవరు వేశారో, అర్థమయ్యి తేరుకొని లేచి నిలుకునేసరికి, తలుపులు తెరుచుకొన్నాయి.

ఎదురుగా కాకీ బట్టలతో వున్న పోలీసులు కనిపించారు.

ఆ తరువాత వారి చేతిలో వున్న సంకెళ్ళు కనిపించాయి. మరుక్షణం అవి ఓం, శ్రీల చేతికి బిగుసుకొన్నాయి. తదుపరి వేను ఎక్కించి పోలీసు స్టేషనుకి తీసుకొని వచ్చారు. ఇది కూడా క్షణాల్లో జరిగిపోయింది.

వీళ్ళని గుర్తుపట్టిన పోలీసు ఒకడు పరిశోధనరావుకి ఫోను చేయటం, అతను రెక్కలు కట్టుకొని వాలటం కూడా జరిగింది.

పరిశోధనరావుని చూడగానే ఓం, శ్రీం "బాసూ" అని పెద్దపెట్టున రోదించారు.

పరిశోధనరావు "ఊర్కోండి, పోలీసు స్టేషనులోంచి ఇలాంటి ఏడ్పులు వినిపిస్తే జనం అపార్థం చేసుకొంటారు. ఇంతకీ ఏమి జరిగింది?" అన్నాడు.

శ్రీదేవిలో టిఫిన్ తిన్న దగ్గర నుంచి జరిగింది చెప్పి, "బాసూ, ఇదంతా ఏదో సినిమాలా వుంది. నాకేం అర్థం కావటంలేదు" అన్నాడు ఓంకారం.

"అర్థం కాదు మిష్టర్, అర్థం కాదు. హనుమంతరావు గారి తమ్ముడు విశ్వనాథ్‌గారిని చంపి, వారి యింటిలో పదివేల రూపాయలు పట్టుకొని పారిపోపోతుంటే సమయానికి ఒక అజ్ఞాత వ్యక్తి చేసిన ఫోను కారణంగా మేము మిమ్మల్ని అరెస్టు చేయటం అర్థం కాదు. అమ్మ! అమ్మ! ఎంతకు తెగించారు" అని ఎస్సై ముకుందరావు కారణాలు వివరిస్తూ ఆశ్చర్యములో ఓలలాడసాగాడు.

"సార్! ఇందులో ఏదో మోసముంది. నా అసిస్టెంటులు అలాంటి రకం కాదు. నా మాటమీద నమ్మకం వుంచి ఒక ఇరవై నాలుగు గంటలు టైమివ్వండి" అని ప్రాధేయపడసాగాడు పరిశోదనరావు.

"ఇదేం పెళ్ళి ముహూర్తమా వాయిదా వేయడానికి! రేపు పదిలోపున మీరేమన్నా చేసుకోండి. పది దాటితే కేసు కోర్టుకి పోతుంది" అన్నాడు ఎస్సైని ముకుందరావు.

ఎస్సైకి కృతజ్ఞతలు చెప్పి, బయటపడ్డాడు పరిశోధన రావు. ఇంటికి వెళ్ళి ఓంకారంలాగా వేషం మార్చు కొన్నాడు. ఇద్దరూ ఒకే పొడుగు, లావు కాబట్టి అప్పు డప్పుడు ఇలాంటి కిటుకులు వేసేవారు. దీనికంతకి కారణం అయిన స్పాటు దగ్గర మాటువేసాడు.

రెండు గంటలు గడిచాక ఓంకారం చెప్పిన దుక్కా, నక్కాలు వస్తూ కనబడ్డారు. చెత్తకుండీ పక్కనుంచి బయ టికి వచ్చిన పరిశోధనరావు విజిలు వేసుకొంటూ వాళ్ళకి ఎదురు నడిచాడు.

ఓంకారం వేషంలో వున్న పరిశోధనరావుని చూడగానే వాళ్ళిద్దరూ పరుగు లంకించుకొన్నారు. వదలక వెంటపడి యిద్దర్నీ పట్టుకొని, నాలుగు ఉతికి స్టేషన్‌కి లాక్కు పోయాడు. అక్కడ పోలీసు మర్యాద చవిచూసాక వారు నిజం బయటపెట్టారు.

"హనుమంతరావు, విశ్వనాధ్‌లు ఇద్దరు తెగ అప్పులు చేశారు. చివరిసారిగా ఒక మార్వాడి వద్ద పదిహేనువేలు అప్పు తెచ్చి హనుమంతరావు ఒక్కడే వేరొక ఊరు పారిపోతుంటే, విశ్వనాధ్ అడ్డుపడి 'ఈ అప్పులన్నీ నా మీదకు తోస్తావా నీ వెళ్ళిపోతే ఎలా?' అన్నాడు.

చస్తే చావు అని హనుమంతరావు అంటే—పౌరుష మున్న విశ్వనాధ్ పొడుచుకొని చచ్చిపోయాడు. షాక్ తిని తేరుకొన్న హనుమంతరావుకి ఒక ఫ్లాష్ లాంటి అయి డియా వచ్చింది.

వెంటనే తనకి తెలిసున్న నక్కా, దుక్కాలని పిలిపించి

అమాయకులు ఎవరైనా దొరికితే తెమ్మన్నాడు. అలా తీసుకొనివచ్చిన శ్రీకారాన్ని, ఓంకారాన్ని హత్యానేరంలో ఇరికించాడు,'' ఇది చెప్పి ఆత్మహత్యని హత్య కింద ఎందుకు మార్చాడో మాకు తెలవదని లబ, లబలాడసాగారు నక్కా, దుక్కాలు.

"అది మేము తెలుసుకొంటాం. ఆః మిస్టర్ పరిశోధనరావు! మీ అసిస్టెంట్లని మీరు తీసుకొని వెళ్ళవచ్చు. అవసరమైతే కబురు పెడతాం'' అని చెప్పి వారిని పరిశోధనరావుకి అప్పగించాడు ఎస్సై.

* * *

డిటెక్టివ్‌లు ముగ్గురూ రాజేంద్రభవనంలో వున్న తమ ఆఫీసులో కూర్చొని విచార గీతాలు పాడుకోసాగారు.

పరిశోధనరావు విసుగ్గా "వెధవల్లారా, తిండి దండగ. డబ్బుల్లేని కేసు పట్టుకొచ్చారు'' అని యింకా యేదో అనబోతుంటే ఫోను మోగింది.

"హలో! నేను ఎస్సైని మాట్లాడుతున్నాను. మీరు పట్టిచ్చిన ఈ ఆత్మహత్యని, హత్యగా మార్చిన కేసుతో నా ప్రమోషన్ ఖాయం. కనుక మీ ముగ్గురికి ఇవాళ మా ఇంట్లో చిన్న విందు ఏర్పాటు చేశాను. తప్పక రండి'' అని ఫోను పెట్టేశాడు.

"ఒరే, బడుద్ధాయిలు! కేసుకి డబ్బులు రాలక పోయినా ఫుడ్ రాలుతోంది....'' అని పరిశోధనరావు ఇంకా ఏదో అనబోతుంటే ఫోను మళ్ళీ మోగింది.

"మ్రోగింది ఫోన్, పదే పదే, హృదయాలలో....'' అని ఓంకారం పాడబోతుంటే ఆపి, పరిశోధనరావు ఫోను అందుకొన్నాడు.

"హలో! నేను జీవితభీమా సంస్థ ఏజెంటు భీమారావుని

మాట్లాడుతున్నాను. మీకు, మా సంస్థ తరపున కృతజ్ఞతలు. ఆ విశ్వనాధ్‌గాడు నెల క్రితం లక్షరూపాయలకు వాడి జీవితాన్ని మా చేతిలో పెట్టాడు. వళ్ళు కొవ్వెక్కి ఆత్మహత్య చేసుకొని హత్యగా మారుద్దామనుకొన్నాడా! సారీ! ఫోను చేసిన విషయం మరిచాను.

అనవసరంగా ఆ లక్ష ఆ హనుమంతరావు చేతికి పోకుండా మీరు కాపాడారు. మా సంస్థ తరపున మీకు పెద్ద బహుమతి అందేటట్టు చూస్తాను. ఇక, ఉంటా మరి. అన్నట్టు మీరు ఇన్సూరెన్సు చేయించుకొన్నారా? తరువాత ఆ విషయం మాట్లాడుతా, వుంటా, శెలవా మరి!" అని ఫోను పెట్టేశాడు.

పరిశోధనరావు కూడా ఫోను పెట్టేసి, ఆనందంతో నాట్యం చేయసాగాడు. బాసు ఎందుకు నాట్యం చేస్తున్నాడో తెలియకపోయినా ఓం, శ్రీం కూడా బాసుతో కలపి ఆనంద నాట్యం చేయసాగారు. □

"హాండ్సప్!!"



సాగరలోయ

సీరియల్

బొమ్మిడి అచ్చారావు

(గత సంచిక తరువాయి)

31

కుహానీ ఆదేశం ప్రకారం గోతులు తవ్విన తరువాత గుంజలు పాతారు అనుచరులు. తర్వాత వెదురుబొంగు

లను వాటిపై కట్టి యిల్లులాగా తయారు చేస్తున్నారు. ఆకులు అలములు తెచ్చి వాటిపై కప్పులా వేశారు. ఎండిన ఆకుల్ని, చితుకుల్ని తెచ్చి ఇంటి కప్పుమీద పేర్చారు.

ఈ లోపల ఆడవాళ్ళు ఆ నల్లపిల్లని, మగవాళ్ళు చక్రవర్తిని అలంకరించటం మొదలుపెట్టారు. వాళ్ళ సంప్రదాయం ప్రకారం చక్రవర్తికి మొల చుట్టూ నార వస్త్రం కట్టారు. అంతకు మించి అతని శరీరం మీద యెలాంటి ఆచ్ఛాదనా లేదు. మెడలో ఏవో కాయలతోను, తీగలతోను ఓ దండ గుచ్చి వేశారు.

ఆ నల్లపిల్లకు కూడా మెడలో తీగలు, పువ్వులు గుచ్చిన దండ వేశారు. ముఖానికి ఏవేవో పసర్ల రంగులు పూశారు.

చక్రవర్తిని, ఆ నల్లపిల్లను కట్లు ఊడదీశారు. పక్కపక్కన నిలబెట్టారు. ఒకరి చేతిలో మరొకరి చేయి నుంచారు.

ఇంతలో కొందరు మగాళ్ళు కొమ్ముబూరాలు ఎత్తి పూరించసాగారు.

* * *

రాజేష్, అర్చన, వినోద్, సురేఖ, అవినాశ్ తీరం వెంట పరుగెడుతున్నారు. ఎలాగయినా ఆ దీవి నుంచి బయటపడాలి! అదీ సూర్యోదయయయ్యేలోపల.

మొదట్లో తాము ఆ దీవి ప్రవేశించినపుడు దిగిన తీరానికి చేరారు. అక్కడ తాము ప్రయాణం చేసివచ్చిన బల్లకట్టు తెప్ప వుండాలి. దానిమీద కనీసం యిక్కడి నుంచి బయటపడి సముద్రంలోకి పడితే,తర్వాతి విషయం తర్వాత చూసుకోవచ్చును.

కాని అందరి ఆశలూ అడియాసలే అయ్యాయి.

అక్కడ తాము ప్రయాణం చేసివచ్చిన తెప్ప లేదు!

అందరూ చుట్టుపక్కల అంతటా వెతికారు. ఎక్కడా తెప్ప లేదు.

"చాలా చిత్రంగా వుందే! ఇదే చోట దాన్ని మనం వదలిపెట్టాం. ఇంతలోనే ఏమయిపోయింది?" అన్నాడు రాజేష్ తెప్ప వదిలిన చోటును సూచిస్తూ.

"చిత్రంగా వుంది. ఏదయినా పెద్ద కెరటాలు వచ్చి తెప్ప సముద్రంలోకి కొట్టుకుపోయిందేమో!" అన్నాడు అవినాశ్.

"ఏమీ అర్థం కావడంలేదు. ఇప్పటి కిప్పుడు అలాంటి తెప్ప తయారుచేసుకోవాలన్నా కష్టమే! ఏది దారి?"అన్నాడు వినోద్.

అందరూ తీరం వెంబడి పరుగులాంటినడకతో వెతుకుతున్నారు. కనీసం యేదయినా దుంగలో, చెక్కలో, అలాంటి మరో ఆధారమో దొరుకుతుందేమోనని ఆశగా వెతుకుతున్నారు. వెన్నెల గుడ్డి వెల్తుర్లో వాళ్ళకి ఎలాంటి ఆధారమూ కనిపించలేదు.

"పోనీ యిప్పటికిప్పుడు కొన్ని వెదురు బొంగుల్ని చేర్చి తెప్ప తయారుచేసుకుంటేను? ఇదివరకటిలాంటిది చెయ్యలేకపోయినా, కనీసం ప్రాణరక్షణకు ఏదోక ఆధారం వుంటుంది కదా!" అన్నాడు వినోద్.

"దానికయినా ఆయుధాలుండాలి కదా! ఏదయినా కత్తో మరొక ఆయుధమో లేకుండా వెదురు బొంగుల్ని యెలా నరుకుతాం? టైం చూడబోతే నాలుగు కావస్తోంది. మరో గంటకో గంటన్నరకో తెల్లవార్తుంది!" అన్నాడు అవినాశ్.

"అది జరిగే పనికాదు. ఆయుధాలు కావాలంటే కుహానీ అనుచరుల్నే అడగాలి. మళ్ళీ అక్కడికి అడుగుపెట్టే అవకాశం శాశ్వతంగా పోగొట్టుకున్నాం. మనమే ఏదో దారి చూసుకోవాలి!" అన్నాడు రాజేష్.

"అదిగో దూరంగా యేదో బల్లచెక్కలాంటి సముద్రంలో కొట్టుకువస్తున్నట్టు కనిపిస్తోంది. పదండి పట్టుకుందాం" అన్నాడు వినోద్ సముద్రంలోకి దూరంగా చూస్తూ.

అందరి దృష్టి తీరం వెంబడి పరుగెత్తింది.

దూరంగా ఏదో చెక్క కొట్టుకువస్తోంది. అందరూ ఆశగా అటే చూడసాగారు.

కాని తీరా దగ్గరికొచ్చేసరికి అది బల్లచెక్క కానేకాదు. ఏదో జంతువు కళేబరం!

అందరూ హతాశులయ్యారు.

"అయినా బల్ల చెక్కనో, దుంగనో ఆధారం చేసుకుని పోవటానికి మనం వున్నది ఐదుగురం. ఎలా వీలవుతుంది? కనీసం ఐదుగురం కూచుని పోవటానికి వీలుగా వుండే పొడవుపాటి తేలే దుంగయితేనే తప్ప ప్రయాణం చెయ్యటం చాలా కష్టం!" అన్నాడు రాజేష్.

"వీళ్ళ ఆయుధాలు ఎక్కడుంటాయో నాకు తెలుసు" అన్నాడు వినోద్.

"ఎక్కడుంటాయి?" అందరూ ఒకేసారి అడిగారు.

"మనం యిన్నాళ్ళు నిద్రించిన కుటీరం పక్కనే వున్న చెట్టు తొర్రలో చాలా ఆయుధాలు దాచివుండగా చూశాను" అన్నాడు వినోద్.

"మళ్ళీ అక్కడికి వెళ్ళటానికి సమయం చాలదు. పైగా వాళ్ళను దాటుకునే కదా పోవాలి!" అన్నాడు

అవినాశ్.

"మరో దగ్గర దారి కూడా వుంది. కాని, అది బాగా డొంకదారి. ఈ సమయంలో పురుగుపుట్రా విపరీతంగా తిరుగుతుంటాయి. కష్టం!" అన్నాడు రాజేష్. అతని మస్తిష్కం ఆలోచనలతో బాగా వేడెక్కిపోతోంది. ఓ పక్క కుహానీ యిచ్చిన మృత్యుగడువు అంతకంతకు దగ్గర పడుతోంది.

"ఇంకో ఆలోచన వస్తోంది. మనకి మంచాలు తయారు చెయ్యటానికి కొన్ని బల్లలు, వెదురు బొంగులు వాడారు కుహానీ వాళ్ళు. వాటిని విప్పుకుని తెచ్చుకుంటే సరి! వాటినే తెప్పగా కట్టుకోవచ్చును" అన్నాడు అవినాశ్.

"కాని, వాటికోసమైనా మళ్ళీ అక్కడికి వెళ్ళాలి కదా, వాళ్ళందర్నీ దాటుకుని! అక్కడికి వెళ్తే ఆయుధాలు కూడా తెచ్చుకోవచ్చును కదా! అసలు వెళ్ళటానికి అవకాశం కనిపించటంలేదు" అన్నాడు రాజేష్.

"అదేమిటి? ఏదో బూరెలు ఊదుతున్న ధ్వని వినిపిస్తోంది! ఏదో జయజయ ధ్వానాలు అన్నట్టు ధ్వనిస్తోంది. చక్రవర్తిని వాళ్ళేం చేస్తున్నారో?" అన్నాడు వినోద్.

"ప్రాణాలతో వదిలిపెట్టరని నా అనుమానం! కుహానీ ముఖంలోని భావాలు చదవలేదా?" అన్నాడు రాజేష్.

"మరి ఆ బూరాలు....?"

"బూరాల దేముంది? పెళ్ళికి, చావుకి కూడా బూరాలు ఊదుతారు. ఇదీ అలాంటిదేనేమో."

"సమయం ఐదు కావస్తోంది. అదిగో తూర్పున తొలి వెలుగురేకలు కనిపిస్తున్నాయి కూడా!" అన్నాడు అవినాశ్ వాచీ చూసుకుని ఆకాశం వంక చూస్తూ.

అందరిలోను ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది.

"నేనో పని చేస్తాను. దగ్గిర దారి నాకు తెలుసు. నేను అవినాశ్ వెళ్ళి మన మకాం నుంచి చెక్కబల్లలు, వెదురు బొంగులు తెస్తాము. మన మంచాల కుపయోగించిన మంచెల్ని అలాగే తెచ్చేస్తాము. ఇక్కడికొచ్చాక వాటిని ఒకటిగా చేర్చి బల్లకట్టులా తయారు చేసుకుందాం" అన్నాడు రాజేష్.

ఆడవాళ్ళు భయాన్ని ప్రకటించారు.

వినోద్ "నేను కూడా రానా? ముగ్గురం అయితే తొందరగా వచ్చేయవచ్చును!" అన్నాడు.

అర్చన, సురేఖ "మేమూ వస్తాం" అన్నారు వెంటనే.

రాజేష్ మందలింపుగా చూసి, "మీరిద్దరు యిక్కడే వుండండి. వినోద్ తోడు వుంటాడు మీకు. మేము పదిహేను నిమిషాల్లో తెరిగొస్తాం" అన్నాడు, అడుగు ముందుకు వేస్తూ.

అవినాశ్ అనుసరించాడు.

దాదాపు యిరవై నిమిషాల తర్వాత రాజేష్ అవినాశ్ నిరాశగా తిరిగొచ్చారు. చేతుల్లో ఏం లేవు. ఖాళీ.

"అదేమిటి, తీసుకురాలేదేం?" అన్నాడు రాజేష్.

"ఎక్కడికి పోయినా, మనకన్న ముందు మన దురదృష్టం ప్రత్యక్షమై వెక్కిరిస్తోంది. ఎప్పుడు తీసేశారో మనకి కట్టి ఇచ్చిన కుటీరం అందులోని మంచెలు—అన్నీ పీకేశారు. చెక్కలు, బొంగులు-ఏవీ లేవు. ఏమయ్యాయో అర్థం కాదు—ఇక ఆయుధాలు వున్న చెట్టు దగ్గర ఆటవికులు కాపలా కాస్తున్నారు. ఆ దరిదాపులకు కూడా వెళ్ళటానికి వీళ్ళేకుండా వుంది" చెప్పాడు రాజేష్ ఆవేదనగా.

అందరిలోను మళ్ళీ నిరాశ చోటు చేసుకుంది.

కొ త్తగా కట్టిన వెదురు బొంగుల ఇంటికి పూలతోను తీగెలతోను తోరణాలు కట్టారు, కుహోనీ అనుచరులు.

చక్రవ ర్తిని, నల్లపిల్లను తీసుకుని ఆ యింట్లోకి వెళ్లారు. కుహోనీ దండాన్ని వాళ్ళిద్దరి శిరస్సుకి తాకించి వాళ్ళభాషలో ఏదో ఉచ్చరించాడు. ప్రజలంతా అస్పష్టంగా అతని వెంట తామూ ఆ మాటల్ని ఉచ్చరించారు.

ఆ గుడిసె లోపలిభాగం అప్పటికే రకరకాల తీగెల తోను, పూవులతోను అలంకరించారు.

చక్రవ ర్తిని, నల్లపిల్లను ఎదురు బొదురుగా నిల్చోంబ బెట్టారు. ఎర్రటి సింధూరంతో కుంకుమ దిద్దారు యిద్దరికీ. కొన్ని నీళ్ళు తెచ్చి యిద్దరి చేతా తాగించారు. ఎదురు బొదురుగా నిల్చుని వుండగానే యిద్దర్నీ తాడుతో కలిపి కట్టేశారు. చక్రవ ర్తి, ఆ నల్ల అమ్మాయి — మౌనంగా అలాగే నిల్చున్నారు.

ఈ లోపల బూరాలు ఊదటం ఆపి, డప్పులు పైకి తీశారు. నెమ్మదిగా వాయించటం మొదలెట్టారు. కాసేప ట్లోనే వాటి ధ్వనులు తారస్థాయి నందుకున్నాయి.

చక్రవ ర్తి మౌనంగా నించున్నాడు. ఆ నల్లపిల్ల అతని కళ్ళల్లోకి చూస్తోంది. అల్లరిగా నవ్వుతోంది. అతనితో మరింత సాన్నిహిత్యం ఏర్పడినందుకు మురిసిపోతోంది. ఏం జరగబోతోందో చక్రవ ర్తి ఊహకు అందటం లేదు. వాళ్ళ ప్రవ ర్తన చాలా విడ్డూరంగా అనిపిస్తోంది. చూడగా యిదేదో యీ దీవి వాళ్ళ పెళ్ళితంతులాగా వుంది. తనతో ఆ అమ్మాయికి పెళ్ళి చేస్తున్నారా?

డప్పులు అంతకంతకూ వేగం పెరిగిపోతున్నట్టనిపిం చింది. కుహోనీ చక్రవ ర్తి వంక చూపు మరల్చకుండా

చూస్తున్నాడు. చక్రవర్తి అతని చూపుల్లో చూపు కలపలేక పోయాడు.

డప్పులమోత క్షణక్షణానికి అధికమవుతోంది.

*　　　　*　　　　*

తెల్లవారటానికి కొద్ది నిమిషాలు మాత్రమే గడువుంది.

ఇంకా సేపట్లో కుహానీ మనుషులు తమని వెతుక్కుంటూ వచ్చేస్తారు. దీవిలో తామెక్కడున్నా వెతికి వేటాడి చంపేస్తారు. కుహానీ ఆజ్ఞ వాళ్ళకు సుగ్రీవాజ్ఞ! కుహానీ తత్వం తమకు తెలియంది కాదు. స్నేహానికి ఎంత ప్రాణం పెడతాడో, శత్రుత్వానికి అంతకు మించి ప్రాధాన్యత యిచ్చేలా వున్నాడు. అతిని వీరభద్ర స్వరూపం ఎన్నటికీ మరపు రావటం లేదు! ఆటవికులు ముందే మహా కర్కోటకులు!

"ఇక తప్పించుకునే దారే లేదా?" అన్నాడు వినోద్.

"అదే మనందరి సమస్యాను! కనీసం ఏదో విధంగా యీ దీవి వదిలే మార్గమే కనపడటం లేదు. వీళ్ళ చేతుల్లో నికృష్టంగా చచ్చేకంటే సముద్రంలో మునిగి చావటమే నయమనిపిస్తోంది" అన్నాడు అవినాశ్.

రాజేష్ మస్తిష్కం ఆలోచనలతో వేడెక్కిపోతోంది. మౌనంగా వుండిపోయాడు. కర్తవ్య విమూఢుడిలా వున్నాడు. కుహానీ యిచ్చిన గడువు దగ్గరపడిపోతోంది!

"నాకో ఆలోచన వస్తోంది" అన్నది అర్చన.

అందరూ ఆమె వంక ఒకేసారి చూశారు.

"మనం మొన్నటిరోజున కొండ ఎక్కినపుడు రెండు పర్వత పక్షుల్ని చూశాం కదూ! వాటిపై ఎక్కి తప్పించుకోలేమా?" అన్నది అర్చన.

"అది సాధ్యమయ్యే పనేనా? వాటిపైన ఎక్కి కూచుని

ప్రయాణం చెయ్యటం వీలవుతుందా?" అన్నాడు వినోద్.

"ఎందుక్కాదు. వాటి మూపుమీద చాలా విశాలంగా వులది. చిన్నసైజు విమానంలా వుంది. చాలా తేలిగ్గా ముగ్గురు నలుగురు కూచోవచ్చును" అన్నది సురేఖ.

"కుహానీ వాటి విషయం మనకి వివరంగా చెప్పలేదు. అవి ఏమైనా హాని చేస్తే....?"

"ఎలాగూ చావు తప్పదు. వీళ్ళ చేతుల్లోనైనా చావాలి. ఆ చచ్చేదేదో ప్రాణరక్షణకోసం ప్రయత్నిస్తూ, ఆ పక్షులకే ఆహారం అవటం మంచిది!"

"కాని సమయానికి అవి కొండమీద వున్నాయో, లేదో! ఉన్నా అక్కడి నుంచి మరో చోటికి వెళ్తాయో లేదో? మనం వెళ్ళే సమయానికే అవి దీవి వదిలిపోయి వుండొచ్చు! లేదా అసలు దీవి వదలకనే గుడ్లపై పొదుగుతూ యిక్కడే వుండిపోవచ్చు. అప్పుడు కుహానీ మనుషులకి దొరికిపోక తప్పనిసరి!"

"ఆలోచనలతో సమయం వృథా చెయ్యొద్దు. పదండి, ప్రయత్నం చేద్దాం! క్విక్!" అన్నాడు రాజేష్ పరుగులాంటి నడకతో ముందుకి ఉరుకుతూ!

అందరూ అతన్ని అనుసరిస్తున్నారు. అప్పటికి పూర్తిగా తెల్లవారిపోయింది.

33

చక్రవర్తిని, నల్లపిల్లను—ఆడవాళ్ళు ఒక్కొక్కరుగా వచ్చి వాళ్ళ యిరువురి చేతుల్లోను గులకరాళ్ళు పెట్టిపోతున్నారు.

తెల్లవారటానికి యిక ఎంతో సమయం లేదు తూర్పున వెలుగు రేకలు పూర్తిగా విచ్చుకుంటున్నాయి.

నల్లపిల్ల ముఖంలో యీసారి దైన్యం, విషాదం కని

పిస్తున్నాయి. ఈ కర్మకాండ పర్యవసానం ఆమెకు తెలుసు! అయితే చక్రవర్తికే యిదంతా అయోమయంగా వుంది. నల్లపిల్ల నడుగుదామంటే భాష రాదు! కాని యిదేదో అంతిమ యాత్రకు సన్నాహమని అతనికి తెలియకనే తెలుస్తోంది!

నల్లపిల్ల వంక ప్రశ్నార్ధకంగా చూశాడు. ఆమె నీళ్ళు నిండిన కళ్ళతో ఆర్తిగా, జాలిగా, ప్రేమగా అతన్నే చూస్తోంది.

తన కోసం తపించి ప్రేమించి తనకి సర్వస్వం అర్పించి తన గురించి ఆహుతయిపోతున్న ఆ అనాగరిక పిల్లపట్ల అతనికి అంతులేని ప్రేమ పుట్టుకొచ్చింది! అందరు చూస్తున్నారని కూడా సంకోచించకుండా ఆమె నుదుటిమీద, పెదాలమీద గాఢంగా ముద్దులు పెట్టుకున్నాడు. ఆ పిల్ల తన్మయత్వంతో చూస్తోంది. తనకీ జన్మకీ తృప్తి చాలన్నట్టున్నాయి ఆమె చూపులు!

కుహానీ కోపంతో వూగిపోతూ తన వాళ్ళకు ఏదో ఆదేశమిచ్చాడు.

చక్రవర్తి, నల్ల పిల్ల వున్న యిల్లు పూర్తిగా మూసేశారు. ఇంటి పై కప్పుమీద అప్పటికే ఎండుటాకులు, చితుకులు పోగుచేసి పోశారు.

నలుగురు అనుచరులు నాలుగు దివిటీలు తీసుకున్నారు.

కుహానీ చేతితో సంజ్ఞచేశాడు. నాలుగు దివిటీలు యింటికి నాలుగు పక్కల నిప్పు పెట్టేశాయి!

అంతే! అగ్ని జ్వాలలు ఆకాశాని కెగశాయి.

* * *

రాజేష్ బృందం వేగంగా కొండ ఎక్కుతున్నారు. అర్చన, సురేఖ ఎక్కలేక వెనకబడిపోతున్నారు. రాజేష్,

వినోద్ వాళ్ళిద్దరికీ చేయూత నిచ్చి పైకి తీసుకుపోతు న్నారు. అందరికన్న ముందు అవినాశ్ ఎక్కుతున్నాడు.

కొండ దాదాపు ఎక్కేశారు. వాళ్ళకి గూడెం నించి డప్పుల మోతలు వినిపిస్తున్నాయి. కొండపైనుండి వాళ్ళకి అక్కడి దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది.

అక్కడ ఏదో యిల్లు దగ్ధమయిపోతోంది. ఆకాశంలోకి అగ్నిజ్వాలలు ఎగిసి, అక్కడంతా సూర్యోదయమవుతున్న భ్రాంతి కలిగిస్తున్నాయి।

ముందుగా ఎవరికీ పరిస్థితి అర్థం కాలేదు. కాని, తర్వాత జరిగిందేమిటో అందరికీ అవగాహన కొచ్చేసింది. తమ మిత్రుడ్ని సజీవదహనం చేసేస్తున్నారు। భగవాన్, వీళ్ళెంత కర్కశ హృదయులు। మనిషిని నిలువునా చంపే స్తున్నారే। హృదయం కలుక్కుమంది అందరికీ.

రాజేష్ తేరుకుని, "అదిగో కుహాసీ తన అనుచరులని పిలిచి ఆదేశాలిస్తున్నాడు. బహుశా మనకోసమే అయి వుండాలి। చూడిండి, చేత ఆయుధాలు ధరించి వాళ్ళు పరు గులు పెడుతూ దీవి నలుపక్కలకీ వెళ్తున్నారు క్విక్।" అన్నాడు.

అప్పటికే అందరి దృష్టి రాజేష్ చూపిన వైపు కేంద్రీ కృతమయింది। అనుచరులు ఆయుధాలు పట్టుకుని నలు పక్కలా వెతుకుతూ వస్తున్నారు.

"అవిగో పక్షులు।" అరిచాడు వినోద్.

అక్కడ పర్వత పక్షులు పర్వత శిఖరాగ్రాన కూచుని వున్నాయి. నిశ్చలంగా ఎటో చూస్తున్నాయి. వాటి ఆకారం చూడటానికే భయం గొల్పుతున్నాయి. వాటి పైన ఎక్కి కూచోవటం సాధారణమైన పని కాదు। అవి గమ నించకపోవు। ముక్కుకి గుచ్చి అవలీలగా విసిరి పారెయ్య

గల శక్తివంతమైన పక్షు లవి!

అందరిలోను మొండి ధైర్యం వచ్చేసింది! తమకు చావు తప్పదు! అది నిశ్చయం!

ఆటవికులు కొండ దిగువకు వచ్చేశారు.

రాజేష్ తొందరపెట్టాడు తన వాళ్ళని. అందరూ పర్వత పక్షుల్ని సమీపించారు. వాటి సమీపంలో చిన్న బండరాళ్ళు కొన్ని వున్నాయి.

ఒకరొకరుగా బండలమీదుగా పక్షుల మూపుమీదికి ఎగ బ్రాకారు. ముందుగా అవినాశ్, అతని వెనక రాజేష్, అతన్ని పట్టుకుని అర్చన ఓ పక్షి మూపుమీదికి చేరారు.

వినోద్ మరో పక్షిపైకి ఎగబ్రాకాడు. అతన్ని పట్టుకునే సురేఖ ఎగబ్రాకుతోంది.

అయితే యింతలో వూహించని విధంగా రాజేష్ అర్చన, అవినాశ్‌లు కూచున్న పక్షి ఆటవికుల కోలాహలానికి బెదిరి గాలిలోకి లేచింది. ఆ పక్షి లేవటం చూసిన రెండో పక్షి తనూ అకస్మాత్తుగా రెక్కలు తాటించి గాల్లోకి ఎగిరింది. అప్పటికి సురేఖ యింకా దాని మీదికి చేరలేదు. వినోద్ ఆమెని పడిపోకుండా గట్టిగా పట్టుకుని పక్షి మూపుమీదికి లాగే ప్రయత్నం చేస్తున్నాడు.

రాజేష్ ప్రమాదాన్ని గుర్తించాడు. కాని తామేమి సాయం చెయ్యలేని పరిస్థితి! తమ పక్షి అప్పటికే బాగా ఆకాశంలోకి ఎగిరింది. రెండో పక్షికి తమకి బాగా దూర ముంది.

"వినోద్, జాగ్రత్త! కంగారుపడకు. నెమ్మదిగా పైకి లేదుకో" అన్నాడు రాజేష్ బిగ్గరగా.

కాని వినోద్‌కి సాధ్యం కావటం లేదు. సురేఖ బరువుకి అతను సాంతం ఒరిగిపోతున్నాడు.

అప్పటికి పక్షులు రెండూ సముద్ర మధ్యానికి వచ్చే శాయి. వాటి రెక్కల హోరు సముద్ర ఘోషలా ధ్వని స్తోంది.

రాజేష్ హెచ్చరిక కూడా అందనంత దూరంలో రెండో పక్షి ప్రయణిస్తోంది.

సురేఖ బాధతో అరుస్తోంది. ఆమెని పైకి లాగే ప్రయ త్నంలో వినోద్ పూర్తిగా విఫలుడయ్యాడు. చివరి ప్రయ త్నంగా పక్షి మూపుపై నుండి ఓ పక్క ఒరిగి సురేఖ భుజాలు రెండూ పట్టుకున్నాడు. పైకి లాగబోయాడు.

కాని, ఈ హడావిడికి పక్షిలో కొంత చలనం వచ్చి నట్టుంది. రెక్కలను గట్టిగా తాటించింది!

అంతే! ముందు సురేఖ, ఆమె చేతుల్ని పట్టుకుని వినోద్—యిద్దరూ పక్షి మూపుపైనుండి జారి అతివేగంగా సముద్రంలోకి పడిపోసాగారు.

రాజేష్, అవినాశ్, అర్చన హాహాకారాలు చేశారు.

వాళ్ళ కళ్ళముందే వినోద్, సురేఖ సముద్రంలో పడి పోయారు.

రాజేష్ కళ్ళు మూసుకున్నాడు, ఆ ఘోరం చూడలేక. అవినాశ్ బాధతో ఆర్తితో అటే చూస్తున్నాడు. అర్చన దుఃఖాన్ని ఆపుకోలేక ఏడ్చేస్తోంది.

వాళ్ళు ముగ్గురు ఎక్కిన పక్షి ఆకాశంలో వేగంగా వెళ్ళుతూనే వుంది తనకేమీ పట్టనట్టు!

అప్పటికి సూర్యుడు ఉదయించి చాలాసేపయింది.

34

పర్వత పక్షులు రెండూ ఆకాశంలో వేగంగా ప్రయాణి స్తున్నాయి. క్రిందికి చూసిన అర్చనకు కళ్ళు తిరిగి నట్టని

పించింది. కిందికి చూడకుండా గట్టిగా కళ్ళు మూసుకుంది.

రాజేష్ యింకా జరిగిన సంఘటన తాలూకు విషాద వాతావరణం నుంచి వాస్తవంలోనికి రాలేకపోతున్నాడు. చూస్తూండగానే కళ్ళముందు స్నేహితులు ముగ్గురు అహుతయి పోయారు. తెలీకుండా యిద్దరు—కమలనాథ్, కరుణాకర్ యిద్దరు చనిపోయారు. తను చేసిన పొరపాటుకు చక్రవర్తి ఘోరమైన శిక్ష అనుభవించాడు, సజీవదహన మయిపోయాడు. ఇప్పుడు ప్రాణం కాపాడుకోవటానికి జరిపిన పోరాటంలో సురేఖ, వినోద్ సముద్రం పాలయి పోయారు. ఇక మిగిలింది తను, అర్చన, అవినాశ్—ముగ్గురు. తమ భవిష్యత్తు ఏమి కాబోతోందో ఊహకందటం లేదు.

పక్షులు గమన వేగాన్ని తగ్గించటంతో రాజేష్ వాస్తవంలోకి వచ్చాడు. చుట్టూ పరికించి చూశాడు. కనుచూపు మేరలో అంతా సముద్రం! అయితే, పక్షులు తిరిగిన దిశ వైపు ఏదో భూభాగం కనపడుతోంది.

అవినాశ్ సాభిప్రాయంగా చూశాడు రాజేష్ వంక.

రాజేష్ తలూపాడు గమనించినట్టుగా.

పర్వత పక్షులు కిందికి దిగుతున్నాయి. రాజేష్ కళ్ళతోనే అర్చనకు సూచనలిస్తున్నాడు. ఆమె జాగ్రత్తగా పక్షి మూపుమీద కదలకుండా కూచున్నది.

పక్షులు కిందికి దిగాయి. ఓ ఎత్తయిన ప్రదేశంలో ఆగాయి. ముందుగా వెనుకనున్న అవినాశ్ దిగిపోయాడు. అర్చనని దింపటంలో సాయం చేశాడు. చివరగా రాజేష్ దిగాడు. పక్షులు తమని గమనించాయో లేదో తేలీదుగాని, తమకి ఏ విధమైన అపకారం చెయ్యనందుకు వాళ్ళు సంతోషించారు.

"ఇది మరోదీవిలా వుంది" అన్నాడు అవినాశ్.

ముగ్గురు చుట్టు పరికించి చూశారు. ఎక్కడ చూసినా చెట్లు, పుట్టలు, గుట్టలు కనిపిస్తున్నాయి. మనుష్యసంచారం వున్నట్టు కనిపించటం లేదు.

"లోపలికి వెళ్ళటం క్షేమకరమో, కాదో?" అన్నది అర్చన అనుమానాస్పదంగా.

"నాకూ అదే అనిపిస్తోంది. అయితే యీ తీరాన్న ఎంత కాలం ఎదురు చూడాలి? దారిలో ఎక్కడా మనకి నావలుగాని, మరేవిధమైన ప్రయాణ సాధనాలుగాని కనిపించ లేదు" అన్నాడు రాజేష్.

"ఇక్కడ మనుష్యు లెవరైనా వున్నారేమో చూద్దాం. కుహానీ దీవిలాగా మంచి మనుషులెవరైనా దొరికితే మనకి దారి చూపించక పోరు" అన్నాడు అవినాశ్.

రాజేష్ వెంటనే మాట్లాడలేదు.

లోపలికి వెళ్ళాలా వద్దా అన్న సంఘర్షణ చెలరేగుతోంది మనసులో.

సూర్యుడు నడినెత్తి కొచ్చాడు. ఎండ తీవ్రత హెచ్చుగానే అనిపిస్తోంది. అయితే సముద్రతీరంలో అంతవేడిమి కనిపించటం లేదు.

"లోపలికి పోయి చూద్దాం. ఇంతవరకు ఎన్నో కష్టనిష్టూరాల నెదుర్కున్నాం. ఈ దీవిలో ఎలాంటి అనుభవాలని చవిచూడాల్సి వుందో అదీ చూద్దాం" అన్నాడు రాజేష్.

ముగ్గురు ముందుకి కదిలారు. ముందుగా అవినాశ్.

పది అడుగులు వేసేవరికి అవినాశ్ కాళ్ళు చటుక్కున ఆగిపోయాయి. అతను ఆగిపోవటంతో వెనక వస్తున్న రాజేష్, అర్చన ఆగిపోయారు.

ముగ్గురి చూపులూ ఒకేచోట కేంద్రీకృతమయ్యాయి.

అక్కడ ఓ అస్థిపంజరం పడుంది.

అవినాశ్ వెనక్కి తిరిగి చూశాడు రాజేష్ వంక. రాజేష్ అస్థిపంజరం వంక పరిశీలనగా చూస్తున్నాడు. అది బోర్లా పడి వున్నది. తల భాగం వెనకవైపు కనిపిస్తోంది. ముఖం వైపు నేలను తాకి వున్నది. కాళ్ళు చేతుల ఎముకలు కూడా తిరగబడి వున్నాయి.

అర్చన చిగురాకులా వణుకుతోంది.

"ఇంకా నీకు యిలాంటి దృశ్యాలు అలవాటు కాలేదా? ఎన్నో ఘోర సంఘటనలను, దృశ్యాలను చూశావు, ధైర్యం అలవర్చుకో?" అన్నాడు రాజేష్.

"ఈ శవం పరిస్థితి చూడబోతే యీ దీవిలో మనుషులున్నారేమో ననిపిస్తోంది. అయితే యీ అస్థిపంజరం దిక్కు లేని స్థితిలో పడివున్నట్టు కనిపించటం లేదూ?" అన్నాడు అవినాశ్.

"మనుషులుండి వుంటే వాళ్ళు అనాగరికులై వుండాలి. బయటి వాళ్ళను లోపలికి రానివ్వకుండా ఎదుర్కునే వాళ్ళయి వుండొచ్చు."

"ఏం అలా అంటున్నావు?"

"అదిగో ఆ అస్థిపంజరం ఎడమచేతి మణికట్టున ఏదో వాచీ వున్నట్టుంది, చూడు!" అన్నాడు రాజేష్.

తక్కిన యిద్దరు చూసి ఉలిక్కిపడ్డారు. వాచీ వున్నది!

రాజేష్ వంగి పైకి తీశాడు. ఆటోమాటిక్ స్విస్ వాచీ! డే అండ్ డేటెడ్. అయితే పని చెయ్యటం లేదు. స్టీలు వాచీ అయినా అడుగున తుప్పుపట్టి పోయినట్టుంది. ఉప్పు గాలికి అయుండాలి!

"దుస్తులు కూడా వుండేవి. ఇవిగో పీలికలు కనిపిస్తు

న్నాయి. ఇది షర్టు, యిది పేంటు తాలూకు పీలికల్లా కని పించటంలేదూ?" అన్నాడు రాజేష్.

అస్థిపంజరం మీద అక్కడక్కడ గుడ్డపీలికలు కని పిస్తున్నాయి.

"నిజమే! యిది ఎవరో నాగరికుడి అస్థిపంజరం. దీవి లోకి ప్రవేశించేటపుడో, తిరిగొచ్చేటపుడో మరణించి వుండాలి!" అన్నాడు అవినాశ్.

ముగ్గురు కాసేపు ఆలోచనలో బడ్డారు.

రాజేష్ ముందుకి దృష్టి సారించాడు. "చాలా దట్టమైన పొదలు, చెట్లు లోపల ఏమున్నదో తెలుసుకోవటానికి అవ కాశం లేకుండా అల్లుకుపోయివున్నాయి. అయినా యింత దాకా వచ్చాం. వెనుకడుగు వేయటమెందుకు?" అన్నాడు.

ముగ్గురూ ముందుకే అడుగు వేశారు.

మరికొన్ని గజాలు వెళ్ళేసరికి మరో అస్థిపంజరం దర్శన మిచ్చింది. ఇది వెల్లికిలా పడివున్నది. కాళ్ళులేవు. ఎముకలు కనిపించలేదు. మొండెం తల భాగాల్లో ఎముక లున్నాయి.

ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"అనవసరంగా ప్రాణాలకి రిస్కు తీసుకోవటం అవు తుందేమో ఆలోచించు రాజేష్! ఇక్కడి కిక్కడే రెండు శవాలు కనబడ్డాయ్యంటే యీ దీవి భయంకర పరిస్థితి అర్థం కావటంలేదూ?" అన్నాడు అవినాశ్.

"వెనక్కు పోదామన్నా ఎక్కడికి పోతాం? వెనక అంతులేని సముద్రం. సముద్రంలో తప్పించుకుపోయే ఆధా రమూ, లేదు. తీరాన్నే ఎదురు చూస్తూ కూచోవాలి. ఏం చేద్దాం?" అన్నాడు రాజేష్.

"సరే, లోపలికే పోదాం. రోట్లో తల దూర్చాం. ఏమ

యినా భరించాలి" అన్నాడు అవినాశ్.

ముగ్గురు ముందుకి నడుస్తున్నారు.

35

సముద్రంలో పడిన వెంటనే తమకి అంతిమ ఘడియలు సమీపించాయనే అనుకున్నారు సురేఖ, వినోద్.

ముందు సురేఖ ఆ వెనుకనే వినోద్ నీటిలో పడ్డారు. సురేఖ ఒకసారి మునిగి తేలింది. వినోద్ చేయి చాపి ఆమె నందుకోబోయాడు. జుట్టు అందింది. దగ్గరకు లాక్కున్నాడు.

సురేఖ ముఖం నీటిమీదికి తేలింది. నీళ్ళు మింగలేదు, నయమే!

"సురేఖా, నా నడుము గట్టిగా పట్టుకో! తల నీటిలో మునక్కుండా జాగ్రత్త తీసుకో! నేను యీదగలను" అన్నాడు వినోద్.

అతను చెప్పినట్టే చేసింది సురేఖ.

పది గజాలు యీదేసరికి చాలా ఆయాసం వచ్చింది వినోద్‌కు. తను ఒక్కడే అయితే ఫరవాలేదు, సురేఖ బరువును కూడా తనతో మోసుకుపోవాల్సి వస్తోంది. అది అధిక ఆయాసభరితంగా పరిణమించింది తనకి!

ఈదుతూనే పరిసరాల్ని గమనిస్తున్నాడు వినోద్. ఏదైనా నీటిమీద తేలివస్తున్నదేమో అని వెయ్యి కళ్ళతో పరికించి చూస్తున్నాడు. అతని ఆశ ఫలించలేదు. అనుకున్నప్పుడల్లా ఏదో చెక్కో, దుంగో కనిపించటానికి ఇదేమైనా యింద్రజాలమా?

మరో పదిగజాలు యీదేసరికి మరీ ఆయాసంగా అనిపించింది వినోద్‌కి. వేగం బాగా తగ్గిపోయింది. ముందుకి కదలడమే కష్టంగా వుంది.

సురేఖ అతని పరిస్థితి గమనించింది.

"వినోద్, నన్ను వదిలేసి నువ్వు యీదుకుంటూ వెళ్ళిపో! కనీసం నువ్వయినా ప్రాణం కాపాడుకో!" అన్నది.

వినోద్ దెబ్బతిన్నట్లు చూశాడు ఆమె వంక.

"నువ్వేనా యీ మాట అంటున్నది? నే నంత స్వార్థపరుడిననుకున్నావా!" అన్నాడు బాధగా.

"సారీ వినూ, నా ఉద్దేశం అదికాదు. నువ్వెలాంటి వాడివో నాకు తెలీదా? నా ప్రాణం కాపాడబోయి నీ ప్రాణానికి కూడా ముప్పు తెచ్చుకోకూడదని నా ఆకాంక్ష!"

"నిన్ను వదిలేసి పోవటమన్నది నా బొందిలో ప్రాణముండగా జరగదు. బతకితే ఇద్దరం బతకాలి! లేకుంటే ప్రాణంకోసం చివరి క్షణంవరకూ పోరాడి యిద్దరంచద్దాం!" అన్నాడు వినోద్. అతని స్వరంలో దృఢనిశ్చయం స్పష్టంగా ధ్వనించింది. సురేఖకు, అతనికి తనపై వున్న అవ్యాజానురాగాలు మనసుకి తాకి కళ్ళు చెమరించాయి.

'వినూ, వినూ, నా వినూ, నువ్వు బతకాలి. నేను పోయినా ఫరవాలేదు. నువ్వు సుఖంగా బతికి బయట పడాలి' పదే పదే మనసులోనే అనుకుంటోంది సురేఖ.

రాను రాను వినోద్ పరిస్థితి క్షీణించిపోతోంది. కాళ్ళు బాగా నొప్పులు పుడుతున్నాయి. చేతులతో నీటిని పొట్ట కిందుగా తోయటం నిర్విరామంగా జరగటం వల్ల చేతులు విరిగిపోయిన అనుభూతి! తిమ్మెర్లు ఎక్కి స్పర్శాజ్ఞానమే తెలియనిస్థితి!

గమన వేగం పూర్తిగా తగ్గిపోయింది. దాహంతో నాలుక పిడచకట్టుకుపోతోంది. చివరి క్షణాలు దగ్గర పడిన విషయం వినోద్ మనసుకు తాకుతోంది. 'సురేఖా, నిన్ను కాపాడలేక

పోయాను, నన్ను క్షమించు' అనుకున్నాడు మనసులో.

మరో పది గజాలు అతికష్టం మీద ఈదగలిగాడు.

"సురేఖా, అయామ్ సారీ, నిన్ను కాపాడలేకపోతున్నాను. ఇక ముందుకు కదలటానికి నా అవయవాలు సహకరించటంలేదు. చివరిసారిగా భగవంతుడ్ని స్మరించుకో! ఎన్నో ఆపదల నుండి ప్రాణాలు దక్కించుకో గలిగాం గాని యిక లాభంలేదు. ఇవి మనకి చివరి క్షణాలు!" అన్నాడు.

సురేఖ అతని వెన్నుమీద మృదువుగా అరచేత్తో నిమిరింది.

"నాకు ఆనందంగానే వుంది వినూ, ఎక్కడో ఒక్కత్తెనూ దిక్కులేని చావు చచ్చేకంటే నీతో ఈ చివరి క్షణాలు పంచుకోవటం గొప్పగా వుంది!" అన్నది సురేఖ.

ఆమె కంఠంలో ధ్వనిస్తున్న అచంచల ప్రేమానురాగాలకు పులకించిపోయాడు వినోద్.

"చాలు సురేఖా, నీకు నా మీదున్న అనురాగం ఎంత గాఢమయినదో నాకు తెలుసు. నీ ప్రేమతో నన్ను అభిషిక్తుడ్ని చేశావు. ధన్యుడ్ని!" అన్నాడు.

"నా పిచ్చి వినూ, బ్రతుకును నీతో పంచుకోవాలన్న నా కోరిక తీరకపోయినా, ఈ విధంగా చావును పంచుకోవటం నా కెంత థ్రిల్లింగ్‌గా వుందో మాటల్లో చెప్పలేను. ప్రాణంపోతున్న భావనే రావటంలేదు" అంటున్న సురేఖ మాటలు అతని చెవులకు సోకనేలేదు పూర్తిగా. అతనికి స్పృహ తప్పిపోతున్నట్టనిపించింది.

అతని కాళ్ళు చేతులు కదలటం మానేశాయి.

36

"రాజేష్ యీ పొదల్లోంచి లోపలకు వెళ్ళటం చాలా కష్టమనిపిస్తోంది. అంతా ముళ్ళ కంపలమయంలా వుంది"

అన్నాడు అవినాశ్.

"ఇదిగో యీ పక్కనుంచి మొక్కలు కత్తిరించినట్లు, లోపలకి దారి చేసినట్టు కనిపిస్తోంది, చూడు!" అన్నాడు రాజేష్.

అవినాశ్, అర్చన ఆ వైపు దృష్టి సారించారు.

అక్కడ నేలంతా జాగ్రత్తగా ఏదో కత్తెరతో సాపు చేసినట్టు కనిపిస్తోంది. చాలా చక్కగా ఓ క్రమపద్ధతిలో కత్తిరించినట్టుగా వుంది నేలంతా. పచ్చిక కూడా ఎత్తు పెరక్కుండా గార్డెనింగ్ చేసినట్టుంది.

"చిత్రంగా వుందే! ఇక్కడ దారి పొడువునా ఓ బాట వేసినట్టు, పచ్చికశాలువా కప్పినట్టు కనిపిస్తోంది" అన్నాడు అవినాశ్.

ముగ్గురు ఆ దారిన లోపలికి ప్రవేశించారు. దీవి అంతా భీకర నిశ్శబ్దం! చెట్లమీద ఏవో పేరు తెలీని పక్షులు! అవి చేస్తున్న వింత శబ్దాలు. దూరంగా రెండు దుప్పులు పరుగులు పెడ్తున్నాయి. ఓ కుందేలు, రెండు చెవులపిల్లులు అటు యిటు పరుగులు పెడ్తూ వాళ్ళని చూసి పొదలమాటున పారిపోయాయి.

"మనకి తెలిసిన జంతుజాలమే కనిపిస్తోంది. అంతే ఈ దీవి మరీ ప్రమాదకరమయినదానిలా అనిపించటంలేదు" అన్నది అర్చన.

రాజేష్ సాలోచనగా చూశాడు.

"కనుచూపు మేర ఎక్కడ చూపినా చెట్లు, పుట్టలే కనిపిస్తున్నాయి. ఎక్కడా జనావాసం వున్నట్టు సూచనల్లేవు. దూరంగా కొండగుహలు కనిపిస్తున్నాయి. ఉంటే అందులో ఎవరైనా నివసిస్తూ వుండవచ్చు. దగ్గరకి పోయేవరకు సరైన అవగాహన కుదరదు" అన్నాడు.

రాజేష్ మాటలు యింకా పూర్తి కానేలేదు. ఒక్క సారిగా గాలి స్రరున కోస్తున్న చప్పుడు. ఆ వెనకే వికృతాకారంలో వున్న రాబందులాంటి పక్షి వాళ్ళ మీదకు దూసుకుని వచ్చింది. దాని ముక్కు దాదాపు అడుగున్నర పొడవుంది.

రాజేష్ ప్రమాదాన్ని గుర్తించాడు.

"అవినాశ్, అర్చనా, అది ముక్కులో పొడిచేలాగా వున్నది. బోర్లా భూమ్మీద పడుకోండి" అని అరిచాడు. తను నేలమీదికి ఒరిగి రెండు చేతులతోను కళ్ళు మూసుకుని బోర్లా పడుకున్నాడు. తక్కిన యిద్దరు అతనిలాగే చేశారు.

ఆ పక్షి వికృతంగా అరుచుకుంటూ వాళ్ళ వీపుల మీదుగా ఎగురుతూ పోయింది. అది మళ్ళీ గాల్లోకి లేచి పోయిందని నిర్ధారణయ్యాక లేచి కూచున్నారు.

"దాని ఉధృతం చూడబోతే కంట్లో పొడిచి పోతుందని భయపడ్డాను" అన్నది అర్చన.

"రాజేష్ హెచ్చరించివుండకపోతే అంత పనీ జరిగేది" అన్నాడు అవినాశ్.

"సో, వుయ్ మస్ట్ బి వెరీ కాషస్!" అన్నాడు రాజేష్.

అడుగు తీసి అడుగు వేస్తున్నారు.

"ఇటు యీ మొక్కలు చూడు రాజేష్, ఇవి కూడా ఏదో కత్తితో కోసినట్టు యెలా వున్నాయో!!" అన్నాడు అవినాశ్.

"ఎస్. దేంతోనో జాగ్రత్తగా కత్తిరించినట్టున్నాయి. దీన్నిబట్టి మనుషులున్నారనే విషయం నిర్ధారణవుతోంది. మొక్కలే కాదు, యీ పచ్చిక, పొదలు అన్నీ కత్తిరించి ట్టు కనిపిస్తున్నాయి" అన్నాడు రాజేష్.

కాలికేదో చుట్టుకున్నట్టయి చటుక్కున కాళ్ళవైపు చూసుకున్నాడు అవినాశ్. అతని గుండె ఝల్లుమన్నది. దాదాపు ఆరడుగుల పొడవున్న పాము! ఎప్పుడు చుట్టుకుందో కాళ్ళకు చుట్టుకుని బుసకొడుతోంది. పడగ విప్పింది. కాటు వేసేలాగానే వుంది.

రాజేష్ ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా చటుక్కున దాని పీక పట్టుకున్నాడు. అది చురుగ్గా రాజేష్ చేతిపై కాటు వెయ్యబోయింది. అతను దాని తోకను పట్టి గిరగిర తిప్పి బండకేసి కొట్టి చంపేశాడు.

అర్చన గుండె దడ యింకా తగ్గలేదు. ఆ పాము తన కాళ్ళకే చుట్టుకున్న అనుభూతి కలిగింది. అవినాశ్ సర్దుకున్నాడు.

"నేలమీద ప్రతి అంగుళం చూసి అడుగు మోపవలసిందే! పాములు కాళ్ళకి అడ్డుపడి చుట్టుకుపోయేంత అధిక సంఖ్యలో వున్నట్టున్నాయి" అన్నాడు అవినాశ్, కాళ్ళవంక చూసుకుంటూ. వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పిపోవడం ఏదో విచిత్రంగా అనిపించిందతనికి.

ఇంతలో చెట్లమీదున్న పక్షులు బాగా అలజడిగా కనిపించాయి. వికృతంగా అరవసాగాయి. అంతదాకా అటుయిటు పరుగులు పెట్టిన కుందేళ్ళు పొదలమాటున నక్కి చూస్తున్నాయి. వాతావరణంలో వచ్చిన యీ అనుకోని మార్పు అర్థంకాక ముగ్గురూ నిటారుగా నిల్చుండిపోయారు.

37

సురేఖ పరిస్థితి గుర్తించి వినోద్ తల నీట్లో మునిగిపోకుండా పట్టుకుంది.

"వినూ, వినూ" అన్నది ఆత్రంగా. అతను పలుక

లేదు.

అదే సమయంలో దూరంగా నీటిమీద ఏదో నావ పోతున్న జాడ పొడకట్టింది సురేఖకు. ఆమె ప్రాణం లేచి వచ్చింది.

చేయెత్తి గట్టిగా అరిగింది, "హెల్ప్, హెల్ప్!" అని.

షిప్పులోని సరంగులు గుర్తుపట్టారనడానికి నిదర్శనంగా షిప్పు వాళ్ళవైపు వేగంగా వచ్చింది. డెక్ మీద యిద్దరు సరంగులు తాళ్ళు పట్టుకొని సిద్ధంగా వున్నారు.

సురేఖ సంతోషంగా చేతులూపింది. వినోద్ అవయవాలు అప్పటికి పూర్తి స్వాధీనం తప్పాయి. తాడుని వినోద్ నడుంకి కట్టమని సైగ చేశారు సరంగులు. సురేఖ వాళ్ళు చెప్పినట్టే చేసింది. రెండో తాడును తన నడుముకు ముడివేసుకుంది.

సరంగులు తాళ్ళు పట్టి నావ సమీపానికి వాళ్ళిద్దరినీ జాగ్రత్తగా లాక్కున్నారు. ఈ లోపల మరో యిద్దరు వ్యక్తులు డెక్ మీది కొచ్చి సరంగులకు సాయంగా నిలబడ్డారు. అందరూ కలిసి వినోద్ సురేఖలను డెక్ మీదికి లాగేశారు.

వినోద్ యింకా స్పృహలోకి రాలేదు.

సరంగుల్లో ఒకతను సురేఖను ఉర్దూలో ప్రశ్నించాడు. సురేఖకు ఉర్దూ రాదు. హిందీ కొద్దిగా వచ్చును. వాళ్ళు అడిగినది కొద్దిగా అర్థమయింది.

"మీరెవరు? సముద్రంలో ఎలా పడిపోయారు?" అని అతనడుగుతున్నట్లు గ్రహించింది. అయితే హిందీలో వాళ్ళకు వివరించటం సరిగ్గా రాదామెకు.

ఈ లోపల వాళ్ళు వినోద్ కి స్పృహ తెప్పించటానికి ప్రయత్నిస్తున్నారు. అతని దుస్తులు బాగా వదులు చేశారు,

పొడిబట్టలతో తుడిచారు. అరచేతులు అరికాళ్ళు రుద్ది వేడి పుట్టించారు. ఇంతలో ఓ ప్రయాణీకుడు వేడి టీ తెచ్చాడు.

వినోద్‌లో కదలిక వచ్చింది. ఊపిరి భారంగా తీస్తున్నాడు. ఓ సరంగు వంగి ఆర్టిఫిషియల్ రెస్పిరేషన్‌కి ప్రయత్నించాడు. ఫలితం కనిపించింది.

వినోద్ ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో మెరుగుదల వచ్చింది. కళ్ళు తెరిచి చూశాడు. చుట్టూవున్న ఆగంతుకులను చూసి ఆశ్చర్యంగా లేచి కూచున్నాడు.

టీ తెచ్చినతను వినోద్ కందించాడు. అతను సంకోచిస్తూనే అందుకున్నాడు. వేడి టీ లోపలికి వెళ్ళగానే ఎక్కడలేని ఉత్సాహము వచ్చింది. సురేఖకు ఓ కప్పు టీ అందించాడు మరొకతను. వాళ్ళ ఆదరణకు సురేఖ, వినోద్ కృతజ్ఞతగా చూశారు.

ఇందాకటి సరంగు మళ్ళీ ఈసారి అదే ప్రశ్న ఉర్దూలోనే వినోద్ నడిగాడు. వినోద్‌కి కూడా ఉర్దూ రాదు. కాని అర్థం చేసుకోగలడు. కొద్దిగా మాట్లాడగలడు.

వచ్చీరాని ఉర్దూలో హిందీ శబ్దాలు మిళితంచేసి తమ పరిస్థితిని వాళ్ళకు వివరించాడు.

వాళ్ళు అర్థం చేసుకున్నారు. జాలిగా వాళ్ళిద్దరి వంకా చూశారు.

పది నిమిషాల్లో సురేఖకు, వినోద్‌కు భోజనం వేడి వేడిగా అమర్చారు. గోధుమ రొట్టెలు. ఆలుగడ్డలు, బఠానీ కూర ఆత్రంగా తిన్నారు ఇద్దరూ.

ఆకలి తీరాక వినోద్ వాళ్ళను వివరాలు అడిగాడు. వాళ్లు సముద్ర వాణిజ్యం చేసే అరబ్ దేశానికి చెందిన వర్తకులు. విశాఖపట్టణం సరుకు చేరవేసి అక్కడి నుంచి పంచదార, ముడి ఖనిజాలు తీసుకుని తమ దేశం

పోతున్నారు.

"ఇది ఏ ప్రాంతం? విశాఖపట్టణానికి ఎంత దూరంలో వున్నది?" అనడిగాడు వినోద్ వాళ్ళను.

విశాఖపట్టణానికి ఈశాన్యంగా మూడువందల మైళ్ళ దూరంలో వున్నట్టు వాళ్లు చెప్పారు.

వినోద్, సురేఖ ముఖాలు చూసుకున్నారు. తమ అంచనాలు తలకిందులయ్యాయి. విశాఖకు ఎన్నో వేల మైళ్ళ దూరం వెళ్ళిపోయినట్టు అనుభూతి కలిగింది యిన్నాళ్లుగా తమకు! బంగాళాఖాతంలోనే వున్నామన్న కఠిన సత్యాన్ని యిముడ్చుకోవటానికి వాళ్ళిద్దరికీ చాలా కష్టమయింది.

చాన్నాళ్ళ తర్వాత నాగరీక మనుషుల్ని, అందునా మన సున్న మనుషుల్ని కలుసుకో గలిగినందుకు చాలా సంతోషంగా వుంది వాళ్ళకు. తమ కష్టాలు గట్టెక్కినందుకు సంబరపడిపోయారు.

"మాకు విశాఖ పోవటానికి సాయం చెయ్యరా?" అని అర్థించాడు వినోద్.

సరంగు, కళాశీలు యిబ్బందిగా చూశారు.

"విశాఖపట్టణం వదిలి అయిదు వందల కిలోమీటర్లు వచ్చేశాం. వెనక్కి వెళ్ళే ప్రసక్తి లేదు. కాకపోతే మనకు ఎదురుగా ఏదైనా షిప్పు వస్తే లంగరు వేయించి మిమ్మల్ని అందులోకి ఎక్కించే ప్రయత్నం చెయ్యగలం" అన్నారు.

సురేఖ, వినోద్ ముఖాలు చూసుకున్నారు. అతి సమీపంలోకి వచ్చిన అదృష్టం జారిపోయినట్టనిపించింది. ఈ షిప్పు కనిపించటమే గగనమయిపోయింది. అలాంటిది మరో షిప్పు, అదీ వైజాగ్ వైపు పోయేది తమకు ఎదురు పడేదెప్పుడు, తాము అందులో ఎక్కి వైజాగ్ చేరుకునేదెప్పుడు? అది జరిగే పనిలా తోచలేదు వాళ్ళిద్దరికీ.

"మీ అనుమానం అర్థమయింది. వైజాగ్ పోయే షిప్పులు మాకు తరచు ఎదురుపడుతూనే వుంటాయి. ఒకటి రెండు రోజుల్లో ఏదోక షిప్పు ఎదురుకాక మానదు. మిమ్మల్ని గమ్యస్థానం చేర్పించే బాధ్యత మాది! ధైర్యంగా వుండండి" అన్నారు సరంగులు, కళాసీలు.

కొంత కుదుటపడ్డాయి వారి మనసులు.

"మీకు విశ్రాంతి అవసరం! మీకు కేబిన్‌లోని రూంలో వసతి ఏర్పాటు చేశాం. హాయిగా, నిశ్చింతగా నిద్రపోండి" అన్నాడు సరంగు.

సరంగులు చూపిన కేబిన్ రూంలో వున్న మంచాలమీద మేనులు వాల్చారు వినోద్, సురేఖ.

చాలాసేపటిదాకా యిద్దరికీ నిద్ర పట్టలేదు.

"పాపం, మన రాజేష్ వాళ్ళు ఆ సముద్రం మీద ఏం తిప్పలుపడుతున్నారో? ఆ పక్షులు వాళ్ళని ఎక్కడికి తీసుకుపోయాయో? క్షేమంగా వున్నారో, లేదో? మనం చనిపోయామని వాళ్ళనుకొని వుంటారు. మనం బాగానే వున్నాం, వాళ్ళేమయిపోయారో, ఎలా వున్నారో?" అన్నాడు వినోద్ ఆవేదనగా.

వాళ్ళ ఆలోచన రాగానే యిద్దరి మనుసులు బరువెక్కాయి.

38

కాసేపటి వరకు అర్చన, రాజేష్, అవినాశ్ పరిస్థితి అర్థం కాక ఆలాగే నిల్చుండిపోయారు. చెట్లమీదున్న పక్షుల కలరవాలు అధికమయ్యాయి. నేలమీది చిన్నచిన్న జంతువులు అటు యిటు చెంగాటలాడటం మానేశాయి. పొదల మాటున చెట్ల చాటున నక్కి కూచున్నాయి.

ఇంతలో నేలమీద ఏదో పెద్ద ఆకారం పెద్దగా చప్పుడు

చేస్తూ పాకివస్తున్నట్టు వాళ్ళు గ్రహించారు. చూడటానికి దాని ఆకారం మొసలిలాగా వుంది. బగ్గీలున్న పెళుసు దేరిన శరీరం దూరానికి జుగుప్స కలిగించేలాగా వున్నది. అది నేలమీద పాకుతుంటే పెద్దగా చప్పుడవుతోంది. దారిలో దాని మార్గంలో అడ్డుపడిన చిన్న చిన్న జంతువుల్ని ఒకటొకటే అందుకుని తినేస్తోంది.

"అవినాశ్, క్విక్. యీ చెట్టెక్కేదాం. చూడగా అదేదో క్రూరమైన జంతువులా వుంది" అన్నాడు రాజేష్.

ముందుగా అవినాశ్ చెట్టెక్కి అర్చనను చేయిసాయం పట్టి చెట్టుపైకి లాగాడు. ఆ వెనకనే రాజేష్ ఎగబాకాడు. ముగ్గురు కొమ్మలమధ్య కూచుని ఆ పురుగు వంకే దృష్టి కేంద్రీకరించి చూస్తున్నారు.

రాజేష్ అవినాశ్ చెయ్యి నొక్కి, "చూశావా ఆ వింత పురుగు సంగతి? చూడు, ఆ నేలంతా కత్తిరించినట్టు గడ్డి చదునయిపోయింది. చిన్న చిన్న కొమ్మలు ఎవరో ఫ్రెష్‌గా కత్తెరతో కట్ చేసి అనుకున్నాం. అది యీ పురుగు పనే!" అన్నాడు.

ఆ పురుగు పాకినంత మేరా, గడ్డి, చిన్న చిన్న మొక్కలు కత్తిరించినట్టు ముక్కలు ముక్కలుగా తెగి పోతోంది.

అవినాశ్ ఆశ్చర్యంగా రాజేష్ వంక చూశాడు. "అంటే యీ పురుగు శరీర నిర్మాణం చాలా వింతగా వుందన్న మాట, దాని శరీరం అంతా కత్తుల మయమయి వుంటుంది. అందుకే నేలంతా తెగిపోతోంది" అన్నాడు.

"ఎగ్జాట్లీ! మన రేజర్ బ్లేడ్సులాంటివి కొన్ని వందలు, వేలు దాని శరీరం అడుగు భాగంలో వుండి వుండాలి.

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 56 : కాశిం పరమ దుర్మార్గుడు. అతడు ఎంతమందికో అన్యాయం చేశాడు. వారిలో సుబ్బారావు, రంగాలు కూడా వున్నారు. ఇద్దరు ఒకరి తెలియకుండా ఒకరు కాశింన్ని హత్య చేయటానికి ప్లాన్ వేశారు.

సుబ్బారావు కాశిం త్రాగే విస్కీలో విషం కలిపాడు. కాశిం ఆ విస్కీ త్రాగాడు. ఆ తర్వాత రంగా వచ్చి అతన్ని కత్తితో పొడిచాడు. గుండెలో తగలటంతో కాశిం వెంటనే మరణించాడు.

తర్వాత పోలీస్ ఇన్వెస్టిగేషన్‌లో వివరాలన్నీ బయటపడి సుబ్బారావు, రంగాలను అరెస్ట్‌చేసి కేసు పెట్టారు. ఎవరికి వారు రెండవ వ్యక్తే హంతకుడని వాదించారు.

మరి మీరు ఎవరిని శిక్షిస్తారు? ఎలా?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 7-5-'83 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు జులై '83 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 54 (తీర్పు)

నటరాజ్ వేసిన దావా చెల్లదు.

నీలకంఠానికి తెలియకుండా నటరాజ్ అడ్వాన్స్ ఇవ్వడంతో నీలకంఠం బాధ్యత రద్దయింది. కావున నీలకంఠంపైన వేసిన దావా చెల్లదు.

ఈ నెల న్యాయనిర్ణేత : శ్రీ వి. వి. ఎల్. విజయ కుమార్, C/o. డి. ఆర్. కె. శర్మ, రిటైర్డు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, విజయనగరం—531 201.

లేకుంటే అంత షార్ప్‌గా, చక్కగా గడ్డి మొక్కలు తెగి పోవు!" అన్నాడు రాజేష్.

"చాలా వింతయిన అరుదయిన విషయం! పైగా దాని ఆహారం చూడబోతే యింకా వింతగా వుంది. దారిలో ఎదురొచ్చిన చిన్నచిన్న కుందేళ్ళని, చెవులపిల్లుల్ని అందుకుని స్వాహా చేస్తోంది. దాని కోరలు కూడా చాలా పదునుగా బయటకి చొచ్చుకు వచ్చినట్టు స్పష్టంగా కనిపిస్తోంది."

"మనం చూసిన దారంతా యీ పురుగు యథేచ్ఛగా విహరిస్తోందన్న మాట! అందుకే దారిపొడవునా మొక్కలు గడ్డి కత్తిరించబడుతున్నాయి."

"ఇదేదో కత్తెరపురుగులా వుందే! ఈ దీవిలో యింకా యిలాంటి వేమేమి వున్నాయో?"

"దార్లో కనిపించిన అస్థిపంజరాలు చూడబోతే యిలాంటి పురుగువాత పడ్డారేమో అనిపించటంలేదూ?"

"కావచ్చు. ఇంకా దీవి మొదట్లోనే వున్నాం. ప్రారంభంలోనే భయంకర అనుభవం...." అంటున్న రాజేష్ కళ్ళు నిశ్చలంగా ఓ చోట నిలిచిపోయాయి.

రాజేష్ మాటలు ఆగిపోవటంతో అర్చన అవినాశ్ కత్తెర పురుగు మీది నించి రాజేష్ చూస్తున్నవైపు దృష్టి మరలించారు.

ఆ చెట్ల ఆకులు దొప్పల్లా వున్నాయి. ఆ దొప్పల్లో ఏవో పురుగులు పడ్డాయి. వెంటనే ఆ దొప్పల్లాంటి ఆకులు ముడుచుకుపోయాయి. మళ్ళీ కొద్దిక్షణాల తర్వాత ముడుచుకున్న ఆకులు విచ్చుకున్నాయి.

ఇప్పుడు ఆకుల మధ్య ఆ పురుగులు లేవు!

ముగ్గురి కళ్ళు ఆశ్చర్యంతోను, విభ్రాంతితోను పెద్దవయ్యాయి. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

అపరాధ పరిశోధనపోటీ-177

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-5-83 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జులై '83 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. గత నెలలో ఇక్కడ వచ్చిన భూకంపంలో 500 మందికి పైగా చనిపోయారు—? (ఇరాన్, కొలంబియా)
2. ఇక్కడ మీకు రాచమర్యాదలు లభిస్తాయి—? (అత్తవారింట్లో, స్టార్ హోటల్లో)
3. వీటి ధరలు త్వరలో తగ్గనున్నాయి—? (కార్లు, ఇళ్ళ స్థలాలు)
4. వేసవి కాలంలో వీటి సంఖ్య ఎక్కువగా వుంటుంది—? (అగ్ని ప్రమాదాలు, ఆకలి మరణాలు)
5. ఈ సమస్య తీరేనా—? (మంచినీటి సమస్య, నిరుద్యోగ సమస్య)

రాజేష్ సంభ్రమం నుంచి తేరుకుని, "నేనా మధ్య ఓ యింగ్లీషు నవల్లో చదివాను. 'ఈటింగ్ లీవ్స్' అనే ఒక రకం చెట్ల ఆకులు ఆహారాన్ని పట్టి తింటాయని! యివి ఆ జాతివే కావచ్చు. చెట్ల ఆకులు పురుగుల్ని పట్టి ఆహారంగా భుజించటం మనం నమ్మలేం ఎవరైనా చెపితే! కాని, ఇప్పుడు ఆ అనుభవం మనకళ్ళముందే జరిగింది" అన్నాడు.

అర్చన యింకా విభ్రాంతి నుంచి తేరుకోలేదు.

"ఈ వాతావరణం చూస్తుంటే ఒళ్ళు గగుర్పొడుస్తోంది. మనం నరకానికి అతి చేరువలో వున్నట్టనిపిస్తోంది" అన్నది భయంగా.

అక్కడి నుంచి ఎప్పుడు బయటపడదామా అన్నట్టు ముగ్గురు తహతహలాడుతున్నారు.

39

ఓ రాత్రి, ఓ పగలు షిప్పులోనే గడిచిపోయాయి. ఎలాంటి నావగాని వాళ్ళకు ఎదురు రాలేదు.

"దాదాపు మరో రెండువందల కిలోమీటర్లు వచ్చేశా మనుకుంటాను. ఏ నావా యెదురుపడలేదు. ఎలా మా సంగతి?" అనడిగాడు వినోద్.

సరంగులు జాలిగా చూశారు.

"మీ అదృష్టం అలా వుంది. ఇదివరలో మాకు ఈ ళ్ళ లోపలే రెండు మూడు నావలు యెదురుపడి వుండేవి. ఆ అన్నీ వైజాగ్ రేవుకిపోయేవే అయివుండేవి. ఈసారి మరి, ఒక్కటి కూడా యెదురు కాలేదు." అన్నాడో సరంగు.

సురేఖ బేలగా చూసింది వినోద్ వంక.

"చూద్దాం. వీళ్ళ గమ్యస్థానం యిక్కడికి యెంతో దూరంలో వున్నది. ఈ లోపల మన కవసరమైన షిప్పు గాని మరేదయినా ప్రయాణ సాధనం గాని కనిపిస్తుందేమో

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 7-5-'83 తేదీలోపల మాకు చేరాలి. ఫలితాలు జులై '83 నెల సంచికలో ప్రకటిస్తాము.

మార్చి '83 పోటీ ఫలితాలు

(1) మార్చి '83 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

మనిషికి మనిషే శత్రువు కదా!
మరణం ఎవరికీ తప్పదు కదా!!

పంపినవారు: శ్రీ బి.సూర్యనారాయణ, మోహన్‌క్రిష్ణ స్టోర్స్, 6-2-42, చింతలబస్తీ, హైద్రాబాదు—500 004.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

పిస్తోలు పేలింది!
పిశాచం పిలిచింది!!

పంపినవారు: శ్రీమతి కందిగట్ల మృణాళిని, బి.కాం., ఒరియా బజార్, కటక్—1, (ఒరిస్సా రాష్ట్రము)

అంతవరకు యిదే షిప్పులో ముందుకే కంటిన్యూ కాక తప్పదు కదా!" అన్నాడు వినోద్.

సురేఖకు అతని మాటలు రుచించలేదు. రోజు రోజుకీ వైజాగ్‌కి తాము బాగా దూరమయిపోతున్న విషయం అతనికి గుర్తు చేసింది.

"ఇలా అయితే మళ్ళీ మనం వైజాగ్ చేరటానికి ఎన్ని వారాలు పడ్తుందో ఆలోచించు!" అన్నది.

వినోద్ సాలోచనగా చూశాడామెవంక.

"మృత్యు ముఖంలోంచి బయట పడ్డాం. క్షేమంగా వున్నాం. వైజాగ్ ఎలాగోలా ఎప్పటికయినా చేర్తాం. ఆ విషయం వూరికే వూహించుకుని మనసు పాడుచేసుకోకు" అన్నాడు మందలిస్తూన్నట్టుగా.

సురేఖ సంభాషణ పొడిగించలేదు.

ఆ రాత్రి మామూలుగా తమకు కేటాయించిన రూంలో నిద్రపోయారు వినోద్, సురేఖ.

ఓ రాత్రి సమయంలో ఏదో కలకలం వినిపించి చటుక్కున మెలకువ వచ్చింది వినోద్, సురేఖలకు. ఓడలో పెద్దగా గలభా జరుగుతోంది.

ఏమిటో వెంటనే అర్థంకాలేదు. కాని పరిస్థితి గ్రహించేసరికి వాళ్ళిద్దరికీ ముచ్చెమటలు పోశాయి. నిర్ఘాంతపోయి నిల్చుండిపోయారు.

సముద్ర దొంగలు నావమీద దాడిచేశారు!

దొంగలను సరంగులు, కళాసీలు ధైర్యంగా ఎదుర్కొని పోరాడుతున్నారు. అయితే దొంగలవద్ద మారణాయుధాలు అధిక సంఖ్యలో వున్నాయి. వాటితో నావలోని వర్తకుల్ని, సరంగుల్ని, కళాసీల్ని నిర్దాక్షిణ్యంగా హతమారుకున్నారు.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీనివల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

ఓ అరగంట గడిచేసరికి ముగ్గురు దొంగలతోపాటు, ఓడలోని వర్తకులు, సిబ్బంది దాదాపు అందరూ హతమయ్యారు. ఓడను నడుపుతున్న డ్రైవరు, ఓ సరంగు యిద్దరు కళాసీలు మిగిలారు. వాళ్ళు దొంగలకు లొంగిపోయారు.

దొంగలు వినోద్ సురేఖలమీద దాడి చెయ్యబోతే వినోద్ వాళ్ళకు లొంగిపోతున్నట్టు చేతులు రెండూ పైకెత్తేశాడు. సురేఖ కూడా అలాగే చేసింది.

ఓడలోని డబ్బు, బంగారం దొంగలు వశపరచుకొన్నారు. ఓడని సరుకుతోబాటు తమ ఆధీనంలోకి తీసుకొన్నారు.

సురేఖ అందానికి దొంగలు మోహితులయ్యారనటానికి నిదర్శనంగా వాళ్ళంతా సురేఖనే కళ్ళప్పగించి చూస్తున్నారు. వినోద్‌కి వాళ్ళ ప్రవర్తన జుగుప్సాకరంగావుంది. కాని, భరించాలి! వాళ్ళకు ఎదురుతిరిగితే నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేస్తారు!

తన పరిస్థితి వివరించి తమకు ఏమైనా సాయం చేస్తారేమో అడగాలనుకున్నాడు వినోద్. కాని ఇంతలోనే అనుకోని సంఘటన జరిగిపోయింది.

దొంగల్లో ఒకడు సురేఖ ఒంటిమీద చెయ్యి వేయబోయాడు. వెంటనే సురేఖ వాడి చెంప ఛెళ్ళున వాయించింది. వాడికి ఉక్రోషం వచ్చి సురేఖని గట్టిగా పట్టుకుని మీదికి లాక్కున్నాడు. ఓడలోని తక్కిన సరంగు, కళాసీలు నిస్సహాయంగా చూస్తున్నారు. (ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029
and Printed at Kranti Press, Madras-600 001.